లఘు గ్రంథాలు

# తెలుగు చిత్రకళ

శ్రీనివాస్ శిష్ట్లా

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు

తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

లఘు గ్రంథాలు

# తెలుగు చిత్రకళ

## రాతి యుగం నుండి రవి వర్మ యుగం దాకా

**శ్రీనివాస్ శిష్ట్లా**

ప్రపంచ తెలుగు మహాసభలు

**27-29 డిసెంబర్, 2012, తిరుపతి**

**పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**
మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం
హైదరాబాద్

తెలుగు చిత్రకళ

Telugu Chitrakala

రచయిత : శ్రీనివాస్ శిష్లా

ISBN : **81-86073-349-7**

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రచురణల సంఖ్య : 489

వెల : **రూ. 20/-**

ప్రతుల సంఖ్య : **5000**

ముద్రణ : **డిసెంబరు, 2012**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

---

ముద్రణ : **కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్**, విద్యానగర్, హైదరాబాద్.

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్



# నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్జ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.

కిరణ్ రెడ్డి

**(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)**

ముఖ్యమంత్రి

**V. VASANT KUMAR**, B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899



# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష. సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే "ప్రపంచ తెలుగు మహాసభల" నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

వ. వసంతకుమార్

**(వట్టి వసంతకుమార్)**

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

**ఆచార్య ఎల్లూరి శివారెడ్డి**
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

# నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వ విద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వ విద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో "తెలుగు చిత్రకళ' అనే అంశం మీద చిరుపొత్తాన్ని సకాలంలో వ్రాసి యిచ్చిన శ్రీనివాస్ శిష్లా గారికి ధన్యవాదాలు. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న విశ్వవిద్యాలయ రిజిస్టర్ ఆచార్య కె.ఆశీర్వాదం గారికి, ఆచార్య సి.మృణాళినిగారికి మరియు ఆచార్య డి. మునిరత్నం నాయకుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

## విషయసూచి

కృతజ్ఞతలు

ముందుగా 'తెలుగుదనం' గూర్చి ఓమాట

1. పరిచయం
2. శిలా చిత్రాలు
3. శాతవాహన చిత్రాలు
4. అజంతా చిత్రాలు- కొన్ని మేలు కలయికలు
5. చాళుక్య చిత్రాలు
6. చిత్రఫలకము
7. కాకతీయ చిత్రాలు
8. తెలుగు చిత్రాలు - రెడ్డిరాజులు, పద్మనాయకుల కాలం
9. విజయనగర చిత్రాలు
10. తెలుగులో కాగితం చిత్రప్రతులు - పూర్వరంగం
11. దక్కను చిత్రాలు
12. చిత్రకారులు - నందిగం నాగేశం, కామరౌతు వెంకటేశం
13. కలంకారి, వస్త్ర పట చిత్రాలు
14. కుంఫిణీ చిత్రాలు
15. ఇ.ఎం. మెర్రిక్ - ఇండియాలో ఇంగ్లీషు చిత్రకారిణి
16. రవివర్మ యుగం
17. చివరగా

# కృతజ్ఞతలు

'పెరటి మొక్క వైద్యానికి పనికిరాదు' అన్నట్లు నన్నెవరూ ఇంతదాకా ఓ పుస్తకం వ్రాయండి, మే ప్రచురిస్తాం అన్నవారు ఎవరూ తారసపడనందున నేను రచించిన పుస్తకాలు అన్నీ నేనే అచ్చు వేస్తూ వచ్చాను. కొన్ని నా పుస్తకాలకు పాఠకుడిని కూడా నేనే. చిత్రకళ మీద నేను ప్రచురించిన మూడు నాలుగు పరిశోధన గ్రంథాలు ఎవరూ పెద్దగా చదువనందునా తెలుగు కావ్యాలను ఆంగ్లంలోకి అనువదించి వాటిలో దృశ్యకళకు సంబంధించిన ఫోటోలను పొందుపరచటం ప్రారంభించాను. 2010 లో శ్రీకృష్ణ దేవరాయల ఆముక్త మాల్యద ఆంగ్ల అనువాదం ప్రచురించిన తరువాత పెరటి మొక్క చెట్టుగాను, మహా వృక్షం గాను మారినట్లుంది.

తెలుగు చిత్రకళ శిష్ట్లా చేత వ్రాయిస్తే బాగుంటుందని ప్రతిపాదించినవారు శ్రీ కందుల శివనాగి రెడ్డిగారు దీనిని అంగీకరించినవారు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు ఈ విషయం నాకు తెలియపరిచింది ఆచార్య డి. మునిరత్నం నాయుడుగారు.

నాకు అందుబాటులో లేని చిత్రాలు అందించినవారు డా. సి. చంద్రమౌళి, డా.రాఘవేంద్ర. హెచ్. కులకర్ణి. అడిగిన పుస్తకాలన్నీ ఇచ్చింది నేను ఎంతో అభిమానించే కీర్తన తంగవేలు.

వ్రాతప్రతిని, తొలి అచ్చుప్రతిని దిద్దినది మా మామగారు 'సాహితీ మిత్ర' చివుకుల రామమోహన్‌గారు. తమ గదిని ఇచ్చి నన్ను ఏకాంతంగా వ్రాసుకోనిచ్చినది శ్రీనల్లూరి మధుసూదన్ గారు. నేను అక్కడికి వెళ్లి ఇది తెచ్చుకోవాలి, ఇక్కడికి వెళ్లి ఇది తెచ్చుకోవాలి అంటే, ఈ హైదరాబాద్ మహానగరంలో నన్ను తిప్పింది నా బావమరిది చివుకుల ప్రభాకర్. నాకు ఈ మేలు చేయండి, ఆ మేలు చేయండి అంటే విశాఖపట్నం నుండి ఇ-మెయిల్ ద్వారా ఎన్నో మేళ్ళు చేసినవారు నా స్టూడెంట్స్. డి.టి.పి. చేసి చక్కగా ఇచ్చినది రాయసం పురందర్‌గారు. పెద్దవారికి నా నమస్కారాలు. పిన్నలకు ఆశీస్సులు. విషయం తెలిసిన వారికి తెలియని వారికి కూడా ఉపయోగపడేవిధంగా నా చేత 'తెలుగు చిత్రకళ' వ్రాయించింది పట్టుమని పదిరోజుల్లో నాకన్నగాడు, నా చిన్న - తమ్ముడు శ్రీకర్ శిష్ట్లా (02.01.1999-01.09.2011).

# ముందుగా, ' తెలుగుదనం' గూర్చి ఓ మాట

తెలుగు ప్రాచీనత గూర్చి అందరూ ఒక్క తెలుగుభాష తెలుగు సాహిత్యాన్నే పట్టుకుని వేళ్లాడుతూ, అటు ఇటు లాగేందుకు ఇతోధికంగా పరిశ్రమ చేస్తూ ప్రాకులాడుతూ ప్రాధేయపదుతున్నరో నాకర్థంకాని విషయం. నాకు తెలిసిందల్లా 'తెలుగుదనం' అనేది ఏది ఎక్కడ ఉంది? ఎంత ప్రాచీన కాలం నుండి ఉంది అనేది తెలుసుకోవలసి ఉంది. ఈ ప్రస్తుత పుస్తకం తెలుగు చిత్రకళ గూర్చియే అయినా తెలుగుదనం తెలుగునాట అతి ప్రాచీన కాలం నుండీ ఉందనే అంశాన్ని సూచించే ప్రయత్నం చేశాను.

ఉదాహరణకు, తెలుగు వారందరికీ మామిడికాయ ఆవకాయ మహాఇష్టం. ఇది ఒక తెలుగుదనం. తెలుగు వారికి ఉన్న ప్రత్యేక అభిరుచి. ఇది ఎంత ప్రాచీనకాలం నుండి ఉంది. మరీ ప్రాచీనం కాకపోయినా, ప్రస్తుత 'తెలుగు చిత్రకళ'లో ఈ విషయమై జరిగిన ఓ చమత్కారం ఉటంకింపబడింది.

అలాగే అతి బాల్యవివాహం ఓ దురాచారంగా కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పి, దీనిని రూపుమాపాలని కంకణం కట్టుకున్న దానికి పూర్వమే బాల్యవివాహం అతిచిన్న బాలికతో వయస్సు మీరినవారు సంభోగించటం ఒక ఆచారంగానే ఉండేది. మీరు ఏమైనా అనండి, ఏమైనా అనుకోండి ఇది నిజం. ఈ తెలుగుదనం తెలుగునాట ఆదిమానవుల కలంనుండి ఉందనే విషయం సంబంధిత అంశం, చిత్రంతో సహా ఈ ప్రస్తుత 'తెలుగు చిత్రకళ' పుస్తకంలో ఉంది. ఇదే తెలుగుదనం, 1757 లో రాజమహేంద్రి లో నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం అనే తెలుగు చిత్రకారులు రూపొందించిన 'సీతారామ కల్యాణం' చిత్రంలో కూడా ఉంది. ఈ వివరాలు కూడా ప్రస్తుత 'తెలుగు చిత్రకళ'లో ఉన్నాయి.

భరతుడు తన 'నాట్యశాస్త్ర' లో ప్రతిపాదించిన ఎనిమిది రసములలో 'శృంగారం' మొదటిరసం. ఈ రసంపై తెలుగువారికి మక్కువ ఎక్కువ. ఇది ఒక తెలుగు దనం. తెలుగునాట ఉన్న దేవాలయాలు కోటలు అన్నీ పరికించి చూస్తే తెలుగువారికి సంభోగ శృంగారమంటే మక్కువ ఎక్కువ అని తేటతెల్లమవుతుంది. తెలుగుసాహిత్యం పరికించి చూచినా ఇదే తేలుతుంది.

నాకు తెలిసినంతవరకు, ప్రపంచ మొత్తంలో మరెక్కడా లేనటువంటి అతిప్రాచీన మైన సంభోగశృంగార చిత్రం తెలుగునాట ఆదిమానవుల శిలా చిత్రం లోనే ఉంది. పైపెచ్చు ఇది అతి బాల అయిన చిన్న పాపతో వయసు మీరిన పురుషుడు చేసే సంభోగ శృంగార చిత్రం. ఇటువంటి 'తెలుగుదనం' దూరాచారమని భీమన 'సుమతి శతకం'లో ఏనాడో ఓ పద్యంలో చెప్పాడు.

కసిగాయ కరచి చూచిన
మసలక మరియొగరెగాక మధురం బగునే
విసువక యౌవనులుండగ
పసిబాలలబొందు బాదె పసరము సుమతీ

ఇక మిగిలినదంతా 'తెలుగు చిత్రకళ' లో చదువుతూ చూడండి. చూస్తూ చదవండి. మీకే తెలుస్తుంది. 'తెలుగుదనం' ఎంత సొగసో.. ఎంత ప్రాచీనమో. ఎంత చిత్రమో.

శ్రీనివాస్ శిష్ట్లా
హైదరాబాద్
(తాత్కాలిక మకాం)

# తెలుగు చిత్రకళ

## పరిచయం

వాత్స్యాయని 'కామ సూత్ర' వంటి కొన్ని శాస్త్ర గ్రంథాల్లో చతుష్షష్టి కళలు ప్రస్తావించబడినాయి. ఈ అరవై నాలుగు కళలు ఏవి అనే అంశంపై ఒక శాస్త్ర గ్రంథానికి మరొక శాస్త్ర గ్రంథానికి మధ్య సంఘీభావం లేక పోయినా అన్ని పట్టికలు 'చిత్ర లేఖనం' అని ప్రస్తావించాయి.

తెలుగులో చిత్రలేఖనం ఆంగ్లంలో పెయింటింగ్ (painting ) అని అంటారని అందరికీ తెలిసిన విషయమే. అయితే, సమాన అర్థపదాలుగా వాడు తున్నా ఈ రెండింటికీ చాలా భేదం ఉన్నది. తెలుగు చిత్రకళ తోపాటు భారతీయ చిత్రకళ అతి ప్రాచీన కాలం నుండి రేఖాప్రధానమైనది. ఇంటి ముందు వేసే ముగ్గులు ఎలాగైతే రేఖా ప్రాధాన్యమై వుంటాయో అలాగా భారతీయ చిత్రకళ సర్వస్వం రేఖా ప్రాధాన్యమైనది. అందువల్లనే మన తెలుగు భాషలో చిత్రకళ ను చిత్రలేఖనం అన్నారు. తెలుగులో అక్షరాలను, ఒక పదాన్ని ఒక వాక్యాన్ని ఎలాగైతే గీతలతో రేఖలతో వ్రాస్తారో అలాగే ప్రాచీనకాలంలో చిత్రాలను కూడా వ్రాసేవారు. ఇదేపద్ధతి పాశ్చాత్యసంపర్కం ఏర్పడే కాలం వరకు భారతదేశంలోనూ, తెలుగునాటనూ కొనసాగుతూ వచ్చింది.

ఇందుకు భిన్నంగా ఆంగ్లంలోని పెయింటింగ్ (painting) అన్నమాటలోనే ఉన్న పెయింట్ (paint) ద్వారా యూరోపియన్ చిత్రకళ అతిప్రాచీన కాలంనుండీ వర్ణ(రంగు) ప్రాధాన్యమైనది. మన ప్రాచీన చిత్రకారులు, ఏదైనా చిత్రాన్ని వ్రాయాలని అనుకున్నప్పుడు ముందుగా సర్వసాధారణంగా

నల్లరంగుతోనో ఇటుక ఎరుపురంగుతోనో ముందు రేఖాచిత్రం రూపొందిస్తారు. ఉదాహరణకు:-

ఎర్రమందారం పువ్వును కొమ్మను వ్రాయాలనుకుంటే ముందు ఆ ఆకారపు చుట్టుగీతని (outline) వ్రాసి ఆకులలో ఆకు పచ్చరంగును, ఎర్ర పువ్వుల్లో ఎరుపును చదునుగా (Flat) నింపుతారు. ఒక ఆకుపై మరో ఆకు ఉన్నప్పుడు సూర్యరశ్మి వల్ల ఏర్పడిన నీడను గాని రంగులో ఏర్పడే వర్ణరీతి (tone of colour) వ్యత్యాసాన్ని చూపించరు. అదే యూరోపియన్ చిత్రకళ వర్ణరీతి వ్యత్యాసం ప్రాధాన్యమైనది. అందుకే ఆంగ్లభాషలో చిత్ర కళను పెయింటింగు(painting) అన్నారు. అంటే రంగును పులమటం, రేఖల ద్వారా సూచించటం కాదు.

చిత్రకళ ఎలా, ఎందుకు, ఏ ప్రాంతంలో ఏ కాలంలో ప్రారంభమైంది? అనే ప్రశ్నలకు ఎన్నో ఆసక్తికరమైన సమాధానాలు దొరుకుతాయి. ఆ తొలిదశను గూర్చి చెప్పుకొనే ముందు ఒక ముఖ్యమైన విషయం తెలుసుకోవాలి.

గడిచిపోయిన కాలాన్ని దాన్ని అధ్యయనాన్ని చరిత్ర అధ్యయనము అని అంటాం కదా. అలాగే దృశ్యకళ (visual art) ను అంటే చిత్రలేఖనము, శిల్పము(sculpture) మొదలైన వాటిని ఆధారంగా అధ్యయనం చేసే దానిని కళా చరిత్ర (art history) ను ప్రధానంగా, స్థూలంగాను రెండు భాగాలుగా విభజిస్తారు. అవి:

1. చరిత్ర పూర్వకాలము(pre - historic period)
2. చరిత్ర కాలము (historic period)

ప్రపంచంలోని ఏ నాగరికతలో నైనా ఆ నాగరిక పరిణామ క్రమంలో ఎప్పుడైతే వ్రాత (script) అభివృద్ధి అయి, ఆ నాగరికతకు సంబంధించిన ఏదో ఒక అంశాన్ని వ్రాయటం ద్వారా ఒక వాచకాన్ని (text) ని రూపొందించటం ప్రారంభించబడిందో అప్పటి నుండి ఆ నాగరికతలో చరిత్రకాలం ప్రారంభమయిందని పరిగణిస్తారు. అలా వ్రాయటం లేని పూర్వకాలాన్ని చరిత్ర పూర్వకాలం అంటారు.

ప్రపంచ చరిత్రలో నైలునదీ పరీవాహక పీఠభూమి ప్రాంతంలోని ఈజిప్టు నాగరికత, టైగ్రిస్ యూఫ్రిటిస్ నదుల మధ్య వచ్చిన మెసపొటేమియా

నాగరికత, సింధూనది పరిసరాలు వెల్లివిరిసిన సింధూనాగరికత ఎంతో ప్రముఖమైనవి. ఈ మూడు నాగరికతలు దాదాపు ఒకే కాలంలో, రమారమి క్రీ.పూ. 4200-4000 మధ్య రూపుదిద్దుకున్నాయి. అదేకాలంలో ఈ మూడు నాగరికతలూ ఒక ప్రత్యేకభాషను, దానిని వ్రాయటాన్ని అభివృద్ధి పరచుకున్నాయి. ఈ మూడూ నేడు మృతమైపోయినా ఒక్క సింధు నాగరికతకు చెందిన ముద్రలు (seals) పై వ్రాసి ఉన్న వాచకాన్ని ఎలా చదవాలో అందులో ఏమి అక్షరాలున్నాయో ఎలా చదవాలో నేటికీ తెలియకుండానే ఉన్నది. అందువల్లనే సింధు నాగరికతా కాలాన్ని తొలి చారిత్రిక దశ (proto-historic period) అని పిలుస్తారు.

ఇదిగో కనుగొన్నాము, అదిగో కనుగొన్నాము, అని అప్పుడప్పుడు ప్రకటనలు చేసినా, సింధు నాగరికతలో వ్రాసిన అక్షరాలను, అక్షరాల కూర్పుతో ఏర్పరిచిన వాచకాన్ని నేటి వరకు ఎవరూ కూడా చదివి అర్థం చేసుకోలేక పోతున్నారు. ఇదే కనుక ఎవరైనా చేయగలిగితే, భారత ప్రభుత్వం వారు వెంటనే ఆ వ్యక్తికి 'భారతరత్న' బహూకరించి బ్రహ్మరథం పడతారని భావిస్తాను.

ఇంతకూ, చిత్రకళ అనేది భారతదేశంతో పాటు, తెలుగునాట యావత్ ప్రపంచంలో రమారమి క్రీ.పూ. 4000 - 4200 కు ఎన్నో వేల ఏళ్లకు పూర్వమే ఆదిమానవులు (early men ) లేదా చరిత్ర పూర్వమానవులు (pre - historic men ) లచే శ్రీకారము గావించబడినది.

డార్విన్ (Darwin) ప్రతిపాదించిన జీవ పరిణామసిద్ధాంతం స్థూలంగా చెప్పాలంటే అదేదో సినిమా పాటలోని చరణం మననం చేసుకుంటే చాలు. ఆచరణం," కోతి నుండి పుట్టాడు మానవుడు." ఇతర జంతువుల్లలా మనిషి కూడా జంతువే అయినా ఈ జంతువుకు ఒక ప్రత్యేక లక్షణం ఉంది. మనిషికి కొత్త కొత్త విషయాలు కనుగొనటం (invention) ఓ ప్రత్యేక లక్షణం. మరోమనిషి కనుగొన్న దానిని అనుకరించటం (imitation) దానికి మార్పులు చేర్చి ఇంకా అభివృద్ధి పరచటం (improvisation) మనిషికి వున్న ప్రత్యేక లక్షణం. ఇది ఏ ఇతర జంతవులలోనూ లేదు.

కోతి నుండి మనిషిగా మారిన పరిణామ క్రమంలో ఒకానొక దశలో వేలవేల సంవత్సరాల క్రితం మనిషి రెండు కాళ్లపై నిలిచి ముందుకు

నడవనారంభించాడు. ఈ నడకలు, పరుగుల ప్రారంభంలోనే తన రెండుచేతులను సంపూర్ణంగా, పుష్కలంగా వాడటం అలవాటు చేసుకున్నాడు.

ఏజంతువూ వస్త్ర ధారణ చేయదు; మనిషి వస్త్ర ధారణ చేస్తాడు. ఏ జంతువూ ఆహారాన్ని వండి తినదు; మనిషి వండి తింటాడు.

కొన్ని పక్షులు గూళ్లను నిర్మిస్తాయి. అయితే ఇవి ఎప్పుడూ ఒకే రకంగా ఉంటాయి. మనిషి నిర్మించి నివసించిన గృహాలు నిరంతరం కొత్తకొత్త సదుపాయాలతో పరిణామం చెందుతూ ఉంటాయి.

అలాగే ఆది మానవుడు, ఎన్నో వేల సంవత్సరాలకు పూర్వమే శిల్పాలను, చిత్రాలను రూపొందించాడు. ఆది మానవులు చరిత్ర పూర్వకాలంలో వేసిన చిత్రకళ ను చరిత్ర పూర్వ చిత్రకళ (pre- historic paintings) అని అంటారు. తాము నివసించిన రాతిగుహలలోను, గూడులాగా ఉండే రాతిబండలపైన ఈ చిత్రాలు వేసినందున శిలాచిత్రాలు (rock art) అని కూడా అంటారు.

ఆదిమానవులు రూపొందించిన శిలాచిత్రాలు ప్రధానంగా రెండు రకాలు. ఒకటి రంగుతో కుంచెతోనూ కట్టెపుల్లతోనూ రాతిపైన వ్రాసిన చిత్రాలు. రెండు సూది దబ్బనం వంటి మొన తేలిన పనిముట్టుతో రాతిపై గోకి వ్రాసిన చిత్రాలు.

ఆది మానవుల కాలంలో తెలుగు భాష ఉన్నదో లేదో చెప్పటం సాధ్యపడే విషయం కాదు. అందువల్ల ఆది మానవులు వేసినచిత్రాలను తెలుగు చిత్రకళ అనటం సబబేనా అన్న సందేహం కలుగవచ్చు. మనమంతా తెలుగువారము. తెలుగునాట ఆదిమ కాలంలో నివసించినవారు మన పూర్వీకులు. అందువల్ల వారు రూపొందించిన చిత్రాలను తెలుగు చిత్రకళారూపాలు అనటం సబబే.

# శిలా చిత్రాలు

నేటికీ చిత్రకళను అభ్యసించేవారు కొద్దిమందే అనవచ్చు. కొందరు, ఏ పదవతరగతి, పన్నెండవ తరగతి చదువుతున్న రోజుల్లో తమ అభిమాన సినీ కథానాయకుని, సినీ కథానాయకి చిత్రాలను ఫోటోగ్రాఫ్ చూసి గీస్తూ ఉంటారు. అలా గీయటం, ఆ చిత్రాన్ని తమ గదిలో మంచం పక్కన గోడకు తగిలించటం వారికి సంతోషాన్ని సంతృప్తిని కలిగిస్తుంది. వీరిలో కొందరు దృశ్యకళను బోధించే కళాశాలలో చేరి చిత్రకళను అభ్యసిస్తారు. అప్పుడు, చిత్రాలను రూపొందించటమనేది తమ నైపుణ్యతను పెంపొందిస్తుందని, ఉత్తరోత్తమ తమకు జీవనోపాధి కల్పిస్తుందనే ఉద్దేశం ఉంటుంది. వీరిలో సృజనాత్మకత గల కొందరు, తమకు ఇష్టమైన చిత్రాలను కూడా రూపొందిస్తారు. ఇది తమ స్వముఖ చిత్రం(Self portrait) తమకు ఇష్టమైన వ్యక్తి ముఖచిత్రం(portrait of a favourate person) తమకు నచ్చిన భూప్రదేశ చిత్రం (landscape painting) ఇలా పలుకరాలుగా ఉంటాయి. ఇటువంటి చిత్రాలు, ఆయా చిత్రకారులను సంతృప్తిపరుస్తాయి. మనసుకు ఆనందాన్ని సమకూరుస్తాయి.

రాతి బండల నీడన, సహజసిద్ధమైన రాతి గుహలలో నివసిస్తూ, వేట ప్రధానంగా ఉన్న ఆది మానవుడు రాతిబండలపై చిత్రాలను ఎందుకు రూపొందించినట్లు? ఆనాడు వేసిన చిత్రాలను ఈనాడు మనం చూచి మెచ్చుకుంటామనే ఉద్దేశంతో వేశారా? ఇటువంటి ప్రశ్నలకు సమాధానం చెప్పుకోబోయే ముందు, ఈ శిలా చిత్రాలు తెలుగునాట ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకుందాం.

స్పెయిన్(Spain) దేశంలోని అల్టామీరా(Altamira) లో ఉన్న గుహలలోని

శిలాచిత్రాలను 1880లో కనుగొనటానికి చాలా పూర్వమే. 1867- 68లో ఎ.సి. కార్లే (A.C. Carylle) అనే వ్యక్తి భారతదేశంలోని శిలా చిత్రాలగూర్చి తొలిసారిగా వెలుగులోకి తెచ్చాడు. 1957లో పూనాకు చెందిన విష్ణు ఎస్. వాకంకర్ (Vishnu S. Vakankar) మధ్యప్రదేశ్‌లోని భీబేటికా (Bhimbetka)లో ఉన్న శిలాచిత్రాలను కనుగొనిన తరువాత ఈ పరిశోధన ఊపు అందుకొని ఎంతో ముందుకు సాగింది. భీబేటికాలో కొన్ని వేవేల శిలాచిత్రాలు లభించాయి. అసంఖ్యాకమైన ఇన్ని శిలాచిత్రాలు ఉన్న స్థావరం (site) ప్రపంచంలో మరొకటి లేదు. పుస్తకాలలో ఇచ్చిన ఫొటోలు, నకలు చిత్రాలు చూస్తుంటే ఒక్కసారి ఈ ప్రదేశం చూస్తే బాగుంటుంది కదా అని అభిరుచి కలవారికి అనిపిస్తుంది.

తెలుగునాట, ఇంతవరకు జరిగిన పరిశోధనలో వెలుగులోకి వచ్చిన శిలా చిత్రకళ ఉన్న  స్థావరాలు 28. వాటి వివరం పట్టిక:1 లో చూడండి.

| వ.సం | స్థావరం | జిల్లామండలం | చిత్రాల వివరం | చిత్రం రంగు |
|---|---|---|---|---|
| 1 | ఆదోని | కర్నూలు -ఆదోని | మూపురంగు ఎడ్లూ, జింకలు జంతువులు రేఖా గుర్తులు | ఎరుపు |
| 2 | బొల్లారం | కర్నూలు-నందికొట్కూర్ | వివిధ ఆకారాల్లో ఉన్న చిత్రాలు రేఖా గుర్తులు | ఎరుపు |
| 3 | బుదగావి | అనంతపురం - ఉరవ కొండ | మూపురంగల ఎద్లు, మనుషులు, చేతిముద్రలు జింకలు, రేఖాగుర్తులు | ఎరుపు తెలుపు |
| 4 | బుడిగేపల్లి | కరీమ్నగర్- హుస్నాబాద్ | మూపురంగల ఎద్లు, గుర్రంపై ఆయుధాలు పట్టి రేఖాగుర్తులు | ఎరుపు |
| 5 | చింతకుంట | కడప- ముద్దనూరు | మూపురంగుఎద్లు, జింకలు ఇతర జంతువులు ఆయుధాలు పట్టిన మనుషులు | ఎరుపు తెలుపు |
| 6 | దుర్గం | మహబూబ్నగర్ - కొల్హాపూర్ | రేఖారూపాలు, రేఖాగుర్తులు | ఎరుపు |
| 7 | దాపల్లి | కడప- జమ్మలమడుగు | జింకలు,రేఖారూపాలు, రేఖాగుర్తులు,మతచిహ్నాలు | ఎరుపు తెలుపు |
| 8 | దూపాడు గట్టు | మహబూబ్నగర్ కొడంగల్ | మూపురంగల ఎద్లు, జింకలు,రేఖాగుర్తులు | ఎరుపు |
| 9 | ఎడతనూరీ | మెదక్- మెదక్ | ఆయుధాలుపట్టిన మనుషులుజంతువులు రేఖాగుర్తులు | తెలుపు |

| వ.సం | స్థావరం | జిల్లామండలం | చిత్రాల వివరం | చిత్రం రంగు |
|---|---|---|---|---|
| 10 | గవిబండ | చిత్తూరు సత్యవీడు | ఆయుధాలు పట్టిన మనుషులు జంతువులపై స్వారీ చేస్తున్నవారు నాట్యం చేసే మనుషులు త్రిశూలాలురేఖాగురర్తులు | ఎరుపు తెలుపు |
| 11 | కేతవరం పులిచింతల | కర్నూలు - నందికొట్కూర్ | జింక తదితర జంతువులు చేతిముద్రలు రేఖాగుర్తులు | ఎరుపు,నలుపు, పసుపు |
| 12 | కోకాపేట | రంగారెడ్డి - రాజేంద్ర నగర్ | దుప్పితల మనుషులు రేఖాగుర్తులు | ఎరుపు, |
| 13 | కలువబుగ్గ | కర్నూలు -నంద్యాల | జింకలు, రేఖాగుర్తులు | ఎరుపు తెలుపు |
| 14 | మూడుముల | మహబూబ్‌నగర్ మఖతల్ | జంతువులు మాతృమూర్తి మూపురంగల పశువులు | ఎరుపు |
| 15 | నాయుడు పల్లి | ప్రకాశం మార్కాపురం | రేఖామాత్రంగా చెక్కబడిన మూపురం గల ఎడ్లు గుర్రాలు, మనుషులుఆయుధాలు | - |
| 16 | పాండవుల గట్టు | వరంగల్లు -రేగొండ | జింక, ఆయుధ ధారులు గుర్రపురౌతులు శాసనాలు పురాణ చిత్రాలు | ఎరుపు, తెలుపు, పసుపు, నీలం, ఆకుపచ్చ ముదురు గోధుమ |
| 17. | రేకొండ | కరీమ్‌నగర్ - హుస్నాబాద్ | ఆయుధాలు పట్టిన మనుషులు, గుర్రాలు రేఖాగుర్తులు | ఎరుపు, తెలుపు |

| వసు | స్థావరం | జిల్లా మండలం | చిత్రాల వివరం | చిత్రం రంగు |
|---|---|---|---|---|
| 18 | రేకొండ | కరీమ్‌నగర్ హుస్నాబాద్ | పొడుగాటి కత్తి, డాలుచేపట్టిన వ్యక్తి | - |
| 19 | రామగుండం | కరీమ్‌నగర్ - పెదపల్లి | రేఖాచెక్కడం మనుషులు- రేఖాగర్తులు | ఎరుపు |
| 20 | రామచంద్రపురం | ఖమ్మం - సత్తుపల్లి | మనుషులు రేఖాగుర్తులు | ఎరుపు, |
| 21 | సంగినేని పల్లి | మహబూబ్‌నగం- ముక్తల్ | పెద్దజింకలు. కొండతాబేలు. మనుషులు జంతువులు | ఎరుపు |
| 22 | తెనగల్ | అనంతపురం - రాయదుర్గం | మూపురంగల ఎద్లు, జింకలు రేఖాగుర్తులు | ఎరుపు |
| 23 | వేల్పు మడుగు | అనంతపురం ఉరవకొండ | రేఖామాత్రంగా చెక్కబడిన మూపురం గలఎద్లు,మనుషులు | - |
| 24 | వెంబఖండ్రిగ | చిత్తూరు - సత్యవీడు | మనుషులు, గుర్తులు | తెలుపు |
| 25 | వర్గల్ | మెదక్ గజ్వేల్ | రేఖామాత్రంగాచెక్కిన మూపురం గల ఎద్లు, ఆయుధాలుపట్టిన మనుషుల గుర్తులు | - |
| 26 | లంజబండ | కర్నూలు వెల్దుర్తి | జింకలు,మూపురంగల ఎద్లు, మనుషుల గుర్తులు | ఎరుపు |
| 27 | దొంగల గట్టు | మహబూబ్ నగర్ కల్వకుర్తి | జంతువులు మనుషులు | - |
| 28 | జూపల్లె | మహబూబ్ నగర్ కల్వకుర్తి | చిత్రాలు(?) | - |

ఆదిమానవుల శిలా చిత్రాలకు ఎంచుకున్న వస్తువు (object) ని గమనిస్తే ఎక్కువగా మూపురం ఉన్న ఎడ్లు, ఆవులు, జింకలు, దుప్పి మొదలయినవే కనిపిస్తాయి. ఆ రోజుల్లో అడవులలో పులులు, సింహాలు చిరుతపులులు ఇత్యాది క్రూరమృగాలు కూడా కచ్చితంగా వుండి ఉంటాయి. ఈ క్రూర జంతువులనుకాకుండా శాకాహార జంతువులైన ఎడ్లు, ఆవులు, జింకలు (చిత్రం: 2. 1.) వగైరాలను మాత్రమే తమ శిలా చిత్రాలకు వస్తువుగా తెలుగు ఆదిమానవులు ఎందుకు స్వీకరించారు?



(చిత్రం: 2. 1.)

ఆదిమానవుల దశను దాటి తొలి నాగరికుడైనప్పటి నుండి భారతీయులు, అందులోనూ తెలుగువారు సాకినవిఈ జంతువులే- ఆవులు, ఎడ్లు, బర్రెలు, దున్నపోతులు వగైరా. నేడు దుప్పులు, జింకలను సాకటం కనుమరుగైనా భారతీయ చరిత్ర ప్రారంభమై, తెలుగు చరిత్ర ప్రారంభమైన నాటినుండి రాచరికం రాణించిన 19వశతాబ్దం మధ్య కాలం వరకు మనదేశంలోను, తెలుగునాటను కూడా జింకను పెంచటం పరిపాటిగానే ఉండేది.

నేటికీ మనమందరం మన జేబులో ఉంచుకునే డబ్బుసంచీ (purse) లో పెట్టుకునే చిత్రం, మనం చేరువ కావాలని ఆశించే వారి చిత్రమే అవుతుంది! ఉదాహరణకు: ఒక అబ్బాయి ఒక అమ్మాయిని ప్రేమించాడనుకుందాం. ఆ అబ్బాయి ఆ అమ్మాయికి చేరువ కావాలని ఆశిస్తాడు. అందుకు తొలిమెట్టుగా, ఎలాగో అలా అష్టకష్టాలు పడి, ఆ అమ్మాయి చిత్రాన్ని (సర్వసాధారణంగా నేడు అది ఫోటోగ్రాఫ్) సంపాదించి తన డబ్బు సంచీలో పదిలంగా ఉంచుకుంటాడు. అలా ఉంచుకున్నప్పుడు ఆ అమ్మాయి తన వద్దనే ఉన్నదని తాను ఆ అమ్మాయిని పొందగలిగాననే భావన సంతృప్తి అతనికి కలుగుతాయి. ఈ అబ్బాయే కనుక చిత్రకారుడయితే, తాను పొందాలనుకుంటున్న అమ్మాయి ముఖచిత్రాన్ని

స్వయంగా చిత్రించి తన డబ్బు సంచిలోనూ, చదివే పుస్తకం మధ్యనో, పెద్దలు మందలించకపోతే, తన పడక మంచం పక్కనే ఉన్న గోడకు తగిలించు కుంటాడు. రోజూ ఆ అమ్మాయి బొమ్మను పదిసార్లు చూచుకొని ఆ అమ్మాయిని పొందాననే భావనతో ఎంతో సంతృప్తిని పొందుతాడు, మురిసిపోతాడు.

దాదాపు అందరూ చవి చూచిన ఈ అనుభవం అనుభూతి దృష్ట్యా ఒక విషయం కచ్చితంగాచెప్ప వచ్చు. ఆది మానవుడు అన్ని జంతువులను వేటాడినా, ముఖ్యంగా మన తెలుగునాట ఉన్న ఆదిమానవులు ఆవులు, ఎద్దు, జింకలను మచ్చిక చేసుకోవాలని తపన పడ్డారు. వాటిని మచ్చిక చేసి పెంచగలిగితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని గుర్తెరిగారు. అందువల్లనే ఆ జంతువులనే తాము నివాసం వున్న గుహలలో చిత్రీకరించారు. ఆది మానవునికీ అందునా తెలుగువారి పూర్వీకులైన మన ప్రాంత ఆదిమానవులకు ఈ జంతువులపైననే ప్రీతి ఉండడం ఓ ప్రత్యేక విశేషం. ఈ విశేషం భారతదేశంలోని ఇతర ప్రాంత శిలా చిత్రాలలోనూ కొంతవరకు గోచరిస్తుంది. కాని ఇది యూరప్ దేశాలలో కనుగొన్న శిలాచిత్రాలలో ఏ మాత్రమూ గోచరించదు. యూరోపు శిలా చిత్రాలలో జంతువేటపై వ్యామోహం మెండుగా కనిపిస్తుంది. తెలుగు శిలా చిత్రాలలో ఒక్క జంతువు వేట దృశ్యం కూడా లేకపోవటం ఈ సందర్భంగా గమనించదగినది. తెలుగు శిలాచిత్రాలలో ఆవు, ఎద్దు, జింక వంటి జంతువులు ఉన్నాయి. అక్కడక్కడ వాటి ప్రక్కనే ఆయుధాలు పట్టిన మనిషి రూపాలు ఉన్నాయి. ఇలా జంతువును మనిషిని ప్రక్కప్రక్కన చెక్కినపుడు జంతువు యొక్క ఆకారం (form) మనిషి కన్నా ఎంతోపెద్దదిగా ఉన్నట్లుగా చూపించారు. దీని ద్వారా ఆ జంతువు ఆ మనిషికి ఎంతో ప్రాధాన్యమైనదనే విషయం తెలుస్తున్నది.


ఆదిమానవ దశలో ఉన్న తెలుగువారికి, ఆవులు, ఎద్లను జింకలను వేటాడాలన్న ఆసక్తి కన్నా వాటిని మచ్చిక చేసుకుని ప్రేమ ప్రయోజనం పొందాలనే జిజ్ఞాస అధికంగా ఉండేదని శిలా చిత్రాలు తేటపరుస్తున్నాయి.

తెలుగు శిలా చిత్రాల గూర్చి చివరగా మరో ముఖ్యమైన అంశం చెప్పవలసి ఉన్నది. మన నాగరికత ఎంతో పరిపక్వమై ప్రతీ అంశంపైన శాస్త్రగ్రంథాలు వెలువరిస్తున్న కాలంలో భరతుడు 'నాట్యశాస్త్రం' అనే గ్రంథాన్ని రచించాడు. అందులో భరతముని ప్రతిపాదించినవి, ఎనిమిది రసములు. ఈ ఎనిమిది

రసాలలో మొదటిరసం 'శృంగారం' ఈ రసంపైన తెలుగువారికి ఆదిమానవుల కాలంనుండి కొంత ఎక్కువే ఆసక్తి ఉన్నది. అందులోనూ, మన పూర్వీకులైన తెలుగువారికి 'సంభోగశృంగారం' పైననే మక్కువ ఎక్కువ అని చెప్పవచ్చు. చాళుక్య యుగం నుండి కడపటి రాజుల యుగం వరకు తెలుగునాట నిర్మించిన దేవాలయాలన్నింటిలోనూ ఎక్కడో ఒక మూల సంభోగ శృంగారంలో లీనమైన స్త్రీ పురుష చిత్రణ శిల్పం రూపంలో కనీసం ఒక్కటైనా ఉండకపోదు. ఈ సంభోగ శృంగారంపై తెలుగువారికి సర్వదా కల ఈ ఆసక్తి ఆదిమానవకాలంలో కూడా ఉండటం విశేషం.

కడప జిల్లాలోని 'ముద్దనూర్' కి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో చింతకుంట అనే ప్రదేశంలో స్థానికులు 'ఎద్దుల ఆవుల గుండు' అని పిలిచే సహజ శిలాస్థావరం ఉంది. దీని ప్రక్కనే ఒక గుహనుండి నీరు నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. దీనిని స్థానికులు 'జింకలగుహ, జింకల కుంట' అని పిలుస్తారు. ఈ చిత్రాలను గూర్చి పరిశోధించిన ఎన్. చంద్రమౌళి మాటలలో చెప్పాలంటే "ఈ చిత్రాలు చాలా చక్కగా పదిలంగా ఉండటమే కాకుండా చూచేందుకు కంటికి ఇంపుగా కూడా ఉన్నాయి."

ఇక్కడ ఏడవ రాతి స్థావరంగా గుర్తింపబడిన చోటున ఒక పురుషుడు, ఒక స్త్రీ సంభోగంలో లీనమైన దృశ్యం చిత్రింపబడివున్నది. (చిత్రం : 2.2.:2.3) ఈ శిలా చిత్రంలో స్త్రీ పురుషులు ఇద్దరు నేలపై తమ తమ వీపులను చదునుగా ఆనించి ఒకరితో ఒకరు రమిస్తున్నారే మోనన్నట్లుగా చిత్రీకరింపబడ్డారు.



(చిత్రం : 2.2.

స్త్రీ కన్నా పురుషుడు వలంగా బలంగా ఉన్నాడు. 'ఏం విడ్డూరం' అన్నట్లు


పురుషాంగం మరీపొడవుగా వుండి స్త్రీ కాళ్ళమధ్య చొరబడుతున్నట్లున్నది.

పరిశోధకుడు గమనించినట్లు ఈ స్త్రీకి స్తనములు (secondary sexual organs) లేవు. అందువల్ల ఇది నాదృష్టిలో ఒక బాలతో వయస్సు మీరిన పురుషుడు జరుపుతున్న రతీక్రీడ. దీనిబట్టి బాల్య వివాహ సమస్య తెలుగునాట ఆదిమానవుల కాలం నుంచే ఉంది. ఉంటడమేకాదు. అది తెలుగు చిత్రకళలో ఆ దశలోనే చిత్రీకరింపబడినది. ఇది ఎంతో విశేషమైన అంశం. నాకు తెలిసినంతవరకు యూరప్‌లో లభించిన శిలా చిత్రాలలో ఎక్కడా రతిక్రీడను చూపించలేదు. ఈ అంశం భారతీయ శిలా చిత్రాలలో అక్కడక్కడా కొంత గోచరిస్తుంది. ఈ తెలుగు శిలా చిత్రాలలో ఎంతో సామాజిక స్పృహ ఉండటం చెప్పుకోతగ్గ విశేషాంశం.

# శాతవాహన చిత్రాలు

తెలుగు నాట చరిత్ర అన్నది మౌర్య చక్రవర్తి అయిన అశోకునితో (268-22 బి.సి.) ప్రారంభమయింది. ఇతడు వేయించిన శాసనాలు కర్నూలు జిల్లాలోని ఎర్రగుడి, రాజుల మందగిరి వద్దను, గుంటూరు జిల్లాలోని అమరావతిలోనూ లభించాయి. ఆ కాలంలో తెలుగు నాడునుపాలించిన మహారాజులునాణాలను విడుదల చేశారు. సుమారు క్రీ.పూ. ఒకటవ శతాబ్దపు ప్రారంభంలో శాతవాహనులు పాలనలోని వచ్చారు. పురాణాల ప్రకారం పదిహేడు లేదా పంతొమ్మిది శాతవాహన చక్రవర్తులు 300 సంవత్సరాలు పాలించారు. ఇంకొక వివరం ప్రకారం ముప్పై శాతవాహన చక్రవర్తులు 460 సంవత్సరాల పాటు పాలించారు.

కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ మండలంలోని బుడిగపల్లిలోని శిలాచిత్రాలలో గుర్రపు స్వారీ చేస్తున్న మనుషుల చిత్రాలు (చిత్రం : 3.1) వున్నాయి. అలాగే ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని నిడుపల్లిలో ఏనుగు స్వారీ చేస్తున్న మనుషుల చిత్రం (చిత్రం : 3.2) ఉంది. ఇవి జంతువులను మనుష్యులు పెంచటాన్ని వాహనంగా వాడటాన్ని సూచిస్తున్నాయి. కనుక ఇవి తెలుగువారి తొలి చారిత్రిక దశలో వేసిన చిత్రాలుగా భావించవచ్చు.



(చిత్రం : 3.1)

శాతవాహనుల పాలనాకాలంలో తెలుగునాటబౌద్ధము, జైనమతము, హిందూమతము బహుళ జనాదరణ పొందినవి. వాల్మీకి సంస్కృతం ఆదికావ్యంగా రచించిన రామాయణం కూడా బహుళ ప్రచారంలో ఉన్నది. వాల్మీకి రామాయణం లోనే చిత్ర , శిల్ప వాస్తు కళ Architecture ప్రస్తావనలు కొన్ని వున్నాయి. ఉదాహరణకు హనుమంతుడు లంకాపురం చేరి రావణుని నివాస మందిరాలలో తిరిగినప్పుడు "దంతాః తరిత రూపికాం"లను గమనిస్తాడు. దీనిని బట్టి ఆకాలంలో రాజప్రసాదాలలో ఏనుగు దంతాలతో చేసిన బొమ్మలు వుండేవని తెలుస్తున్నవి. అలాగే

(చిత్రం : 3.2)



"ధూమ్రామగరు ధూపేన విమలాం హంస పాండురాం
చిత్రం పుష్పోపహారేణ కల్మాషీమివ సుప్రభాం"

అన్న శ్లోకాన్ని బట్టి ఆకాలంలో భవనాలు స్వచ్ఛమైన తెల్లని హంసల వలె, పొగవలె, బూడిదవలె తెల్లని సున్న వేయబడి ఉండేవని, వాటిపై వివిధ రంగులతో వ్రాసిన పుష్పాలంకరణ చిత్రాలు ఉండేవని తెలుస్తున్నది. అలాగే త్రిజట స్వప్నంలో గోచరించిన రామలక్ష్మణుల పల్లకీ "గజదంతమయా.. యుక్తాం హంస సహస్రేణ" అన్న మాటనుబట్టి ఆకాలంలో పల్లకీలపై దంతంతో చేసిన వేలకొలది హంసల బొమ్మలు వుండేవని తెలుస్తున్నది. అలాగే పుష్పక విమానం వర్ణనలోనూ చిత్రాల వర్ణన కొంత విపులంగా ఉంది. రెండు శ్లోకాలు చూడండి.

పుష్పక విమానం అనేక ధాతువులచే చిత్రీకరింపబడిన పర్వతంలాగానూ, గ్రహాలు చంద్రుని చిత్రంతోపాటు దట్టమైన మేఘాల వరుస చిత్రీకరణ గల ఆకాశం లాగా ఉన్నది. ఆ విమానం పైన భూమి పర్వతాలతో నిండినది గాను, పర్వతాలు వృక్ష సముదాయంతో నిడినట్లుగాను, పుష్పాలు రేకులతో నిండినట్లు గాను చిత్రీకరింపబడిఉన్నది.

అలాగే పుష్పకవిమాన వర్ణనలో వాల్మీకి గజలక్ష్మి చిత్రం ప్రస్తావించాడు. దేవాలయం ద్వారం పైన గజలక్ష్మి చిత్రం, శిల్పం ఉంచడం ఎంతో ప్రాచీనమైన

సంప్రదాయం. కరీంనగర్ జిల్లా పెదపల్లి మండలం లో ఉన్న పెదబంకూరు వద్ద జరిపిన తవ్వకాలలో గజలక్ష్మి బొమ్మ ఉన్న ఎర్రమట్టి ముద్రదొరికింది. ఇది తెలుగువారి తొలి చారిత్రక కాలం కి చెందినది.

శాతవాహన చక్రవర్తి అయిన హాలుడు (11 వ శతాబ్దం ప్రారంభం) సంకలన పరిచిన 'గాథా సప్తశతి'లో, హాలునితోపాటు ఎందరో కవులు, కవయిత్రుల కవితలున్నాయి. ఇవి ఆనాటి సాంఘిక సాంస్కృతిక జీవనానికి అద్దం పడతాయి. శాతవాహన చక్రవర్తులు అందరూ తెలుగునాడు ని పాలించారా లేదా అంటే అదో పెద్ద చర్చ. గాథాసప్తశతిలో హాలుడు గోదావరి ని వర్ణిస్తూ "గోదావరి నది హాలుని రాజ్యంలో ఆవిర్భవించి అతని రాజ్యం గుండా ప్రవహించి అతని రాజ్యంలోనే సముద్రంలో విలీనమవుతుంది. " అన్న దాన్ని బట్టిహాలుడు మన ప్రాంతాన్ని పాలించాడని కచ్చితంగా చెప్పవచ్చు. ప్రాకృత గ్రంథమైన "లీలావతి" ప్రకారం హాలుని వివాహం తూర్పు గోదావరి జిల్లాలోని ద్రాక్షారామంలో జరిగింది. ఇంతకూ గాథా సప్తశతి లో హాలుడు రచించిన ఒక గాధను చూడండి.

"దేవరస్య అశుధ్వ మనసః నిజకకుడ్యయ లిఖితాని
దివసం కథయతి రామానులగ్న సౌమిత్రి చరితాని"

తా॥ అశుద్ధమైన మనసు గల మరిదికి గృహంలో వ్రాసిన కుడ్య చిత్రాలను చూపుతూ వదిన, రాముడిని అనుసరించిన లక్ష్మణుని కథ రోజూ చెప్పింది.

శాతవాహనుల కాలంనాటి కుడ్య చిత్రాలు ఏవీనేటికీ మిగలక పోయినా ఈ చిన్ని గాథ ద్వారా ఆనాటి చిత్రకళ గూర్చి మనం ఎన్నో విశేషాలను తెలుసుకోవచ్చు. ఈ గాథలో ప్రస్తావనకు వచ్చిన స్త్రీ ఒక సామాన్య గృహిణి. అందువల్ల, నేటికీ రెండువేల సంవత్సరాల క్రితం తెలుగునాట సామాన్యుల గృహాలలో రామాయణం కుడ్య చిత్రాలుగా వ్రాసే వారని, మరిదివంటి పరపురుషుడు అశుద్ధ మనస్కుడైన ప్పుడు ఆ కుడ్య చిత్రాల ద్వారా స్త్రీలు నీతి బోధ చేసేవారిని చెప్పవచ్చు.

గొడుగు వింజామర చేతపట్టి సేవలందిస్తున్న దాసీల నడుమ అశోకుడు అతని భార్య నిలిచివున్న శిల్పం కర్ణాటకలోని గుల్బర్గా జిల్లాలో గల సన్నతి వద్దలభించింది. ఇలా వ్యక్తుల పూర్తి రూపచిత్రణ (full-length portrait) శాతవాహనుల కాలంలో ద్విగుణీకృతమైంది. మహారాష్ట్రలో ని పూనెజిల్లా

నానెఘాట్ వద్ద ఎనిమిదిమంది శాతవాహనుల శిల్పాలు మలచబడినాయి. దురదృష్ట వశాత్తు ఈ శిల్పాలు చాలామటుకు శిథిలమై కొన్ని శిల్పాలు కేవలం పాదాలు మాత్రమే గుర్తించేందకు వీలున్నా ఈ శిల్పాలలో వ్రాసి ఉన్న శాసనాల ఆధారంగా ఈ శిల్పాలు ఎనిమిది మందికి చెందుతాయి. వారు 1.శిముక శాతవాహన, 2. నాగనిక దేవి,3. శాతకర్ణి, 4. భయల కుమార 5. పేరుతెలియని రాజు6. తాణక వైర 7. కుమార హకు శ్రీ 8. కుమార శాతవాహన

వ్యక్తుల రూప శిల్పాలను చెక్కటం ఎంతో కాలం పడుతుంది కనుక వస్తుపైననో దారుఫలకం పైననో ముందుగా ఈ ఎనిమండుగురి రూపచిత్రాలను వ్రాసి దీని ఆధారంగా శిల్పాలను మలిచి వుంటారని ఊహించవచ్చు.

ఈ విధంగా తెలుగు వారి తొలిచారిత్రిక దశలోనూ అటు తరువాత శాతవాహనుల కాలంలోనూ చిత్రకళ పరిపరి విధాలుగా అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు.

# అజంతా చిత్రాలు - కొన్ని మేలు కలయికలు

శాతవాహనుల తరువాత, తెలుగు ప్రాంతాన్ని ఇక్ష్వాకులు తొలుత గుంటూరు జిల్లాలోని భట్టిప్రోలు నుండి తరువాత శ్రీపర్వతంగా పేరొందిన నాగార్జున కొండనుండి పాలించారు. వీరి తరువాత బృహఫలాయనులు, సాలంకాయనులు, ఆనందలు, విష్ణుకుండినులు, పల్లవులు, మన ప్రాంతాన్ని పాలించారు.

శాతవాహనుల కాలంనాటి చిత్రకళ తెలుగు నాట లేకపోయినా మహారాష్ట్ర లోని అజంతా గుహలలో కొన్ని శాతవాహనుల కాలంలోనే తొలిచి విహారాలుగా చెయ్యబడినవి. అజంతా చిత్రశైలి అమరావతి స్థూపం,సాంచీ స్థూపం లో వున్న శిల్పశైలికి దగ్గరగా ఉన్నది. అందువల్ల అజంతా చిత్ర రూప కల్పనకు భారతదేశం పలు ప్రాంతాలనుండి చిత్రకారులు అక్కడ చేరారని చెప్పవచ్చు. వీరిలో కొందరు మన తెలుగు ప్రాంతం నుండి కూడా వెళ్లారని చెప్పవచ్చు.

అజంతా గుహలలో నేడు కుడ్యచిత్రాలు ఎక్కువగా ఒకటవ విహారగుహలోనే మిగిలి వున్నాయి. చిత్రీకరించిన కథాంశం బుద్ధుని జీవితం, బోధిసత్వుల జీవితం, జాతకకథలు ఈ గుహలో కుడ్యచిత్రం లోకప్పు (ceiling ) పైన ప్రక్కగోడల (side walls) పైన కూడా ఉంది. అయితే ఈ రెంటికి తీసుకున్న కథాంశం చాలా భిన్నంగా వుంది. లోకప్పు పై కేవలం పూలు లతల అలంకరణ మాత్రమే అధికంగా ఉన్నవి మధ్య మధ్యలో చిన్ని చట్రంలో పద్మాసనంలో కూర్చునివున్న బుద్ధుడు, ఇద్దరు మాట్లాడుకుంటున్న వ్యక్తులు (ఇందులో ఒకడు విదేశీయుడు) తలలు గుద్దుకుందుకు ఎదురెదురుగా వున్న ఎడ్లజంట (చిత్రం : 4.1) ఇత్యాదివి ఉన్నాయి. విశేషమేమంటే ఈ పోట్లాడుకునే ఎడ్లు మనకు మన తెలుగునాట నేటికి లారీలపైన, ట్రాక్టర్ ట్రాలీలపైన రేఖామాత్రంగా నేటికీ గోచరిస్తున్నది.

ఇంతకూ ఇలా లోకప్పుమీద చట్రం లోని చిత్రాలు ఏదో ఇక దృశ్యాన్ని మాత్రమే చూపిస్తాయి. ఇందులో కథలేదు. కేవలం ఒక దృశ్యం, సంఘటన మాత్రమే ఉంది. అదే ప్రక్క గోడలపైన వేసిన కుడ్య చిత్రాలలో కథ ఉంది కథాకథనం story naration ఉన్నాయి. సర్వసాధారణంగా బౌద్ధమతసంస్కృతిలో పద్మాసనమే వేసుకొని కూర్చోవటం పరిపాటి. ఈ విహారంలో అలా పద్మాసనం వేసుకుని చూస్తే తల తిప్పుతూ ఇటుఅటు చూస్తే జాతక కథ కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది.

అజంతా చిత్రకారులు వేసిన పురుషులు, స్త్రీలు, బుద్ధుడు, బోధిసత్వులు, జింకలు, ఏనుగులు, కోతులు, గుర్రాలు మొలైనవన్నీ కేవలం చిత్రాలుగా కాక జీవకళకలిగివుంటాయి. ప్రతిఒక్కరూ ప్రతిప్రాణి చలనస్వభావంకలిగివుంటాయి. చివరకు అజంత చిత్రాలలో చూపిన చెట్లుచేమలు, పూలు, లతలు కూడా జీవం కలిగి ఉన్నాయి. ఎంతో ప్రసిద్ధి చెందిన బోధిసత్వపద్మపాణి ఎంతో నమ్రతతో తలకొంత వంచి ఎంతో సొగసుగా పద్మాన్ని పట్టుకుంటాడు.(చిత్రం : 4.2) అతని వెనుక చూపిన పోకచెట్టును ఎవరైన గుర్తుపట్టవచ్చు. నేడు ఎన్నో ఉద్యానవనాల్లో సాధారణంగా కపించే పోకచెట్టును చిత్రకారులు కళ్లముందుపెట్టుకొని చిత్రీకరించారా అని అనిపిస్తుంది. ఇలా అజంతా చిత్రాలకు ఎంతో ప్రత్యేకత ప్రత్యేక చిత్ర లక్షణాలు శైలి ఉన్నాయి.



(చిత్రం : 4.2)

అజంతా గుహలలోని చిత్ర సంపత్తిచూశాక ఇటువంటి చిత్రాలు మన తెలుగునాట ఉన్న గుహ నిర్మాణాలలో లేవే అని మనసుఒక్కసారి కలవరపడుతుంది. అజంతా గుహలను పోలిన గుహలు గుంటూరు జిల్లాఉండవల్లి లోను, కృష్ణాజిల్లా విజయవాడ లోను, పశ్చిమ గోదావరి జిల్లా గుంటపల్లిలోనూ, విశాఖపట్నంజిల్లా శంకరం లోనూ, నెల్లూరు జిల్లా భైరవకోనలోనూ ఉన్నాయి.

వీటిన్నింటిలోనూ కొంత శిల్పం ఉంది. కాని, కుడ్యచిత్రం మాత్రం నామమాత్రంగానైనా మిగలలేదు.

అమరావతి శిల్పం సాంచీ శిల్పంలో నుండి రూపొందించిన అజంతా చిత్ర శైలి వేరు వేరు ప్రాంతాల చిత్రాలను కూడా ప్రభావితం చేసింది. ఎల్లోరాలోని కైలాసనాథ దేవాలయంలోని కుడ్యచిత్రాలు నేడు దాదాపు పూర్తిగా అదృశ్యమయ్యాయి. అయితే కొలనులోకి దిగిన ఓ ఏనుగు తలకాయ మాత్రం నేటికీ బాగానే ఉన్నది. తమిళనాడులోని సిత్తనివాస్ లలోని కుడ్యచిత్రాలు చాలా అద్భుతంగా ఉంటాయి. కొలను మధ్యలో వున్న ఓయుక్తవయస్కుడు తూడులు పట్టి తామరపూలను కోస్తూ వుంటాడు. అతని చుట్టూ వున్న తామరాకులు, పూలు గాలికి ఊగుతున్నట్లు కదలికను సూచిస్తాయి.

శ్రీలంకలోని సిగిరియా లో కూడా అజంతా కుడ్యచిత్ర ప్రభావంతో మలచిన కుడ్య చిత్రాలు ఉన్నాయి (చిత్రం : 4.3). ముఖ్యంగా ఒక అమ్మాయి తనచేతిలో నూరు వరహాలు లేక దేవగన్నేరు పుష్పాన్ని చేతిలో పట్టుకొని ఉంటుంది. ఆ పుషా



(చిత్రం : 4.3

ఎన్ని చూస్తే చిత్రాకారుడు పువ్వుని తనకళ్లముందు పెట్టుకొని పుష్పంగీశాడా అన్నట్లు తోస్తుంది. ఇటువంటి వాస్తవ దృక్పథం అజంతా చిత్రాలలో గోచరిస్తుంది. అని ఇంతకుముందేచెప్పుకున్నాం.

అజంతా కుడ్యశైలి ప్రభావం నేటి పశ్చిమ బెంగాల్, నేపాల్ ను పాలించిన పాలరాజుల కాలంలో వెలువడిన బౌద్ధ గ్రంథాలలోను కొంత కనిపిస్తుంది. ఈ పుస్తకాలు బూర్జ వృక్షం బెరడుతోనూ, ఆకులతోను చేసినవి. అయినా చాలా పొడవుగా ఉన్నా వెడల్పు మాత్రం బెత్తెడు లోపే ఉంటాయి. అందువల్ల ఈ పాల

వ్రాత ప్రతిచిత్రాలు అన్నీచిన్న తపాల బిళ్ల Postal stamp పరిమాణంలోనే ఉంటాయి. టిబెట్టు, చైనాలో కుడ్యచిత్రాలలోనూ వస్త్రం పైన వేసిన టంకచిత్రాలలోనూ (Tanka paintings) అజంతా చిత్రశైలీ ప్రభావం కనిపిస్తుంది.


తెలుగునాడును పల్లవుల తర్వాత వాతాపి(బాదామి) చాళుక్యులు కల్యాణి చాళ్యుక్యులు, వేంగీ చాళుక్యులు పరిపాలించారు. ఈ కాలంలోనే కరీమ్‌నగర్‌జిల్లా వేముల వాడకు చెందిన మల్లియ రేచన తెలుగులో "కవిజనాశ్రయము" (సి.940) అనే ఛందో గ్రంథాన్ని రచించాడు. తరువాత రాజరాజనరేంద్రుడు (ఆర్. 1022 -1061) రాజమహేంద్రవరాన్ని పాలిస్తూ నన్నయకు ప్రేరణగా ఉండి తెలుగులో "శ్రీమహాభారతం" (సి. 1051-61) రచించాడు. తెలుగు వారి ఆదికవిగా నన్నయ పేరుతెచ్చుకున్నాడు.

వేంగీ చాళుక్య పాలనలో రూపొందించబడిన చిత్రసంపద ఏదీ మనకు మిగలలేదు. అయితే బాదామి చాళుక్యులు కల్యాణిచాళుక్యుల పాలనలో రూపొందిచిన కుడ్య చిత్రాలు మనకు లభించాయి. వాటిని తరువాతి ప్రకరణం లో చూచేముందు రెండు విషయాలను గూర్చి చెప్ప వలసివున్నది.

'చిత్ర' లేక 'చిత్రం' అనే మాటకు భారతీయ భాషలలోను తెలుగులోనూ రెండు అర్థాలున్నాయి. ఒకటి వింత అని అర్థం 'విచిత్రం'లోని అర్థం, రెండవది చిత్రపటం చిత్రలేఖనము వంటి అర్థాన్ని సూచించటం. సంస్కృతం తెలుగు సాహిత్యములో 'చిత్రబంధం' అనే కవితా శాఖ ఒకటి ఉన్నది. దీనినే బంధకవిత్వం, చిత్రబంధ కవిత్వం అని అంటారు. ఛందోబద్ధంగా ఉన్న ఒక పద్యాన్ని ఏదో ఒక ఆకారంలో ఉన్న చిత్రంలో బంధిస్తారు. కనుక దీనికి ఆ పేరు వచ్చింది. మొత్తం కావ్యం లోని చాలా పద్యాలు లేదా అన్ని పద్యాలు ఈ రూపంలోనే ఉంటే అటువంటి కావ్యాన్ని చిత్ర కావ్యం అంటారు. తెలుగులో కుమారసంభవం రచించిన నన్నెచోడుడు (ఎఫ్. ఎల్. 1080-1130) కొన్ని పద్యాలను ఇటువంటి చిత్రబంధ రూపంలో రచించాడు. ఇది సాహిత్యానికీ చిత్రకళకూ జరిగిన వివాహం వంటి కలయిక. వేంగీ చాళుక్యుల తరువాత తెలుగునాడును చాళుక్య చోళులు కరికాలచోడ వారసులైన చోడవంశానికి చెందిన వివిధ శాఖలవారు పాలించారు. తెలుగులో మొదటిగా చిత్రబంధ కవిత్వం వ్రాసిన నన్నెచోడుడు వీటిలో ఒక శాఖకు చెందినవాడు.

ఈ కాలంలో చిత్రానికి సాహిత్యానికి సంపర్క ఏర్పడినట్లే చిత్రకళకు శిల్పకళకు మధ్య సంపర్కం ఏర్పడింది. తెలుగునాట పలు ప్రాంతాలను 11మరియు 12 శతాబ్దాలలో కార్తవీర్యార్జునుని వంశస్థులైన హయహయులు పాలించారు. వారిలో పలనాడును పాలించిన హయహయులు తెలుగు వారందరి మధ్య ఎంతో పేరు తెచ్చుకున్నారు. మాచర్లవారికి గురజాల వారికి 1181 - 82 లో కారంపూడి లోజరిగిన పల్నాటి యుద్ధం ఎంతో ముఖ్యమైంది. ఈ యుద్ధానికి పూర్వం మాచర్ల వీరభద్రాలయం గోడలపై ఒక కొత్తరకమైన చిత్రశిల్పం రూపొందింప బడింది. నాకు తెలిసినంత వరకు ఇటువంటి 'కుడ్య చిత్ర - శిల్పం' తెలుగునాట మరెక్కడా లేదు (చిత్రం : 4.4). ఇందులో శివవిష్ణు సంబంధమైన కథలతో పాటు సంభోగ శృంగారం తాటిచెట్టు కల్లు తాగుతున్నవారు, ఇటువంటి సాధారణ నిత్య జీవన దృశ్యాలు కూడా ఉన్నాయి. ఈ కుడ్య- చిత్ర - శిల్ప నిర్మాణం ఏక్రమంలో జరిగిఉంటుందో కొంత ఊహించిచెబుతాను. ముందుగా చదునుగా ఉన్న రాతిపై కుంచెతో చిత్రం గీసి వివిధ ఆకారాలు (forms) చిత్రీకరించిన తరువాత చిత్రంలోని భాగాన్ని కొంచెం లోతుగా చెక్కి వేయటం జరిగింది. దీనివల్ల ఈ కుడ్య- చిత్ర-శిల్పం లోని ప్రతీ ఆకారం అటుచిత్రంగానూ, ఇటు శిల్పంగానూ కుడ్యంపై గోచరిస్తుంది. ఇటువంటి అపూరూప కుడ్య- చిత్ర - శిల్పాన్ని రూపొందించిన వారు కుడ్య చిత్రకారులూ లేక వస్త్ర పట చిత్రకారులో అయి వుంటారు. తరువాతి కాలంలో మనకు లభించిన కలంకారి చిత్రాలు, కుడ్యచిత్రాలు వస్త్రపట చిత్రాలలో చిత్రంతో పాటుగా చిత్రానికి నామం (caption), చిత్ర వివరం (narration of the content of the picture) వ్రాయటం కనిపిస్తుంది. మాచర్ల వీరభద్రస్వామి దేవాలయం గోడలపైఉన్న ఈ కుడ్య చిత్ర శిల్పంలో కూడా వాచకం తెలుగువచనంలో చెక్కబడి ఉంది. నిజానికి ఈ కుడ్య- చిత్ర- శిల్పం గూర్చి ఒకప్రత్యేక పరిశోధన ప్రచురణ వెలువడవలసి ఉన్నది.

(చిత్రం : 4.4).



# చాళుక్య చిత్రాలు


తూర్పు చాళుక్యుల కాలంలో బాదామి, అయహోళె పట్టదక్కల్ దేవాలయ నిర్మాణానికి ప్రయోగ శాలగా ఉండేది. అజంతా ఎల్లోరాలలో లాగా గుహ ఆలయాలు ఇక్కడ కూడా ఉన్నాయి. బౌద్ధమతంలో నిర్మించిన గజపృష్టాకారపు దేవాలయం ఉంది నలుచదరంగా ఉన్న దేవాలయం ఉంది. ఇలా హిందూ దేవాలయం అనేది ఎలా ఉండాలి? అని ఒక నిర్ణయానికి వచ్చేందుకు పలు ప్రయోగాలు ఇక్కడ జరిగాయి. బాదామిలో గల మూడవ గుహాయలంలో కుడ్యచిత్రాలు ఉండేవి. కాని, చిన్నచిన్న ముక్కలు మినహా నేడు అవి పూర్తిగా అదృశ్యమయ్యాయి. తొలితరం కళా చరిత్ర కారులు చెప్పిన దాని ప్రకారం ఉమామహేశ్వరులు కొలువై ఉండగా చుట్టూ భక్తులు కొలుస్తూ ఉండటం ఈ కుడ్య చిత్రంలో పొందుపరిచిన కథాంశం. ఇందులో ఒక రాణిగా గుర్తించిన స్త్రీ ముఖం మాత్రం ఉన్నది. అజంతా చిత్రాలో మనుష్యరూప కల్పనలో చూపిన గుండ్రనితనం ఇందులో కూడా కొంత ఉన్నదని చెప్ప వచ్చు. రేఖా ప్రాధాన్యత కూడా ఉన్నదనీ చెప్పవచ్చు. తరువాతి కాలంలో మనం చూసే చిత్రాలలో ఈ గుండ్రనితనం పూర్తిగా అంతరించి, రేఖా చిత్రణకే ప్రాధాన్యం ఏర్పడుతుంది.

ఈ తూర్పు చాళుక్యులలో నుండి ఒక శాఖ తెలగునాటను పాలించి, పశ్చిమ చాళుక్యులుగా వేంగి నుంచి పరిపాలించారు గనుక వేంగిచాళుక్యులుగా పేరు తెచ్చుకున్నారు. ఇలాంటిదే మరొక శాఖ. కళ్యాణి చాళుక్యులు వీరిలో సర్వజ్ఞ సోమేశ్వరుడు. (ఆర్. 1126-1138) తన బిరుదు ను నిలబెట్టుకునే పని చేశాడు. సంస్కృతంలో "మానసోల్లాసం' అనే గ్రంథాన్ని రచించాడు. దీనికే 'అభిలాషితార్థ చింతామణి' అని మరొక పేరు. ఈ గ్రంథం శ.శ. 1051 లో

అంటే 1129 లో రచింపబడింది. నూరు అధ్యాయాలు గల ఈ గ్రంథంలో సర్వజ్ఞసోమేశ్వరుడు ఎన్నో విషయాలు చర్చించాడు.

రాజ్యరక్షణ, రాజనీతి, పాకశాస్త్రం, క్రీడలు, వాస్తు నిర్మాణ శాస్త్రం, శిల్పం, చిత్రలేఖనం ఇలా దాదాపు అరవై నాలుగు కళల గూర్చి సోమేశ్వరుడు చర్చించాడు. అయితే ఈ సంస్కృత గ్రంథాన్ని ఒకసారి, 1961 లో బరోడాలో ప్రచురించారు. తెలుగు లోకి గాని, ఆంగ్లంలోకి అనువదించనందున ఈ "మానసోల్లాసం"లో మనసును ఉల్లాసపరిచే ఎన్నో అంశాలు వెలుగు చూడలేదు.

కరీమ్‌నగర్ జిల్లా అల్లాదుర్గ్‌లో కళ్యాణి చాళుక్యుల కాలం నాటి కుడ్య చిత్రాలు నామమాత్రంగా ఉన్నాయి (చిత్రం : 5.1). ఈ చిత్రాన్ని చూస్తే అజంతా ప్రభావం, కొంత భౌద్ధ ప్రభావం ఇంకా ఈ కాలం దాకా ఉన్నాయని అనిపిస్తుంది.



(చిత్రం : 5.1).

# చిత్ర ఫలకము

ప్రాచీన సంస్కృత వాఙ్మయంలో శిల్పము చిత్ర లేఖనము గూర్చి కొన్ని ప్రత్యేకమైన గ్రంథాలు ఉన్నాయి. విష్ణు ధర్మోత్తర పురాణంలోని 'చిత్రసూత్ర' ఆర వ శతాబ్దం భోజరాజు రచించిన "సమరాంగణ సూత్రధార"(12వశతాబ్దం) బసప్ప నాయక రచించిన శివతత్వ రత్నాకర "17శతాబ్దాలలో శ్రీకుమార రచించిన 'శిల్ప రత్న'(16వశతాబ్దం) వంటి అనే సంస్కృతగ్రంథాలలో వాస్తు నిర్మాణము శిల్ప చిత్రకళల ప్రత్యేక అధ్యయనాలు ఉన్నాయి. అయితే ఇటువంటి శాస్త్ర గ్రంథాలు తెలుగులో లేవు. తెలుగు సాహిత్యంలో కవులు చేసిన కొన్ని ప్రస్తావనల ద్వారా కొంతకళా చరిత్రను పునర్నిర్మించవచ్చు.

వేంగి చాళుక్యులు చాళుక్యచోళులు, తెలుగు చోడులు పాలించిన కాలంలో "చిత్రఫలకము" చాలా విరివిగా చిత్ర మాధ్యమంగా ఉండేది. చిత్రఫలకము అంటే దారు లేదా చెక్కతో చేసిన నునుపైన బల్ల అని అర్థం. ఇటువంటి దారు పలకపై వేసిన చిత్రాన్ని చిత్రఫలకము అంటారు. ఆంగ్లంలో దీనిని Panel Painting అంటారు. తెలుగునాట రూపొందింపబడిన చిత్రఫలకాలు ఎక్కడైనా నేటికీ వున్నాయో లేదో తెలియదుగాని తెలుగు సాహిత్యంలో వీటి ప్రస్తావన వర్ణన కొంతవుంది.

నన్నెచోడుడు రచించిన 'కుమారసంభవం' లో పార్వతీదేవి పలుమార్లు పరమేశ్వరుని రూపాన్ని చిత్రఫలకంపై వేసి వేసి చిత్రకళావిద్యలో ప్రావీణ్యం సంపాదిస్తుంది. శివునిపై ప్రేమాభిమానాలు పెంచుకొని తను తాపం తట్టుకోలేక

కనీసం "పరమేశ్వరు రూపు చిత్రించి చూచిననైన నూఱయగు" అని అశించి పార్వతి ఇలా చేస్తుంది.

"చిత్ర సాధనంబులు గొని పలక ఘటించి యెఱుంగిడి త్రివటించి తిట్టంబుకొలదికిం దెచ్చి, ఋజ్వాగతంబున రేఖనూల్కొలిపి పత్రక బిందుక నిమ్నోన్నతాపాగమనోన్మానంబులలవలచి సులక్షణం బుగా జిత్రించి వన్ను వగొలిపి కందెఱదెఱచి"

ఇలా పార్వతి చిత్రఫలకంపై చిత్రించి చూచిన శివుడు చిత్రం కలకలనవ్వినట్లుగా కనుబోమలు ముడిచి ఓరగా చూచినట్లుగా, కౌగిలింతకు చేతులుచాచినట్లు రతికేళికి రమ్మనినట్లుగా కనిపించటం లో పార్వతి సిగ్గుతో ముడుచుకు పోతుంది. పింగళి సూరన రచించిన 'ప్రభావతీ ప్రద్యుమ్నం'లో ప్రభావతి కూడా చిత్రఫలకంపై ప్రద్యుమ్నుని రూపాన్ని చిత్రించి ఇటువంటి అనుభూతులనే పొందుతుంది.

తెలుగు సాహిత్యంలో అక్కడక్కడ కనిపించే ఇంత చక్కటి చిత్రఫలకవర్ణనలు చదివినప్పుడు అయ్యో! ఇటువంటి చిత్రఫలకాలు కనీసం కొన్నైనా ఎక్కడైనా వుంటే బాగుండు కదా! వాటిని చూస్తే నేత్రపర్వంగా వుండునేననిపిస్తుంది.

# కాకతీయ చిత్రాలు

తొలితరం కళాచరిత్రకారులు వ్రాసిన దాని ప్రకారం కాకతీయుల పరిపాలనాకాలంలో, ఖమ్మంజిల్లాలోని పిల్లలమర్రిలో గల దేవాలయంలోనూ ఒంగోలుజిల్లాలోని త్రిపురాంతకం లోనిత్రిపురాంతకేశ్వర దేవాలయంలోనూ కాకతీయుల కాలం నాటి కుడ్యచిత్రాలు ఉండేవి. కాని, దురదృష్టవశాత్తు వీటి అనవాళ్లు నేటికి కనుమరుగయ్యాయి.

ఏకామ్రనాథుడు రచించిన 'ప్రతాపరుద్ర చరిత్ర' ప్రకారం కాకతీయ చక్రవర్తి అయిన ప్రతాపరుద్రుడు (1289 - 1323) తన పదకొండవ ఏట ధన్వంతరీ విద్యతోపాటు "చిత్ర శ్రమ" కూడా చేశాడు. ఆకాలంలో అన్ని కులాలవారు చిత్రములను వేసేవారు. చిత్రకళే కుల వృత్తిగా ఉన్న కులాలవారు కూడా ఉండేవారు. ప్రతాప రుద్ర చరిత్రను సమకూర్చిన జనాభా లెక్కల ప్రకారం ఏకశాలా నగరం (వరంగల్లు) లో విశ్వకర్మ, కమ్మర, పట్టుసాలె, మేదర కుటుంబాల వారితోపాటు 1500 "చిత్తరువుల వ్రాసే ఇండ్లు" కూడా ఉండేవి. ఇన్ని ఇళ్ల వారు చిత్రకళకు అంకితమై ఉండటం చెప్పుకోతగ్గ విశేషం.

వినుకొండ వల్లభరాయుడు రచించిన 'క్రీడాభిరామం' (సి. 1430) తెలుగులో చాలా విశిష్టత గల కావ్యం. గోవింద మంచన శర్మ అనే బ్రాహ్మణుడు టిట్టిభ శెట్టి అనే వైశ్యుడు కర్ణాటకలోని ద్వార సముద్రం (హళెబీదు)నుండి ఏకశిలా నగరం ప్రయాణించి మార్గమధ్యంలోను నగరంలోనూ ఎన్నో వింతలు విశేషాలు చూచిన వైనం ఈ కావ్యం వివరిస్తుంది. ఈ కావ్యం ప్రకాశం ఏకశిలానగదంలో పపలనాగి వీరపురుష పరమ దైవత శివలింగ భవన వాటి" ఒకటి వుండేది.

అక్కడ పలనాటి వీరగాధ ను ఒక ద్విపద కావ్యం ఆధారంగా చేసుకుని జనం పాటలు పాడేవారు. ఈ భవనంలోనే 'గచ్చు చేసిన చిత్రం పు గద్దె పలక" పై పలనాటి వీరగాధ చిత్రిపంబడి ఉండేది. గొవింద మంచన శర్మ "అదె చూడరా వైశ్య రాజా!" అంటూ తన మిత్రునికి పలనాటివీర చరిత్ర ను కుడ్యచిత్రాన్ని చూపి అంతా వివరంగా చెబుతాడు. పన్నెండవ శతాబ్దంలో పలనాడులో జరిగిన యుద్ధం ఆ చరిత్రనంతా పదిహేనవ శతాబ్దంలో ఓరుగల్లు లో గల ఈ కుడ్యచిత్రం చిత్రీకరించి ఉండటం చెప్పుకోతగిన విశేషం. ఇటువంటి చరిత్ర చిత్రాలు నేటికి మిగిలి ఉండకపోవటం అనేది బాధ కలిగించే విషయం.

వరంగల్లు, హనుమకొండకు చేరువలో పాండవుల గుట్ట అనే గుహ ఉంది. ఇక్కడ ఆది మానవులు చేసిన చిత్రాలు ఉన్నాయి. అలాగే చరిత్ర కాలంలో వేసిన చిత్రాలు కూడా ఉన్నాయి. ఇక్కడ శిలా చిత్రాలతో పాటు కుడ్యచిర్త రూపలో ఉ న్న మహాభారత చిత్రాలు (చిత్రం : 7.1) కాకతీయుల కాలం నాటి చిత్రాలుగా చెప్పుకోవచ్చు. ఇవి మనం ముందు ముందు చూడబోయే విజయనగరం చిత్రాలు, కలంకారీ చిత్రాలు, వస్త్రపట చిత్రాలకు బాటవేశాయని చెప్పవచ్చు అడ్డపట్టీగా గళ్లు గళ్లు గా విభజించి చిత్రాలను వాటిలో పొందు పరచటం ఈ మహా భారత చిత్ర వేశేషం.



(చిత్రం : 7.1)

# రెడ్డిరాజులు, పద్మనాయకుల కాలం నాటి చిత్రాలు

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం కొండవీడు, రాజమహేంద్రవరంలో రెడ్డి సామ్రాజ్యాలు, దేవరకొండ, రాచకొండలలో పద్మనాయక సామ్రాజ్యాలు నెలకొన్నాయి. ఈ కాలంలోని చిత్ర సంపద ఏదీ మనకు మిగల్లేదు కాని తెలుగు సాహిత్యం ఆ కాలం నాటి చిత్రకళ గూర్చి కొన్ని విశేషాలను వివరించింది.

ప్రాచీనకాలంలో చిత్రకారులు ఏదో ఒక చిత్రాన్ని ఎక్కడ పడితే అక్కడ వ్రాయకుండా సమయానికీ, సందర్భానికీ స్థలానికి అనుగుణంగా ఉండే చిత్రాలనుఏ వేసేవారు. శ్రీనాథుడు ఇటువంటి కుడ్య చిత్రాలను శృంగారనైషధం (సి. 1386- 96)లో ప్రస్తావించాడు. నలదమయంతులు తమ వివాహం తరువాత "వివిధ శిల్పకల్పనానిపుణులగు శిల్పిజనులు " నిర్మించిన ఒక విహార సౌధంలోకి ప్రవేశిస్తారు. అక్కడ పూలపందిరతో కూడిన "గిలిగిలిమంచం" . ఉంటుంది. ఈ గదిగోడల పైననే రతీదేవి పాలిండ్లను నొక్కుతున్న మన్మథుడు, గౌతముని భార్యతో ఇంద్రుడు చేసిన చీకటి తప్పు సితభానుడు ఆచార్యుని కన్యపై కన్ను వేయటం, దాసనళినీ పరాశరుల శృంగారం తాను సృష్టించిన సరస్వతినే కోరుకున్న బ్రహ్మ శ్రీకృష్ణ శృంగారలీలను మొదలైన పురాణేతి హాస పరమైన శృంగార ఘట్టాలను చిత్రీకరింపబడిఉంటాయి. పడక గదిలో అందునా నవనూత్న వధూవరులు తొలినాటి రాత్రిని నిదురించే పడక గదిలో ఇటువంటి శృంగార రస చిత్రాలు ఉండటం ఎంతో హర్షణీయమైన విశేషాంశం ఇటువంటి చిత్ర సంపద మనకు మిగలకపోవటం మాత్రం శోచనీయం.

# విజయనగర చిత్రాలు

విద్యారణ్యుల వారి నేతృత్వంలో హంపికి చేరువలో విద్యానగరాన్ని హరిహరరాయలు బుక్కరాయలు 1336 స్థాపించారు. క్రమంగా వీరు వీరి కుమారులు దక్షిణ భారతదేశాన్నంతా తమ పాలనలోకి తెచ్చి విద్యానగరాన్ని విజయనగరంగా మార్చారు. విశాల విజయనగర సామ్రాజ్యాన్ని సంగమ వంశం వారు, సాళువ వంశంవారు తుళువ వంశం వారుపాలించారు. విద్యానగర నిర్మాణానికి పూర్వం ఆ చేరువులోనే ఉన్న ఆనెగొంది వీరి రాజధానిగా ఉండేది. ఇక్కడ ఉచ్చాయప్ప మఠంలో విజయనగర ప్రారంభదశలో వేసిన చిత్రాలు కంటికి కనిపించీ కనిపించనంత రీతిలో శిథిలమై పోయాయి. రంగులన్నీ అదృశ్యమై ఎర్రరంగుతో వేసిన రేఖలు రేఖా మాత్రంగా లోన లోకప్పుపై ఉన్నాయి.

పాత పుస్తకాలల్లో వ్రాసిన వివరం ప్రకారం పూలపొదలు, దానిపైన ఉడుత, ఇద్దరు నించున్న స్త్రీలు విశాల మైన పద్మపుష్పాలు ఉన్నాయి. మరొకచోట నవనారీ కుంజరం అంటే తొమ్మిది మంది ఆడువారు తో కూడిన ఏనుగు దానిపై పొడవాటి గడ్డంగల సన్యాసి చిత్రం ఉన్నాయి. అలాగే నవనారీ అశ్వాన్ని అధిరోహించిన సన్యాసి చిత్రం కూడా ఉంది. తొలితరం చిత్రకారులు ఉన్నాయని ఇటువంటి చిత్రాలు ఎక్కడో బెంగాల్ సటచిత్రాలలో బోడిగుండుకు మోకాలికి ముడివేశారు. శ్రీశైలం మల్లికార్జున దేవాలయం ప్రహరీ గోడలపై గల లోతక్కువ శిల్పాల (low relif sculptures) లో ఒక నారీ కుంజర శిల్పంఉంది ఇది రెడ్డి రాజుల కాలంలోనో, విజయనగరం ప్రారంభదశలోనే రూపొందింప బడింది.

ఉచ్చాయప్పమఠం లోకప్పుపైన వేసిన ప్రతీచిత్రపు చట్రం (frame) లో

పెద్దపెద్ద తామర పుష్పాలు తోరణాలు విరివిగా ఉన్నాయి. ఇవి చూస్తే పండుగ వాతావరణం తలపుకు వస్తుంది. విద్యానగర స్థాపన సందర్భంగా జరిగిన పండుగ సంబరాలకు ఈ చిత్రాలు చూపుతూ ఉండవచ్చు.


విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన రాజులు అందరూ కళాపోషకులే అయినా, తుళువ వంశానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు (1509-1529/30) చిత్రాన్ని, శిల్పాన్ని దేవాలయాల నిర్మాణాన్ని, సాహిత్యాన్ని, సంగీతాన్ని, నృత్యాన్ని, నాటకాలను ఇలా అన్ని కళారంగాలను పోషించాడు. స్వయంగా కవి. తెలుగులో 'ఆముక్తమాల్యద' అనే ఉత్కృష్టమైన, అద్భుతమైన ఊహలు గలిగి, ఆలోచింప చేసే గ్రంథరాజాన్ని రచించాడు. 'సంగీత, సాహిత్య సమరాంగణ సార్వభౌమ' అనే బిరుదుకి సార్థక నామధేయుడైనాడు. ఈయన కుమార్తె మోహనాంగి అనే ముద్దుపేరుతో ప్రఖ్యాతి గడించిన తిరుమలాంబ తెలుగులో 'మారీచ పరిణయం' అనే కావ్యాన్ని రచించింది. అందులో "నేను వ్రాసిన చిత్రాలను మానాన్న మెచ్చుకుంటాడు" అని చెప్పింది. శ్రీకృష్ణదేవరాయలు చిత్ర కళావిమర్శకుడు కూడా అన్నమాట.

శ్రీకృష్ణదేవరాయలు చక్రవర్తి అయిన వెంటనే, హంపీ విరూపాక్షదేవాలయంలో విశాలమైన నాట్యమంటపాన్ని నిర్మించాడు. ఈయన కాలంలో నిర్మింపబడిన అన్ని దేవాలయాలలోనూ ఎన్నో స్తంభాలతో కూడిన విశాలమైన మంటపాలు ఉండటం ఓ ప్రత్యేక అంశం. ఎందరో ఈ దేవాలయం మంటపాలలో కూర్చుని పడుకుని సేదతీర్చుకునేందుకు ఉద్దేశించినవి. నేటికీ , ఇటువంటి దేవాలయాలకు వెళ్లినపుడు చాలా మంది ఈ స్తంభాలకు అనుకుని చారిగిల పడతారు.

మొహమాటం లేనివారైతే, ఎంచక్కా పడుకొని అటు ఇటూ చూస్తూ ముచ్చట్లకుదిగుతారు. బౌద్ధంలో పద్మాసనం వేసుకుని ఎదురుగా చూడటం పరిపాటి కనుక అజంతాలో కథాపరమైన చిత్రాలు అన్నీ ఎదురుగా ఉన్న గోడలపైననే ఉంటాయి. హిందూ దేవాలయాలకు వెళ్లే భక్తులు మండపాలలో పడుకోవటం ఆనవాయితీ కనుక, విజయ నగరం కాలంలో వేసిన ప్రతీ కుడ్యచిత్రం లో కప్పుపైననే ఉంటుంది. నేటికీ, ఈ కుడ్యచిత్రాలను చూపి ఆనందించాలంటే ఎంచక్కా మంటపంలో అడ్డంగా పడుకొని పైకి చూస్తే చిత్రాలను చూస్తే కళ్లకు కట్టినట్టుగా ఉంటుంది. నించొని తలపైకెత్తి చూసే,

మెడనొప్పి పుడుతుంది. నిర్మోహమాటంగా పడుకుని ఈ కుడ్య చిత్రసంపదను హాయిగా ఉంటుంది. ఇటువంటి కుడ్య చిత్రసంపదను పట్టించుకునే వారు మనలో తక్కువ. అది వేరే కథ.

ఇంతకూ, విరూపాక్ష దేవాలయంలో శ్రీకృష్ణదేవరాయలు కట్టించిన లోకప్పు మొత్తం కుడ్య చిత్రంతో నింప బడింది. దీని నిర్మాణం 1509-1510 నడుమ జరిగింది. కనుక ఈ కుడ్యచిత్రం ఆకాలంలోనే వేసినవని నిర్ధారణంగా చెప్పవచ్చు. కుడ్యచిత్రాన్ని అరలుగా విభజించి ప్రతీ లో ఒక్కొక్కరుచిత్రాన్ని పొందుపరచటం జరిగింది. త్రిపురాసురసంహారం మన్మథ విజయం కొంత పెద్దఅరలో వేశారు. గౌరీ కల్యాణం (చిత్రం : 9.1), అర్జున మత్స్యభేదనం సీతారామకల్యాణం, ద్రౌపదీ వివాహం ఇంత చిన్న అరలలోనూ, నించున్న దశావతారాలు ఒక వరుస అరలలో చిత్రీకరించారు. ఒక పల్లకీలో ఒక సన్యాసి ఊరేగుతున్న దృశ్యం కూడా ఉంది. ఈ సన్యాసినిన విద్యారణ్యునిగా తొలితరం కళా చరిత్రనేరాలు గుర్తించారు. కాని, ఈ మధ్య కాలంలో నాసహాధ్యాయి మిత్రుడు అయిన డా. ఆర్. హెచ్.కులకర్ణి ఇది వ్యాసరాయలని గుర్తించి కొంత దుమారం లేపాడు. వ్యాసరాయలుమధ్య గురువు. విద్యారణ్యులు శృంగేరిపీఠాధిపతిగా ఉన్న స్మార్త గురువు. కాని శ్రీకృష్ణదేవరాయల వద్ద అన్ని శాఖల గురువులు ఉండేవారు. శ్రీ వైష్ణవుడైన తాతా చార్యులు కూడా ఉండేవారు. ఈ విషయం నిర్ధారణకు రావాలంటే, ఈ సన్యాసికి ఎటువంటి నుదుటి బొట్టు ఉందో పరిశీలిస్తే తేలుతుంది.



(చిత్రం : 9.1),

దశావతారాల వరుస చూస్తే ఒక విషయం గుర్తుకొస్తుంది. శ్రీకృష్ణ దేవరాయలు 'ఆముక్తమాల్యద' లోనూ అల్లసాని పెద్దన 'మను చరిత్ర' లోనూ విడివిడిగా

దశావతార స్తుతి పద్యాలు వ్రాశారు. దశావతార స్తుతి ఆకాలపు లక్షణం. ఇది చిత్రకళలో కూడా ఉన్నదన్న మాట.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో హంపీ విజన నగరం చాలా పెద్దపెద్ద భవనాలు, రాచప్రాసాదాలు, విశాలమైన వీధులు గల మహానగరం. విదేశీ యాత్రీకులు ఈ నగరం రోమ్ కన్నా పెద్దగా ఉందని వర్ణించారు. నగర వాసులైన చిత్రకారులు వేసేచిత్రాలో నగర ప్రభావం తప్పకుండా ఉంటుంది. శ్రీకృష్ణదేవరాయలు వేయించిన ఈ కుడ్యచిత్రంలోనూ కొంత పరిశీలించి చూస్తే ఈ నగర ప్రభావం తేటతెల్లం అవుతుంది. ప్రతీ సంఘటన ప్రతిదేవతారూపం ఈ చిత్రంలోని భవనం లో నించొని ఉంటారు. దశావతార రూపం ఒక్కొక్కటి ఒక్కొక్క భవనంలోపల నించున్నట్లుగా చిత్రకారులు చిత్రీకరించారు. ఆరోజుల్లో విజయనగరంలో ఎటు వెళ్లినా భవనాలు తప్పకుండా గోచరమయ్యేవి. వీటి ప్రభావం ఈ రూపేణా చిత్రంలోకి ప్రవేశించింది. ఈ నగరకట్టడాల భవనాల ప్రభావం ఆనాటి సాహిత్యంలో కూడా గోచరిస్తుంది. 'ఆముక్తమాల్యద' లో శ్రీకృష్ణ దేవరాయలు వర్ణించిన ఎన్నో భవనాలు ఆకాశహర్మ్యాలు.ఒక భవనం చూచి శ్రీకృష్ణదేవరాలు ఇలా వర్ణించారు.

" ఆ రాత్రి భవనం పైనున్న పడక గదికిటికీ స్త్రీలు మూశారు. అప్పుడు, కొన్ని నక్షత్రాలు గదిలోపల బంధింపబడినాయి. అప్పుడు ఆ నక్షత్రాలు భయపడ్డాయి. ఈ స్త్రీలు మనల్నిముత్యాలనుకొని మనకు బెజ్జం పొడిచి హారాలుగా ధరిస్తారేమోనని ఈ ఉపద్రవం రాకుండా, స్త్రీలు ధరించిన ముత్యాల హారంలో దూరి దాగున్నాయి. వారు వారి ప్రియులతో రతీక్రీడ చేసేటప్పుడు ఆ ముత్యాల హారాలు ఎలా కదిలితే అలా ఆ నక్షత్రాలు కదిలాయి. తెల్లవారగట్ల ఆ స్త్రీలు గాలికోసం కిటికీలు తెరువగా బ్రతుకుజీవుడా అని నక్షత్రాలు బయటికి వెళ్లాయి".

శ్రీకృష్ణదేవరాయల 'ఆముక్తమాల్యద' లో ఇటువంటి వర్ణాత్మకమైన పద్యాలు వందలున్నాయి. అలాగే, అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్రలో కూడా నగర భావన ప్రభావం మెండుగా గోచరిస్తుంది. ప్రతీ సంఘటన ఓ భవనం బయటనో లోపలనో జరుగుతుంది. వ్యక్తులు భవనం లోనుండి బయటకు, బయటనుండి లోనికి వెళుతారు. చివరకు అడవిలో నిద్రించిన వారు కూడా మంచి రాతి మంటపంలో నిద్రిస్తారు.

ఆరోజుల్లో నగరంలో ఉన్న కుడ్య చిత్రకారుల పైన కవుల పైన నగరభవనాల ప్రభావం ఉండటం సహజం. గమనించ తగిన అంశం. మన ప్రభుత్వం కాని, కర్ణాటక ప్రభుత్వం కాని, ఈ కుడ్య చిత్రాన్ని ఒక క్యాలెండర్ రూపంలో తెస్తే ఎంతో బాగుంటుంది. 1960 లలో ఎస్. బి. ఐ.వారు అజంతాలోని భోధిసత్వ పద్మపాణిని క్యాలండెర్‌గా అచ్చువేశారు. ఆ క్యాలండెర్ లోనున్న ఎంతగానో ప్రభావితం చేసింది. హంపీ విరూపాక్ష చిత్రాన్ని కూడా ఎవరైనా క్యాలండెర్‌గా తీసుకవస్తే అదీ ఎందరో కొందరిని ప్రభావితం చేయవచ్చు.

విజయనగర కాలంలో ప్రతీ దేవాలయంలోనూ లోకప్పు పై విధిగా కుడ్య చిత్రాలను వేశేవారు. వీటిలో దాదాపు అన్నీ నేడుకనుమరుగైపోయాయి. ధూర్జటి రచించిన కాళహస్తి మాహాత్మ్యంలో వేశ్యామాత తన కూతుళ్ల కుల విద్యను నేర్చుకుంటారని ఇంటిలో ఓ కుడ్య చిత్రం వేయిస్తుంది. ఈ వేశ్యామాతపేరు మాణిక్య పల్లి. కొక్కొకము అనే గ్రంథం తెలుగులో ప్రసిద్ధి కెక్కిన కామశాస్త్ర గ్రంథం. ఇందులో పద్యాలను పాటల రూపంలో కూతుళ్లకు వినిపిస్తుంది. ఈమె వేయించిన కుడ్య చిత్రంలో రతీమన్మధులు, రంభాకుబేరులు, ఊర్వశీ పురూరవులు, మేనకా కౌశికులు, గోపికాకుకుందులు, ధాన్యమాలీ రావణులు, మత్య లోచనా ఋష్య శృంగులు, దాసవళినే క్షణా పరశరులు, తారా శశాంకులు, అహల్యా ఇంద్రులు అమర వేశ్యాజయంతులు ద్రౌపదీ పాండవులు నడిచిన శృంగార గతులు చూపే దృశ్యాలు ఉన్నాయని కవి వర్ణన. ఇటువంటి వర్ణనలు చదివాక 'అయ్యో ! ఇలాంటి కుడ్య చిత్రాలు ఒక్కటై నామిగల లేదే' అని మనస్సు చివుక్కుమంటుంది.



(చిత్రం : 9.4.)

హంపీ విరూపాక్షలో గల కుడ్య చిత్రం మాదిరిగా నేటికీ కొంత పదిలంగా ఉన్న ఆ కాలం నాటి మరోకుడ్య చిత్ర సముదాయం లేపాక్షిలో గల వీరభద్ర దేవాలయంలో ఉంది. వీటిని కూడా మంటపం నేలపై పడుకుని చూస్తేనే హాయిగా ఉంటుంది. వీటిలో, కిరాతార్జునీయం (చిత్రం : 9.3), శివుని దారుకీ వనవిహారం మొదలైన పురాణ కథల తోపాటు ఎందరో స్త్రీలు వరుసగా నిలుచుని ఉన్న దృశ్యం (చిత్రం : 9.4) కూడా ఉంది. హంపీలోని కుడ్యచిత్రానికి ఈ కుడ్యచిత్రాలకు చాలా వ్యత్యాసం ఉంది. ఎవరూ ఈ విషయాన్ని గమనించలేదనవచ్చు. హంపీలో నిదేవతలు, ఇతరులు ఇరుకు గదిలో నించున్నట్లుగా అనిపిస్తుంది. లేపాక్షిలా అన్ని ఘట్టాలు అందరూ ఆరు బయట చెట్లు, పొదల ప్రక్కన నిలిచినట్లు నడుస్తున్నట్లు ఉంటాయి.

కిరాతార్జునీయంలో ఆ అడవిపంది గాలిలోకి ముందు కాళ్లు ఎగురవేసి చాలా పెద్దగా ఉంటుంది. ఆకాలంలో  అడవి పందులు మానవుల కన్నా పెద్దగా ఉంటాయి అని కాదు దీని అర్థం. అది ఎంతో బలవంమైనదని దీనికి అర్థం. హంపీలోని చిత్రం కర్రలు పుచ్చుకుని గళ్లు, గడులు గీసిన చిత్రం. లేపాక్షిలో రేఖ హాయిగా తేలికగా ఆడుతూ పాడుతూ వేసినదిగా ఉంటుంది.

హంపీ చిత్రంలోని స్త్రీలు చాలా కుచ్చులుండి బిగుతైన పట్టుచీరలతో నగరంలోనిండి ఉంటారు. లేపాక్షిలో స్త్రీలు నూలు వస్త్రాలు గాలిలో తేలుతూ చాలా చక్కగా వూగుతున్నట్లు గా ఉంటాయి. కొందరి స్త్రీల వస్త్ర ధారణ రవికలు లేకపపోవడం, ప్రక్కకు ఒరిగిన కొప్పు ఇవన్నీ శ్రీకాకుళం ప్రాంత స్త్రీల సిగ కొప్పులు, వస్త్రధారణ గుర్తుకు వస్తాయి. ఎక్కడో హదూపూర్ వద్ద అనంతపురం జిల్లాలో ఉన్న లేపాక్షి ఎక్కడ శ్రీకాకుళ ప్రాంతం ఎక్కడ?



(చిత్రం : 9.3),

శ్రీకృష్ణదేవరాయలు కటకం దాకా జయించి విశాఖపట్నం జిల్లాలోని పొట్నూరులో జయస్తంభం వేయించాడు. అందువల్ల ఆ కాలంలో సూదూర ప్రాంతంకి వెళ్లే జనం ఉండి ఉంటారు.

లేపాక్షిలో దేవుని ముఖం ప్రక్కగా ఉన్నట్లు (profile face) చూపించినప్పుడు రెండవ కన్ను వేయటం కూడా గోచరిస్తుంది. ఇలా గుజరాత్ లో 12-15 వతాబ్దాలలో ఉన్న జైన చిత్రాలలో గోచరిస్తుంది. మహాపురుషులకు రెండుకళా రూపాలను చూపాలన్నది నియమం. "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం " అన్నది సూక్తి. అన్ని ఇంద్రియాలలోనూ కళ్లలో ముఖ్యమైనవని దీని అర్థం.

లేపాక్షిలో వ్యక్తిరూపాలు చాలా పెద్దవిగా మానవపరిమాణం లో ఉంటాయి. వారుధరించిన వస్త్రాలు అద్దకం చేసిన కలంకారీ చేసిన వస్త్రాలను తలపుకు తెస్తాయి. వస్త్రాలంకరణ చిత్రకారులు ఈ చిత్రాలను వేశారా ననిపిస్తుంది. ఈ చిత్రాలను వీరణ్ణ విరూపణ్ణ అనే సహోదరులు వేయించారని వినికిడి. కుడ్యచిత్రంలో వీరి పూర్తి చిత్రాలు కూడా ఉన్నాయి. ఈ రోజులల్లో లాగానే ఆరోజుల్కోల లేపాక్షి చిన్న గ్రామమే అయిఉంటుంది. ఈ గ్రామీణ వాతావరణం లేపాక్షి చిత్రాలలో వుట్టిపడుతూ ఉంటుంది.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో విజయనగరం వచ్చిన పేస్ అనే వ్యాపారస్తుడు కూడా అక్కడ తాను చూచిన చిత్రాల గూర్చి కొంత సమాచారం వ్రాశాడు. రాజభవనంలో తానుచూసిన కుడ్యచిత్రాలలో సమకాలీన జనజీవన చిత్రణ ఉన్నదని, పోర్చుగీసువారిని కూడా చూపించారని, చివరకు గుడ్డివారిని బిచ్చగాళ్లను కూడా చూపించిదని చెప్పాడు. అలాగే శ్రీకృష్ణదేవరాయలు నివసించే భవన ముఖ ద్వారం పై రెండు వైపులా కృష్ణదేవరాయల చిత్రం ఎడమవైపు, ఈయన తండ్రి అటుయిన నరసనాయకుని చిత్రం కుడివైపు వేసి ఉన్నాయి. వారు చక్రవర్తిగా ఎటువంటి దుస్తులు ఆభరణాలు ధరించారో అటువంటివే ఈ రూపచిత్రాలలో ఉన్నాయని తండ్రి కొడుకు కన్నా లావుగా కొంత నల్లగా లావుగా ఉన్నాడని చెప్పాడు.

దురదృష్టవశాత్తు 1565లో జరిగిన తళ్లికోట యుద్ధం తరువాత విజయనగరాన్ని సమూలంగా దోచుకుని తగులబెట్టడంతో ఇటువంటి చిత్ర సంపద అంతాపోయింది. అయితే శ్రీకృష్ణదేవరాయలు సతీసమేతంగా అంటే

చిన్నాదేవి, తిరుమలదేవితోపాటుగా ఉన్న కంచు విగ్రహాలు తిరుమలలోని శ్రీనివాస్ ఆలయంలో నేటికీ ఎక్కడ పెట్టారో అక్కడే ఉన్నాయి. ఇవి శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా చేయించి పెట్టించినవే.

ఒకానొక సాహితీ విమర్శకుడు ఈకృష్ణదేవరాయల విగ్రహం పై వ్యాఖ్యానిస్తూ ఫేస్ రాయలముఖం పై స్ఫోటకం మచ్చలున్నాయని చెప్పాడని, ఈ విగ్రహంలో మాత్రం అవి చూపలేదని, అది ఒక లోపంగా వ్యాఖ్యానించాడు.

బాగు! బాగు! నిజజీవితంలో ఎలా ఉన్నా చిత్రశిల్ప కళాజీవితంలో కొంత అందంగా హుందాగా చూపితే బాగుండునని అనుకోవటం ఆక్షేపించాల్సిన విషయం కాదు. ఈ విమర్శకుడినినే చూశాను. ఆయనకున్న ఈ నిగనిగలాడే బట్టబుర్ర (బట్టతల) చూస్తే ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయలు వర్ణించినా బ్రహ్మరాక్షసుని మెరిసే బట్టతల నాకు గుర్తొచ్చింది. రేపు ఎప్పుడైనా ఎవరైనా, ఈయన విద్యార్థిని మీసార్ ఎలా ఉంటారు అని అంటే నేను చెప్పిన విషయం చెప్పరు . చక్కగాతెల్లగా ఉంటారనే అంటారు. శ్రీకృష్ణదేవరాల పోషణలో జీవితం గడిపే కళాకారులు కూడా వారి కంటికి తమ రాజపోషకుడు చక్కగానే కనిపిస్తాడు. దృశ్యకళలో చూపిస్తాడు. పేస్ పాశ్చాత్యుడు. రాయల పై ఏమాత్రం ఆపాయ్యతా లేనివాడు. అందుకే స్ఫోటకం మచ్చల గూర్చి చెప్పాడు.

నిజానికి పేస్ వర్ణించిన శ్రీకృష్ణదేవరాయల కుడ్య చిత్రం ద్వారా మనం తెలుసుకోవాల్సిన విశేషం మరొకటి ఉంది. విజయ నగరం రాజభవనం ముఖద్వారం వద్ద వేసిన శ్రీ కృష్ణదేవరాయలు తానుచక్రవర్తి గా రాజసభలో ఎంతటి ఖరీదైన వస్త్రాలు ధరిస్తాడో నగలు ధరిస్తాడో అవన్నీ ఈ చిత్రంలో ఉన్నాయట. అదే తిరుమల శ్రీనివాస్ ముందు రాయలు నడుము నుండి మోకాలి దాకా బిగుతుగా ఉన్న సాధారణ వస్త్రాన్ని ధరించాడు. రెండుచేతులూ జోడించి ఎదురుగా వున్న తన ఇష్టదైవం శ్రీనివాస్‌కి నమస్కరిస్తున్నాడు. హంపీ విజయనగరం లోని చిత్రం ప్రజలను ఉద్దేశించినది. ప్రజలకు తమ చక్రవర్తి చక్రవర్తిలాగే కనిపించాలి. తిరుమలోని విగ్రహం అందరి లాగా సామాన్య భక్తునిలా చూపే విగ్రహం. దేని గొప్ప దనం దానిది.

తల్లికోట యుద్ధం తరువాత విజయనగరంల శిథిలమైన తరువాత ప్రజలు వివిధ దక్షిణాది నగరాలకు చేరుకున్నారు. వీరిలో చిత్రకార కుటుంబాలుకూడా

శ్రీరంగ పట్నం, మైసూరు తంజావూరు, శ్రీరంగం, మధురై తిరువనంతపురం లో స్థిర నివాసం చేశారు. అక్కడ రాజుల పోషణలో వివిధ దేవాలయాలలోనూ రాజప్రాసాదాలలోనూ కుడ్య చిత్రాలను వేశారు.

శ్రీరంగం తంజావూరు మధురై తదితర ప్రాంతాలలో వేసిన కుడ్య చిత్రాలలో వాచకం కూడా తెలుగులోనే వ్రాశారు. కాని, అ కుడ్య చిత్రసంపద చాలా మటుకు కనుమరుగైంది. మిగిలి ఉన్నదానికి వెలుగు లోని తెచ్చే ప్రయత్నం ఎవరూ చేయలేదు. ఇది బాధాకరమైన విషయం.

# తెలుగు కాగితం చిత్రప్రతులు - పూర్వరంగం

తెలుగు భాషలోకి 'కాగితం' అన్నపదం తెలుగు పుస్తకాలను కాగితంతో రూపొందించే పద్ధతి ఇటువంటి కాగితం పుస్తకాలలో వాచకంతో పాటు చిత్రాన్ని కూడా వ్రాసే సంప్రదాయం ఇస్లాం భాష. సంస్కృతి. కళా పరిచయం ప్రభావం మూలంగానే తెలుగువారికి అలవడింది.

శ్రీనాథుడు రాజ మహేంద్రవరంలో రచించి బెండపూడి అన్నమంత్రికి అంకితం ఇచ్చిన భీమేశ్వర పురాణం (సి. 1425) లో కాగితం ప్రస్తావన ప్రప్రథమంగా తీసుకువచ్చాడు. కృతిపతి అయిన అన్న మంత్రికి దేశ భాషలనేకంతోపాటుగా "అరబ్బీ భాష తురుష్కభాష .. వచ్చు." నని శ్రీనాథుడు చెప్పాడు. ఇంకా తన ప్రభువైన అనవేమారెడ్డి యొక్క అభ్యుదయం రాజ్యోన్నతి కొరకు గుల్బర్గా పాలకుడైన సుల్తాన్ అహ్మద్ షా కుసముచిత కాగితంపై పారశీక భాషలో వివిధ వర్ణాలతో చక్కగా కుదురుగా తీర్చిదిద్ది కన్నుల పండుగగా ఉండే అలంకారిక లిపిలో వ్రాసిన ఉత్తరాలను పంపేవాడని తెలియచేశాడు.

అరబిక్, పారశీకం. టర్కిష్ భాష లలో అలంకారిక లిపి (callegraphy), ముస్మల్మానుల పవిత్ర గ్రంథం అయిన ఖురాన్ రూపొందించిన కాలంనుండి ఉంది. నేటి ఇరాక్, ఇరాన్ ఆఫ్ఘనిస్తాన్ దేశాలలో విస్తరించిన పారశీక దేశంలో పారసీక చిత్రకళ బహు ప్రాచీనమైంది.

ఫిరదౌసి రచించిన షాద్‌నామా (సి.1010) లోని రణరంగ ఘట్టాలను మహ్మద్ గజనీ (ఆర్. 998- 1030) కుడ్యచిత్రాలలో వ్రాయించాదని చరిత్ర కథనం. ఈవిధంగా ప్రాచీన కాలంలో పారశీక కళకూడా కుడ్య చిత్ర మాధ్యమంలో నే ఉన్నా తరువాత పూర్తిగా కాగితం మాధ్యమంలోనే అక్కడి చిత్రకళ రాణించింది. ఇస్లామతంలో

విగ్రహాలు, విగ్రహారాధన, దైవసంబంధమైన చిత్రాలు, ప్రవక్త పరమైన చిత్రాలు రూపొందించటం నిషిద్ధం కనుక మత గ్రంథాలలో కేవలం అలంకరణ చిత్రాలే ఉన్నా జ్యోతిషం, వైద్యం. ఇతిహాసం, చరిత్ర, స్వీయచరిత్ర, జీవిత చరిత్ర మొదలైన గ్రంథాలలో విరివిరిగా చిత్రాలను పొందుపరచటం ఓ ముఖ్య సంప్ర దాయంగా ఏర్పడింది.

భారత ఉపఖండంలో మనకు దొరికిన అతిప్రాచీన కాగితపు చిత్రప్రతి() నేపాలో రూపొందిపబడిన శివధర్మ(సి. 1229) ఆగ్రా ప్రాంతంలో రూపొందింపబడిన అరణ్యపర్వం (1516) లోర్ చందా(సి. 1525) మృగావత్ (సి. 1550) రాజస్థాన్, గుజరాత్ లలో రూపొందింపబడిన భాగవతం (సి. 1550) చౌరపంచశిఖా(సి. 1550) గీతగోవిందం (సి. 1542) ముఖ్యమైన చిత్రప్రతులు.

తెలుగునాట చింతామణి కథ బహుసుప్రసిద్ధం. ఈకథలో కథానాయకుడు బిల్వమంగళుడు. ఇతడు గుంటూరు జిల్లాలోని కొల్లూరు వాసి. ఈతడు రచించిన బాలగోపాల స్తుతికి( సి. 1425 )లో రూపొందింపబడిన వైష్ణవపరమైన కాగితం చిత్రప్రతులలో ప్రాచీనమైనది.

దక్షిణ భారతదేశంఅంతటాను, తెలుగునాటకూడా రమారమి కందుకూరి బాల్యం వరకు తాటాకు పుస్తకాలే ఉండేవి. గంటంతో ఆకుపై వ్రాయటమే పరిపాటి. తన ఆత్మకథలో చిలకమర్తి లక్ష్మీనరసింహ గంటం మా ఇంట్లో ఉండేది కాని దానితో ఎలా వ్రాయాలో తెలియదు అని చెప్పాడు. నేటికీ ఒరిస్సా లోని రఘురాజ్‌పూర్‌లో తాటాకుల పై గంటంలో చిత్రాలు వ్రాసే కళ నిలిచి ఉంది. తెలుగు కన్నడ తమిళ తాళపత్ర గ్రంథాలు వేవేలు ఉన్నా చిత్రాలలో కూడిన తాళ పత్ర గ్రంథం ఒక్కటీ లేకపోవటం ఆశ్చర్యం వేసే విషయం.

కేరళలో కొళైముక్కు అనే గ్రామంలో జనవరి 20, 1453లో తాళపత్రాలపై వేసిన రామాయణచిత్రాలు చెప్పుకోతగినవి. 318 దృశ్య ఘట్టాలు 114 వివరణ వాక్యాలు ఉన్న ఈ ప్రతిని బాలకవి శిష్యుడు రూపొందించాడు.

పారశీక ప్రభావంతో గుజరాత్, రాజస్థానీ ప్రాంతంలో రూపొందించిన జైన మత చిత్రప్రతులకు కాగితం వాడకం 12వ శతాబ్దంలోనే ప్రారంభమైంది. నేమినాథ రాజమారి, కల్పసూత్ర, కాలకాచార్య కథ మొదలైన జైన గ్రంథాలకు కాగితపు చిత్రప్రతులు రూపొందింపబడినాయి. అలాగే ఢిల్లీ, మాండులలో, షానామా సింద్ బాద్ నామా వంటి పారశీక గ్రంథాలకు కాగితం చిత్రప్రతులు రూపొందించిబడినాయి.

మధ్య ప్రదేశ్ లోని మాండులో రూపొందింపబడిన వంటల పుస్తకం "నీమత్ నామా"లో కూడా చాలా బొమ్మలు ఉన్నాయి. అయితే, కాగితం చిత్ర ప్రతులను అమితంగా ప్రోత్సహించిన వాడు అక్బర్.

1526లో ఆగ్రా రాజధానిగా బాబర్ (1483-1530) మొగల్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. తన ఆత్మకథను టర్కీభాషలో 'బాబర్ నామా' గా వ్రాశాడు. బాబర్ బంధువైన సుల్తాన్ హుస్సేన్ మిర్జా (ఆర్. 1468- 1506) నేటి ఆఫ్ఘనిస్తాన్ లోని హేరాత్‌ని పాలించేవాడు. ఇతడు కమాలుద్దీన్ బెహజాద్ (సి. 1455- 1535) షాముజఫర్ అనే చిత్రకారులను పోషించాడు. బాబర్ వీరి చిత్రాలను చూచాడు. తన బాబర్‌నామాలో హేరాత్ లోని బెహజాద్ చాలా గొప్ప చిత్రకారుడని రాసాడు. ఇది అక్షర సత్యం. ఈతడు వ్యక్తిత్వవాద మానవతావాదంకి చిత్రకళలో స్థానం కల్పించిన వ్యక్తి. తాము రూపొందించిన చిత్రాలలో తమ సంతకాలు కూడా వ్రాయుట ఇది మాది అనేది ఈతని కాలంలోనే ప్రారంభమైంది. ఇతను తరువాత హేరాత్‌నుండి ఇరాన్‌లో ఉన్న తాబ్రీజ్‌కి వెళ్లాడు. ఏదో పోషకులకు రాజపోషకులకు కాక నాకు తెలిసినంతవరకు, తనకు తాను తన కోసం చిత్రం వేసుకున్న ప్రప్రథమ చిత్రకారుడు ఇతనే ఇస్లామీ మతంలో పవిత్ర గ్రంథమైన 'ఖురాన్' లోని "ఒంటెలు ఎలా సృష్టించబడి నాయో ఎవరికైనా తెలుసా" అనే శ్లోకానికి (sura) ఓ అద్భుతమైన చిత్రం రూపొందించాడు. ఈ ఒక్క చిత్రంపై ప్రాచీన చిత్రాల ప్రభావము, భారతీయ చిత్రకళపై చూపిన ప్రభావమూ గురించి కనీసం రెండు వందల పుటల పుస్తకం వ్రాయవచ్చు. వ్రాద్దామనే ప్రతిరోజూ నేను అనుకుంటూ ఉంటాను.

1540లో హుమాయూన్ ఢిల్లీలో పోగొట్టుకున్న తరువాత ఎన్నో ఏళ్లపాటి పర్షియాలో తలదాచుకున్నాడు. బెహజాద్ శిష్యులైన ఆగామీరక్, సుల్తాన్ మొహమ్మద్, ముజఫర్ ఆలీ తదితరులు రూపొందించిన చిత్రాలను హుమాయూన్ పరిశీలించాడు. కాబూల్‌లో నివాసం ఉండగా బెహజాద్ శిష్యులైన మీర్ సయ్యద్ ఆలి తాబ్రిజి, అబ్దుల్ సమద్ షిరాజీ అనే పేరున్న చిత్రకారులను తన ఆస్థానంలో ఆహ్వానించి పోషించాడు. హుమాయూన్ వీరి వద్ద చిత్రకళను అభ్యసించిటంతో పాటు అక్బర్ కి కూడా నేర్పించాడు.

అక్బర్ అధికారంలో కి వచ్చాక (ఆర్. 1556-1605) ఫతేపూర్ సిక్రి నిర్మించికోటలో కితాబ్ ఖాన్ (గ్రంథ నిర్మాణ నిలయం) తస్వీర్ ఖానా (చిత్రగ్రంథ నిలయం) లను ఏర్పరిచాడు. ఆక్బర్ నేతృత్వంలో రూపొందిన తొలి మొగల్ చిత్రప్రతి అయిన "హంజనామా"ను మీర్ సయ్యద్ ఆలీ, అబ్దుల్ సమద్‌లు పర్యవేక్షించారు.

ఎందరో స్థానిక హిందూముస్లిం చిత్రకారులు పాల్గొన్నారు.

అక్బర్ ఆదేశంతో కొంత అయిష్టంగానే అబ్దుల్ ఖాదిర్ బదౌని వాల్మీకి రామాయణంని పారశీకంలోని అనువదించగా, 365 పుటలు 176 చిత్రాలతో కూడిన రామాయణ చిత్రప్రతి రూపొందించబడింది. వీటి రూపకల్పనలో అనేకమందిహిందూ ముస్లిం చిత్రకారులు - బసావన్, జగన్, కేశవ్, కలన్, కన్హలాల్ మిష్కిన్, తులసి, తులసి కలన్ - కలిసి కట్టుగా పనిచేశారు. కొత్తగా దేవ్‌జీ గుజరాతి కేశవ్ గుజరాతి - వీరు గుజరాత్ నుండి చేరారు. మండొ అనే విదేశీయుడు (ఫిరంగ్) కూడా ఉన్నాడు.

ఇదే కాలంలో తెలుగునాట ఒక కాగితపు రామాయణ చిత్ర ప్రతి రూపొందింపబడింది. ఇది నేడు. హైద్రాబాద్ లోని స్టేట్ మ్యూజియంలో ఉంది. ముందు వెనుక కొన్ని చిత్రాలు పోగా. 93 వర్ణచిత్రాలు ఉన్నాయి. దశరథనందనుల విద్యాభ్యాసంతో ప్రారంభమై కథ నడుస్తుంది. ఈ చిత్ర ప్రతికి కాగితం వాడట. అన్న ఒక్క అంశంలోనే పారశీక ప్రభావం గోచరిస్తుంది. చిత్ర రచన శైలి అంతా తెలుగు చిత్రశైలి లోనే ఉన్నది. ఏమాత్రం పారశీక ప్రభావం గోచరించదు. ఉదాహరణకు. సీత అగ్ని ప్రవేశం చిత్రపటం. పటం మొత్తాన్ని మూడు పట్టీలో చూపబడింది. పై పట్టికలో సీతారామ లక్ష్మణుల ముందువానరసైన్యం కట్టెలు పేర్చి చితిపెట్టడం చూపబడింది. మధ్య చట్రంలో అందరి సమక్షంలో సీత అగ్నిలో ఉండటం చూపబడింది క్రింది పట్టీలలో అగ్నిదేవుడు సీతను పట్టి ఉండటం రాముడు సీతను తన వామాంకంపై కూర్చోబెట్టుకోవటం ఉంది. ఇలా ఒకే చట్రంలో సీత రెండుసార్లు గోచరించటం తెలుగు చిత్రకళలో ఒకసొగసైన అంశం. దీనిని కళా చరిత్ర పరిభాషలో (కొనసాగించిన కథాకథనం) అని అంటారు. ఈ చిత్రంలో ఒకే చట్రంలో ఇద్దరు సీతలు ఉన్నారు కనుక ఇద్దరు సీత అని అర్థం కాదు. ముందుగా అగ్ని దేవుడు సీతను పట్టుకున్నాడు. అటు తర్వాత రాముడికి ఇస్తే (ఈ సన్నివేశం చిత్రంలో లేదు) రాముడు ఆమెను తన వామాకంపై కూర్చోబెట్టుకున్నాడు. చిత్రాన్ని ఇంకా చదవాలి. భారతీయ చిత్రకళలోనూ తెలుగు చిత్రకళలో ఈ కథ కథనం చాలా విశేషమైన అంశం. ఈ చిత్రప్రతిలోని రావణకాష్టం చిత్రం చూడండి (చిత్రం : 10.1). చిత్రాన్ని రెండు భాగాలుగా విభజించి పైన రావణుని చుట్టూ అతని స్త్రీలు రోదిస్తున్న దృశ్యం చూపబడింది. రావణుని కాళ్ళవద్ద కూర్చున్న స్త్రీ మిగతావారికన్నా అందంగా ఉంది. అందువల్ల ఈమె మండోదరి. ఈమె వెనుక నుంచున్నది విభీషణుడు. క్రింది అరలో రావణుని అగ్ని సంస్కారం చూపబడింది. వకళా చరిత్రకారులు ఈ చిత్రప్రతి కి 1750 లో

రూపొందింపబడింది అంటారు. కాని, పారశీక ప్రభావం గాని, ఇక ముందు కూడా చూడబోయే దక్కనీ చిత్ర ప్రభావం గాని, ఏమాత్రం లేని ఈ చిత్రప్రతి 1565లో జరిగిన తళ్ళికోట యుద్ధానికి పూర్వమే తెలుగు నాట రూపొందిపబడి ఉంటుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఈ రామాయణం చిత్రప్రతిని తిరిగి పరిష్కరించి ప్రచురించాలని నా ప్రగాఢ కోరిక. ఇంతకూ ఈ చిత్రప్రతిలో చిత్రాలను సంస్కృత భాషలో వివరించే క్లుప్త వాచకం తెలుగు లిపిలోనే వ్రాసి ఉంది. అందువల్ల ఇది తెలుగు చిత్రాల కాగితం ప్రతియే అని గంటాపథంగా చెప్ప వచ్చు.

# దక్కను చిత్రకళ


వింధ్య పర్వతశ్రేణికి దక్షిణాన గల దక్కను పీఠభూమి నేటి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లలో విస్తరించి ఉంది. 14వ శతాబ్దపు ప్రారంభంలో మహారాష్ట్ర లోని దేవగిరి, ఆంధ్ర ప్రదేశ్ లోని వరంగల్లు, తమిళనాడు లోని మధురై కర్ణాటక లోని హళెబీడు నాలుగు పెద్ద ధనవంతమైన రాజ్యాలకు రాజధానులుగా ఉండేవి. 1294 లో ఢిల్లీని పాలిస్తున్న అల్లావుద్దీఖిల్జి (ఆర్. 1296-1316) వింధ్యను దాటి దక్షిణా పథంకి వచ్చిన తొలి ఢిల్లీ రాజు. ఇతను ఇతని వారసుడు ఉలఘ్ ఖాన్, అదే మహమ్మద్ బీన్ తుగ్లక్ (ఆర్. 1325- 1351) చేసిన దండయాత్రలతో ఈ హిందూ సామ్రాజ్యాలన్నీ అంతరించి పోయాయి. ఇలా దక్షిణ భారతదేశం అంతా అతలాకుతలం అవుతున్న కాలంలోనే 1336లో విజయనగర సామ్రాజ్య స్థాపన జరిగింది.

15వశతాబ్దం చివరి దశకంలో దక్కను ప్రాంతంలో స్వతంత్ర ముస్లిం సామ్రాజ్యాలు నెలకొనటం ప్రారంభమైంది. 1489లో యూసిఫ్ ఆదిషా (ఆర్1489- 1509) ఆదిషాహి సామ్రాజ్యాన్ని బీజాపూర్‌లోనూ అహమ్మద్ నిజాం షా బహారి (ఆర్ . 1409 - 1510) అహమ్మద్ నగర్ లో నిజాం షా రాజ్యాన్ని గోల్కొండలో కుతుబ్‌షాహీ సామ్రాజ్యాన్ని సుల్తాన్ కులికుతుబ్ షా(ఆర్. 1512- 1543) నెలకొల్పారు.

1565లో అహమ్మద్ నగర్ కి చెందిన ఒకటవ హుస్సేన్ నిజాంషా (ఆర్. 1555- 1565) బీజాపూర్‌కి చెందిన ఒకటవ ఆదిల్ షా (ఆర్. 1557- 1579) గోల్గొండకు చెందిన ఇబ్రహీం కుతుబ్‌షా (1550- 1580) అలాగే

గుల్బర్గా వారు, బీదర్‌వారు ఏకమైచేసిన యుద్ధంలో విజయనగరం పతనం కావటం, రాజదాని పూర్తిగా ధ్వంసం కావటం జరిగినట్లుఉంది. ఎందరో చిత్రకారులు దక్షిణాదికి వలసవెళ్లారు. వీరిలో కొందరు తెలుగుచిత్రకారులు అహమ్మద్ నగర్ లో బీజాపూర్ లో స్థితపడినట్లున్నారు. సరిగ్గా 1565లోనే దక్కను నుంచి చిత్రశైలి అహమ్మద్ ప్రారంభమైంది. ఈ తొలిదశలో తెలుగు చిత్రశైలీ ప్రభావం దక్కన్ చిత్రకళపై ప్రస్ఫుటంగా కనిపస్తుంది. అలాగే, ఈ రాజులంతా పర్షియా (ఇరాన్) లోని తాబ్రీజ్ ఖురసాన్ ప్రాంతం నుండి చిత్రకారులతోనూ కవులతోనూ వచ్చి ఇక్కడ స్థిర పడినవారు కనుక ఆ ప్రాంతపు కళ ముఖ్యంగా ముందు చెప్పిన బెహజాద్ చిత్రకళా ప్రభావ మేళవింపు కూడా గోచరిస్తుంది.

1565లో పొందిన విజయానికి జరిపిన వేడుకలలో భాగంగానే దక్కనీ చిత్రకళ తొలుత,అహమ్మద్ నగర్‌లో ఆవిర్భవించింది. ఈ నిజాంషా భార్య పేరు ఖాన్‌జ్ద హుమాయూన్. ఆ కాలంలోనూ, తరువాతి కాలంలోనూ ఒక ఇస్లాం సామ్రాజ్యంలో ఈరాణి చలాయించిన పలుకుబడి, కళాసేవ చేసినవారు మరొకరులేరు. అఫ్ తబి అనే కవి చేత తన భర్త సాధించిన విజయాన్ని గూర్చి తారిఫ్ – ఇ హుస్సేన్ షాహి' అనే పుస్తకాన్ని పారశీకంలో రచింపచేసింది. 1565లో జనవరిలో విజయం తరువాత సంబరాల జోరు, తాగుడు ఎక్కువై ఈమె భర్త మరణించాడు. అసంపూర్ణంగా ఉన్నఈ పుస్తకం అప్పటికి అలా ఉండిపోయింది. ఈ మె ఈ పుస్తకానికి చిత్రాలు కూడా వేయించింది. ప్రస్తుతం పన్నెండు చిత్రాలు మాత్రమే మిగిలాయి. పూనెలోని భారత ఇతిహాస సంశోధక మండలిలో భద్రంగా ఉన్నాయి.




(చిత్రం : 11.5)

పరిషియన్ చిత్రాలలో కథానాయిక చిత్రించటమే గాని పాలిస్తున్న సుల్తాన్ రాజుగారి భార్య చిత్రాన్ని వేయుటం ససేమిరా కనిపించదు. తారీఫ్ ఇ హుస్సేన్ సాహిలో వేసిన ఒక చిత్రం చూడండి (చిత్రం : 11.1) దీవాన్ వంటి ఆసనంపై సుల్తాన్ హుస్సేన్ నిజాం షా కూర్చొని ఉంటే ఈయన భార్య ఖాన్‌జ్జ హుమాయూన్ భర్తతొడపై కూర్చున్నట్లు చూపించారు. సీత రాముని తొడపై కూర్చొని ఉంటుంది. విజయనగరంలో కొల్లగొట్టిన చిత్రసంపదలో ఎక్కడో ఇటువంటి హిందూ దేవతా చిత్రాన్ని చూచి ఉంటారు. దాని ప్రభావంతోనే ఇలా చూపి ఉంటారు. చుట్టూ ఉన్న భవన సముదాయం వాటి అలంకరణ చూస్తే హేరాత్‌లో బెహజాద్ వేసిన కొన్ని చిత్రాలు గుర్తుకు వస్తాయి. ఖాన్‌జ్జ హుమాయున్ కుమారులు ఇద్దరూ ఒకటవ మూర్తజ (ఆర్. 1565- 1588) రెండవ బుర్హాన్ (ఆర్. 1591-1595) లు కూడా చిత్రకళను ఆదరించారు.

బీజాపూర్‌ని పాలించిన ఇస్మాయిల్ షా (1509- 34) గూర్చి ఫరిస్తా అనే చరిత్ర కారుడు చెబుతూ ఈతనికి స్థానిక దక్కని సంప్రదాయంకన్నా, పారశీక సంప్రదాయమంటేనే ఇష్టమనీ, చిత్రకళను ఆదరించాడని చెప్పాడు. అయినా, ఈతని కాలానిచెందిన చిత్రాలు ఏవీ లభించలేదు. ఇస్మాయిల్ మనుమడు సుల్తాన్ ఆలి ఆదిల్ షా (ఆర్. 1557- 79) తళ్లికోట యుద్ధంలో గెలిచినవాడు. ఇతడూ చిత్రకళను ఆదరించాడు. ఈతని కాలంలో బీజాపూర్ లో నుజుం అల్ ఉలమ్ అనే పారశీక చిత్రప్రతి రూపొందించబడింది ఇది ప్రస్తుతం ఐర్లాండు దేశంలోని డబ్లిన్ నగరంలో ఉంది. ఇందులో 876 చిత్రాలు ఉన్నాయి. వీటిలో రమారమి నూరు హిందూ దేవీ దేవతా చిత్రాలు ఉన్నాయి. ఇటువంటి చిత్రప్రతులు మరికొన్ని కూడా విదేశాలలో నేడు ఉన్నాయి. విజయనగర సామ్రాజ్యంలో శ్రీకృష్ణ దేవరాయలులా, మొగల్ సామ్రాజ్యంలో అక్బర్ లాంటివాడు బీజాపూర్ చెందిన రెండవ సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్ షా (ఆర్. 1579- 1627). స్వయంగా కవి, సంగీతజ్ఞుడు కనుక ఈయన కాలంలో వేసిన చిత్రాలలో ఈ కవితా ప్రభావం కవి హృదయ ప్రభావం మెండుగా కనిపిస్తుంది. ఈ సుల్తాన్ చూపే చిత్రాలు కొన్ని ఉన్నాయి (చిత్రం : 11.2). ఏ గొప్ప చిత్రకారుడు వేశాడో తెలియదుగాని, ఈ ఇబ్రహీం గుర్రపు స్వారీ చేస్తున్న చిత్రం (చిత్రం : 11.3) చూసే అసలు ఈ చిత్రం రాజును చూపించటానికి రూపొందించిందా? లేక చుట్టూ వున్న ప్రకృతి రమణీయతను చూపించటానికి వేసిందా? అని సందేహం.

సంభ్రమాశ్చర్యం కలుగుతుంది.



(చిత్రం : 11.4)

అరె, ఈ చిత్రం మన తెలుగునాటదికాదే, అయ్యో ! ఇది నేడు ఎక్కడో రష్యాదేశంలోని లెనిన్‌గ్రాడ్ లోని ఒక పరిశోధనా సంస్థ సంరక్షణ లో ఉందే? అని నామట్టుకు నాకు కొంత బాధ కల్గించిన మాట వాస్తవం.

ఈతని తరువాత పాలనలో కి వచ్చిన సుల్తాన్ మొహ్మద్ అదిల్‌షా (1627-56) కాలంలో మయన్‌చాంద్ అనే వ్యక్తికుమారుడైన మొహమ్మద్ ఖాన్ తాను వేసిన పలుచిత్రాలపై తనసంతకాన్ని గుప్తంగా చిత్రంలో పొందుపరిచారు. ఇలా సంతకం చేయటం పారశీక చిత్రకళా సంప్రదాయం. ఇతనే కాకుండా జంటగా చిత్రాలు వేసిన హైదర్ అలీ, ఇబ్రహీం ఖాన్ కూడా తాము రూపొందించిన చిత్రాలలో తమ సంతకాలను పొందుపరిచారు. రెండవ సుల్తాన్ ఆలి అదిషా (1656- 72) పాలనాకాలంలో మహమ్మద్·నక్కాష్ కూడా తనచిత్రాలలో సంతకం చేశారు. వరంగల్ జిల్లా చెర్యాలలోని పట చిత్రకారులు నేటికీ తమను తాము నఖ్కాష్ చిత్రకారులగానే చెప్పుకుంటారు. బీజాపూర్‌లోని చివరి పాలకుడైన సికందర్ (1672- 1686) కాలంలో కమాల్ మొహమ్మద్, చాంద్ మొహమ్మద్ కలిసి అది షాహి సుల్తాన్‌లనందరినీ కలిపి ఒకే చిత్రంలో చూపి వంశవృక్షం చిత్రపటం రూపొందించారు. ఈ సుల్తాను లందరూ ఒకే కాలం వారుకాకపోయినా చిత్రంలో ఒకరిపక్కన ఒకరుగా ఉన్నందున ఒకే కాలంలో ఉన్న వారుగా గోచరిస్తారు. ఈ చివరి దశలో అబ్దుల్ ఖాదిర్, ఇబ్రహీంఖాన్ అనే మరో జంట చిత్రకారుల కూడా ఉన్నారు.

గోల్కొండ లో కుతుమ్ షాహి వంశంలో మొదటివాడైన సుల్తాన్ క్యలి (1512-

43 ) కాలంలో ఖురాన్‌కి అలంకారిక ముఖపత్రం (illuminated cover page) రూపొందించబడినాయి. తెలుగువారు ఇభరాముడుగా పిలిచిన ఇబ్రహీం కుతుబ్‌షా (1550- 80) తళ్లికోట యుద్ధంలో గెలిచినవాడు. ఇతని కాలంలో గోల్కొండ లో 'అన్వర్ - ఇ -సుహైలీ' అనే పారశీక గ్రంథాన్ని రూపొందించిన చత్రపతి లో 126 చిత్రాలు ఉన్నాయి. ఈ ప్రతి లండన్‌లో ఉంది.


పర్షియా (ఇరాన్) లో ఖురుసాన్ ప్రాంతం నుండి వలస వచ్చిన చిత్రకారుల తోపాటు స్థానికంగా విజయనగరం ప్రాంతం నుండి వలస వచ్చిన చిత్రకారులు కూడా ఈ 'అన్వర్- ఇ సుహైలీ' చిత్రాల రూపకల్పనలో చేతులు కలిపారు. ఒకచిత్రం (చిత్రం : 11.4) చూడండి. జూలు సింహం పైకి లేచిన వైనం చుట్టూ అడవిలో ఉన్న ఇరుకుతనం లేపాక్షి చిత్రాలలో గల కిరాతార్జునీయ చిత్రంలోని వరాహం ని తలపుకు తెస్తుంది. లండన్‌లో గల 'సింద్ బాద్ నామా' లో కనీసం ఏడుచిత్రాలు ఉన్నాయి. ఈ గ్రంథాలయంలోనే మరి 25 విడివిడిగా గోల్కొండ చిత్రాలు ఉన్నాయి. పాట్నాలోని ఖుదా భక్ష్ గ్రంథాలయంలో ఇబ్రహీం నేతృత్వంలో రూపొందించిన 'సిరీన్ కుస్రు' అనే గ్రంథ వ్రాయసకాని పేరు యూసఫ్ ఈ ప్రతిలో ని చిత్రాలు ఎక్కడా ప్రచురితం కాలేదు. నేడు డబ్లిన్‌లో గల 'జఖిర ఖవారి జింషహి' అనే వైద్య గ్రంథాన్ని వ్రాసినది హేరాత్ నుండి వచ్చిన బాబా మీరక్ హేరాతి 1572 లో రూపొందింపబడిన ఈ ప్రతిలో రెండు ముఖ పత్రచిత్రాలు ఉన్నాయి.

1591లో భాగ్యనగరం లేదా హైదరాబాద్ నగరంని స్థాపించిన మొహమ్మద్ కులికుతుబ్‌షా (1580-1612) ఉర్దూకవి. చిత్ర కళా పోషకుడు.ఇతను ఉర్దూలో వ్రాసిన కులియత్ (సంకలనం )అనే కవితా సంకలనానిక చిత్ర ప్రతి రూపొందిపబడింది. ఇది హైదరాబాద్ లోని సాలార్ జంగ్ మ్యూజియంలో ఉంది. దీనిలో గల ఎనిమిది చిత్రాలు అచ్చం పర్షియా దేశంలో వేసిన చిత్రాలుగా బెహజాద్ వేసిన చిత్రాలను పోలి ఉన్నాయి. నిలువుగా దీర్ఘ చతురస్రాకారంలో ఉండే ఈ పారశీక చిత్రాలకు ఒక ప్రత్యేకత ఉంది. చిత్రం అంతా చిత్రపు చట్రం లోనే ఉంటూ ఒక మూలాన ఒక చెట్టో ఒక మనిషో చట్రాన్ని అధిగమించి బయటకు ఉన్నట్లుగా చూపటం. ఈ లక్షణం కొన్ని కలుయత్ చిత్రాలలో గోచరిస్తుంది (చిత్రం : 11.5)

ఈ ఇభరాముడనే అద్దంకి గంగాధరుడు తాను తెలుగులో రచించిన తపతీ సంవరణం కావ్యాన్ని అంకితమిచ్చాడు. ఇభరాం వద్దవజీర్‌గా ఉన్న అమీన్ ఖాన్ కు పొన్నె కంటి తెలగన్న తాను రచించిన 'యయాతి చరిత్ర' అంకిత మిచ్చాడు. ఆకాలంలో గోల్కొండలో చిత్రప్రతి రూపొందించే సంప్రదాయం దండిగా ఉన్నందున ఈ రెండు కావ్యాలను చిత్ర ప్రతులను ఎందుకు రూపొందింపబడలేదా నని పిస్తుంది. ఈకాలంలోని హాసిం జాన్‌కులి, మొహమ్మద్: సియహ కలాం అనే చిత్రకారులు తమ చిత్రాలలో సంతకాలు చేశారు.

పదిహేడవ శతాబ్దపు ప్రారంభంలో గోల్కొండలో రూపొందింపబడిన ఒక గుర్రం చిత్రంలో ముస్లిం ఫకీర్లతోనూ, జంతువులతోనూ కూడుకొని ఏర్పడిన ఈ అశ్వం ఆనెగొంది లోని ఉచ్చాయప్ప మఠంలోనూ శ్రీశైలంలోనూ ఉన్న నవనారీ అశ్వం ని తలపుకు తెస్తాయి.

(చిత్రం : 11.5)




సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షా (1626- 72) కు చెందిన అనేక రూప చిత్రాల తో పాటు ఇతనిని సేవకుడు గా ఉన్న ఒక ఆఫ్రికా దేశస్తుని చిత్రం. (చిత్రం) రూపొందింప బడింది. సుల్తాన్‌నుల చిత్రాలలో వారు ఆయుధాలు చేపట్టినట్లు కవి కూడా అయితే పుస్తకం చేపట్టినట్టు కొంత రసికుడైతే గులాబీ పుష్పం పట్టినట్టు చూపటం పరిపాటి. ఎంతో హుందాగా ఉన్న వస్త్రాలు ధరించి, కొంత దీనంగా ఉన్న ఇతని చేతిలో ఏ ఆయుధమూ లేదు. పుస్తకము, పుష్పము లేదు. ఇలా ఇది సేవకుని చిత్రమేనని సూచిస్తుంది.

రామదాసుగా పేరెన్నిక గన్న కంచెర్ల గోపన్న (సి.1630- 1687) ను గోల్కొండ లో చెరసాల పాలు చేసింది ఈ సుల్తాన్ అబ్దుల్లానే. ఈతని తరువాత పాలనలోకి వచ్చిన సుల్తాన్ అబ్దుల్ హసన్ (1672- 87) తెలుగు వారికి తానీషాగా సుపరిచితుడు. ఈతడు ముస్లిం సూఫీలను తెలుగు మంత్రులను

వైష్ణవ సేవకులను ఆరదించాడు. గుల్బర్గాలో గల దర్గాలోని సూఫీ అయిన షారాజు శిష్యుడైనందున, దర్గాలకు హిందువులు ముస్లింలు కూడా వెళ్లటం ఆనాడు ఈనాడు ఆచారం ఉన్నందున, తానీషా విలక్షణ వ్యక్తిగా ఎదిగాడు. ఈతని చిత్రాలలో తానీషాపుష్ప గుచ్ఛాన్ని ఆస్వాదిస్తున్నట్లు, తలవెనుక తేజో బింబం ఉండి దైవత్వం గల వ్యక్తి అయినట్లు చూపబడ్డాడు. చాలా చిత్రాలలోగొడుగు పట్టి వెన్నటంటి ఉన్న సేవకుడు వైష్ణవుడు (చిత్రం : 11.6). ఈతని పోషణలో ఉన్న చిత్రకారుని పేరు రహీం ఖాన్. ఇతడు అనేకచిత్రాలను వేవాడు. వీటిలో షా రాజు గుర్రపుస్వారీ చేస్తున్న చిత్రంలో మంచి నడి వయస్సులో ఉన్న వ్యక్తిగా కనిపిస్తాడు. మరొకచిత్రంలో వృద్ధాప్యంలో తివాచీపై బాలీసుల నానుకుని కూర్చొని హుక్కాపీలుస్తూ ఉంటాడు. ఈతని కుమారుడైన అక్బర్‌షా హుసేని కూడా సూఫీ సంప్రదాయం కొనసాగించినవాడే. ఒక చిత్రంలో పవిత్ర గ్రంథాన్ని చదువుతున్నట్లుగా తల వెనుక తేజో బింబం ఉన్నా , ముందర పెద్దకత్తి, నడుముకు బిగించిన వస్త్రంలో బాకు ఉండి అటు దైవత్వం, ఇటు రాచఠీవి కలిగిఉంటాడు. మరొకచిత్రంలో ఓ సుల్తానులా పుష్పగుచ్ఛం ఆస్వాదిస్తూ గోచరిస్తాడు.

ఈ కాలంలో కేవలం కాగితం పైననే కాక లక్కపూసిన నగల పెట్టెలపైనా కూడా చిత్రాలు రహీం ఖాన్ వేశాడు (చిత్రం : 11.7).



(చిత్రం : 11.7).

ఈ రహీంఖాన్ రామదాసు చిత్రాన్ని కూడా రూపొందించినట్లు స్వర్గీయ కొరంని చూసి వేసినది. అది ఇప్పుడు ఎక్కడుందో తెలియదు. రామదాసు చరిత్ర అచ్చు పుస్తకంలో పొందుపరిచిన పలక అచ్చు చిత్రాలను (Block - Print) చూస్తే కథకు ఆనాడే చిత్రప్రతి రూపొందింపబడిఉంటుందని అవశానాకు కలుగుతున్నది. పారశీక చిత్ర ప్రతులలో అందునా బెహజాద్ రూపొందిన చిత్ర ప్రతులలో రెండు పుటల చిత్రాలు ఒక ప్రత్యేకత. రామదాసు చరిత్ర పుస్తకంలో

కూడా ఇటువంటి చిత్రాలే ఉన్నాయి. ఒకే దృశ్యాన్ని రెండు భాగాలుగా విభజించటనం రెండు భిన్న భిన్న దృశ్యాలను పక్క పక్కన ఒకే చట్రంలో ఉంచటం పారశీక చిత్ర సంప్రదాయం రామదాసుచరిత్ర చిత్రంలో కూడా ఇది ఉన్నది.

రామదాసు చిత్రప్రతి, రామదాసు చిత్రం ఎక్కడైనా ఉన్నదేమో గాలించాల్సి ఉంది. భద్రాచలం లోగాని చైన్నైలో గాని ఉంటుందేమోనని నా ఆశ. హైదరాబాద్ లోనూ ఉండొచ్చు. ఏదైనా ఖర్చుతో కూడుకున్న పని.

1693లో అంతకు పూర్వ ఎవరు చేశారో ఆ ఏడు ఎవరుకొన్నారె తెలియదు. కాని, భాగ్యనగర్ (హైద్రాబాద్)లో ఒకరు ఒక చిత్రాన్ని 800 రూపాయలకు కొన్నారు. ఇది ప్రస్తుతం ఇంగ్లండులో ఉంది. ఆరోజుల్లో ఒక చిత్రానికి అన్ని రూపాయలంటే ఆశ్చర్యం వేస్తుంది.

1687లో మొగల్ వారి విజయం గోల్కొండ వారి అపజయంతో హైద్రాబాద్ కొన్ని సంవత్సరాల పాటు ఒడుదొడుకులకు లోనైంది. 1724 లో అధికారం కి చ్చిన నవాబులుకూడా చిత్రకళను ఆదరించారు.

నవాబ్ మీర్ నిజాం ఆలీఖాన్ (1762- 1803) ఆస్తానంలో వెంకటాచలం (1784- 1803) అనే తెలుగు చిత్రకారుడు ఉన్నాడు. ఇతను చేసిన ఎన్నో చిత్రాలో ఒక్కదాన్నిలోనూ ( చిత్రం : 11.8) తన సంతకం పొందుపరచలేదుగాని 1803లో  అనే బ్రిటీష్ వ్యక్తి చిత్రం వెనుక ఆ చిత్రం వేసింది వేంకటాచలం అని అతను జైపూర్ నుంచి వచ్చాడని వ్రాశాడు.

దెక్కనీ చిత్రాలు అన్నింటిలోనూ చక్కటి మేఘాలు ఉండటం చిలుకలు. కొంగలు, ఆకావంలో ఎగురుతున్నట్టుండటం చెట్లపై ఉడుతలు పైకెక్కుతున్నట్లు ఉండటం పరిపాటి. పచ్చికబయళ్ల మధ్య, వృక్ష వనాల్లో తిరుగుతూ ఉంటారు. ఇవన్నీ దక్కనీ చిత్ర లక్షణాలు. రాజస్తానీ చిత్రాలలో వేటపై ఆసక్తి ఎక్కువగా కనిపిస్తుంది. అన్నీ దక్కని లక్షణాలే గాని రాజస్తాని లక్షణాలు ఏమాత్రంలేని చిత్రాలు వేసిన వెంకటాచలం రాజస్తాన్‌లోని జయపూర్ వాడని చరిత్రకారులు శంకించారు. ఆ పేరుతో చిత్రకారుడు నిజాం ఆస్థానంలో ఉండి ఉండడన్నారు.

ఇది పొరపాటు. తెలుగుపేరున్న వెంకటాచలం రాజస్తాన్ లోని జయపూర్ వాడు కాదు. నేడు ఒరిస్సాలో ఉన్న జయపూర్ నుండి వచ్చిన వాడు. ఈ

జయపూర్ సంస్థానానికి తెలుగు వారితో సంబంధాలు అధికంగా ఉండేవి. తెలుగులో తొలి కార్టూనులు వేసిన తలిసెట్టి రామారావు ఈ ఊరి వాడే.

( చిత్రం : 11.8)



# చిత్రకారులు - నందిగం నాగేశం, కామరౌతు వెంకటేశం

శ్రీమద్రామాయణాన్ని సంస్కృతంలో విరచించిన వాల్మీకి మహర్షి సంస్కృతంలో ఆదికవి. శ్రీమదాంధ్రమహాభారతం గా పేరెన్నికగన్న శ్రీమహాభారతం ని తెలుగులో (ఆరణ్య పర్వంలో కొంత భాగం వరకు) రచించిన నన్నయ భట్టు తెలుగు సాహిత్యంలో ఆదికవి. నన్నయ కాదు తెలుగువారి ఆదికవి మరొకరు అనవచ్చు. బసవపురాణం, పండితారాధ్య చరిత్ర వంటి స్వతంత్ర రచనలుచేసిన పాల్కురికి సోమనాధుడు తెలుగుసాహిత్యంలో ఆదికవి అనవచ్చు. పద్యరూపంలోనే నన్నయ కు చాలా పూర్వమే తెలుగులో 'కవిజనాశ్రయం' అన్న ఛందోగ్రంథం రచించిన మల్లియరేచన తెలుగు కవులలో ఆదికవి ఎందుకు కాకూడదు?

ఇంతకూ చెప్పొచ్చేనదేమంటే సాహిత్యరంగంలో ఆది కవి అనేవారు ఉంటారనే భావన సర్వసాధారణం. చిత్రలేఖన రంగంలో ఆది చిత్రకారుడు అనే భావన అసలు లేనేలేదు. మనకు తెలిసిన తొలి వెలుగు చిత్రకళాకారుడు లేదా చిత్ర కాళాకారిణి గా ఎవరు? ఈ దృష్టి కోనంలో పెద్దగా పరిశోధన జరుగనేలేదు.

అయినా, తెలుగువారి కవిత్రయంలో ప్రప్రథం కవి నన్నయ. రాజ మహేంద్రవరంకి చెందిన కవి కావటం నేటికి తెలిసినంత వరకు మనకు తెలిసినంత వరకు కనీసం పేరైనా తెలిసిన ఇద్దరు ప్రాచీన చిత్రకారులు కూడా రాజమహేంద్రవరం వారు కావటం యాదృచ్ఛికమే. అయినా ముదావహం. నేటి వరకు మనకు తెలిసినంతవరకు తొలి తెలుగు చిత్రకారులు అందునా జంటకవుల లాగా, జంట చిత్రకారుల పేర్లు నందిగం నాగేశం, కామరౌతు

వెంకటేశం వీరు 1757- 1758 నడుమ రాజమహేంద్రవరంలో రెండు భిన్నమైన చిత్రప్రతులను రూపొందించారు. వీరు సుమారు 12.2. ×12.7 అంగుళాల (31×32.4 సెం.మీ) పరిమాణం గల కాగితం పై మొత్తం 86 చిత్ర పటాలను రూపొందించారు. వీటిలో 33 పుణ్యక్షేత్ర చిత్ర పటాలు, మిగిలిన 53 రామాయణం పై వేసిన చిత్రపటాలు. నందిగాం నాగేశం కామరౌతు వెంకటేశం వేసిన ఈ రెండు చిత్ర పట పుస్తకాలను (book of paintings) నేను రాజమహేంద్రి చిత్రప్రతులు అని పేరు పెట్టారు. 33 చిత్రాలు గల చిత్ర పట పుస్తకాన్ని రాజమహేంద్రి క్షేత్రపటాలు పేరిట, 53 చిత్రాలు గల చిత్రపట పుస్తకాన్ని రాజమహేంద్రి రామాయణ పటాలు పేరిట పరిష్కరించి విపులమైన ఉపోద్ఘాతంతో వ్యాఖ్యానంతో ప్రచురించాను. రెండవ పుస్తకాన్ని ఆంగ్లంలో కూడా ప్రచురించాను.

సర్వసాధారణంగా భారత దేశమంతటా రూపొందింపబడిన చిత్రపట పుస్తకాలను ఎవరో ఒక కవియో, కవయిత్రియో పూర్వకాలంలో రచించిన కవితలను కావ్యాలకు తరువాతి కాలంలో రూపొందించిన వివరణాత్మక చిత్రాలు (illustrated manuscripts) ఇటువంటి చిత్ర ప్రతులలోని పూర్వ సాహిత్యం ముందు పుట్టింది. చిత్రలేఖనం. అటువంటి పూర్వ సాహిత్యంపై ఆధారపడి పుట్టింది. ఇందుకు భిన్నంగా రాజహేంద్రి చిత్రప్రతులలోని వాచకం చాలా భిన్నమైంది. అపురూపమైంది.

నందిగం, నాగేశం, కామరౌతు వెంకటేశం ముందుగా చిత్రపటాలను రూపొందించారు. ఇలా రూపొందించిన86 చిత్రాలను చూసి కొలపెల్లి బుచ్చన్న అనే వ్యక్తి 'ఆశయం' అంటే వ్యాఖ్యాన వివరణ ఆనాటి వ్యావహారిక తెలుగులో ఉన్నది. ఇంతకూ ఇలా ముందుగా చిత్రపటాలు రూపొందింపబడటం, అటు తరువాత ఆ చిత్రపటాలను చూచి తెలుగువచనంలో వివరణం వ్రాయటం అపురూపం. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది 'నభూతో నభవిష్యతే' వంటిది. ఈ వ్యాఖ్యాత అయినకొలపెల్లి బుచ్చన్న కేవలం వ్యాఖ్యాత నేనా లేక నందిగం నాగేశం కామరౌతు వెంకటేశంలా చిత్రకారుడు కూడానా అన్న విషయం కచ్చితంగా తెలియదు. ఇలా ఇతను 86 చిత్రపటాల గూర్చి వ్రాసిన వ్యాఖ్యానాన్ని మరొక అజ్ఞాతవ్యక్తి పారశీకంలోకి కూడా అనువదించి తెలుగు వ్యాఖ్యానంతో పాటు ప్రతీ చిత్రపటం వెనుకా పొందుపరిచాడు. నాకు పా[illegible] రానందున

మరివేరెవరూ ఈ 86 పటాలపై వ్రాసిన పారశీక వాచకాన్ని చదువనందున ఈతని పేరు ఎక్కడైనా ప్రస్తావనకు వచ్చిందో లేదో తెలియదు.

ఏదిఏమైనా మిగతా విషయాలు చర్చించలేదు. ఒక్కవిషయం నొక్కి వక్కాణించవలసి ఉంది. నాకు తెలిసినంతవరకు కనీసం పేర్లు అయినా తెలిసిన అతి ప్రాచీన తెలుగు చిత్రకారులు నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం వీరికి పూర్వం. అంటే 1757-1758 కి పూర్వ చిత్రకారుల పేర్లు తెలుగు చూచేదాక నందిగం. నాగేశం కామరౌతు వెంకటేశంలు తెలుగువారి 'ఆదిచిత్రకారులు' అలాగే కొలపెల్లి బుచ్చన్న చిత్రాలు ఎవరు వేశారు, ఎప్పుడు వేశారు అనేది నిర్ణయించటమే కాకుండా ఆ చిత్రాలలో ఏముందో వివరంగా వ్రాశాడు కనుక.నాకుతెలిసినంతవరకు ఇతను తెలుగు వారిలో తొలి కళాచరిత్రకారుడు.

తెలుగు సాహిత్యంలోని కవిత్రయం మూడు భిన్న ప్రాంతాలలో మూడు భిన్న కాలాల్లో ఉండగా తెలుగు చిత్రకళారంగంలోని చిత్రత్రయం గా పిలవ తగిన నందింగం నాగేశం కామరౌతు వెంకటేశం మరియు కొలపెల్లి బుచ్చన్న ఒకే ఊరువారు. ఒకే కాలానికి చెందినవారు కావటం విశేషం. ఇకపై ముందుగా వీరు రూపొందించిన చిత్రప్రతి ప్రస్తుత ఉనికి పుట్టు పూర్వోత్తరాలు.

రాజమహేంద్రి రామాయణ పటాలలో 53 వ సంఖ్యగల శ్రీరామపట్టాభిషక్తకం చిత్రించిన పటం వెనుక వ్రాసిన అంత్య గద్యలో కొలపెల్లి బుచ్చన్నఇలా వ్రాశాడు.

"శ్రీశ్రీశ్రీం జాయనం శ్రీరామ చంద్రార్పణ మస్తు శ్రీశ్రీశ్రీశ్రీశ్రీ శ్రీశ్రీశ్రీశ్రీ శ్రీశ్రీశ్రీశ్రీశ్రీశ్రీశ్రీశ్రీ బహుధాన్య నామ సంవత్సర ॥ భాద్రపద శు. 12 గురువారం వర్కు రాజమహేంద్రవరంలోనూ కామరౌతు వెంకటేశం నంద్దిగం నాగెశం యి ద్దరూ యాకస్తులై దెశంలో ఉన్న క్షెత్రాలు శ్రీమద్రామాయణ షట్కాండ్డాలు ఛతిన్ వ్రాశిన పటాలూ॥ విట్కి కొలపెల్లి బుచ్చి యీ పటాలు అన్నింట్కి ఆశయం, టూన్ గా వ్రాశిన నకలూయీ ముగ్గురూ యాకస్తులై బుద్ధికుశలతనువ్రాశిన పటాలూ శ్రీశ్రీశ్రీశ్రీ శ్రీశ్రీశ్రీశ్రీ

అ అంత్యగద్యలో. కొలపెల్లి బుచ్చన్న ప్రస్తావించిన తేదీ. బహుధాన్య నామ సంవత్సర భాద్రద శు12 గురువారం సెప్టెంబరు 14.1758కి సరిపోతుంది.

అయితే ఇదే పుటలో ఉన్న పారసీక అంత్యగద్య ప్రకారం "హైదరాబాదు సుబానిలోని సర్కార్ రాజమహేంద్రవరంలో రామాయణ వాచకం సంపూర్ణంగా పూర్తి అయినది 25వ మొహరం హిజ్రి 1171న ఈ పారశీక తేదీ, అక్టోబరు తొమ్మిదికి సరిపోతుంది. దీనినిబట్టి నందిగాం నాగేశం కామరౌతు వెంకటేశంలు రాజమహేంద్రి రామాయణ చిత్రపటాలుని 09-10-1758 నాటికి పూర్తి అయ్యింది. నాకు తెలిసినంత మటుకు తెలగు చిత్ర ప్రతులలో ఇలా ఇంత నిశితంగా చిత్రకారుల పేర్లు వ్యాఖ్యాత పేరు కచ్చితమైన తారీకులు ఇచ్చిన చిత్రప్రతి మరొకటి లేదు. కనీసం మరొకటి నేటి వరకూ వెలుగు చూడలేదు.

నందిగం నాగేశం కామరౌతువెంకటేశంలో ఈ 86 చిత్రాలలోను ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రాంతం ముందెన్నడూ లేనటువంటి గడ్డు పరిస్థితులు దాపురించిన కాలంలో రూపొందించారు. ఈ రాజకీయ సామాజిక నేపథ్యం చూచే ముందు ఈ దిగువ తేదీలు వివరం గమనించండి.

18వశతాబ్దపు మధ్య కాలానికి, భారతదేశం చిన్నాభిన్నమూ వివిధ రాజ్యాలుగా విభజింపబడిపోయింది. వీటిలో నేటి ఆంధ్రప్రదేశ్‌లు హైదరాబాద్ నిజాం రాజ్యం అతిపెద్దది. బలవంతమైంది. ముఖ్యమైనది కోస్తాఆంధ్రలోని వివిధ సంస్థానాలు ఈ రాజ్యంలో భాగంగా ఉండేది.

చారిత్రిక క్రమం చూడండి:

1. ఔరంగాబాదు ఒప్పందం ప్రకారం రాజమహేంద్రి ప్రాంతం ఫ్రెంచి వారికి నైజాం నవాబుధారాదత్తం చేసినది : నవంబరు 21, 1751

2. ఫ్రెంచి సేనాపతి బుస్సీ, హైద్రాబాదు నుండి సైన్యంతో వచ్చి రాజమహేంద్రి చేరినది : డిసెంబరు 19, 1756

3. విజయనగరం పాలకుడైన పెదవిజయ రామరాజు బుస్సీతో చేతులు కలిపి యుద్ధ ప్రణాళికనంతా రాజమహేంద్రిలో రచించి బొబ్బిలిపై దాడి చేసింది: జనవరి 23, 1757

4. బొబ్బిలి కొట కోటలోని వార కూలినది: జనవరి 24, 1757

5. పారశీకంలో ఉన్న అంత్యగద్య ప్రకారం రాజమహేంద్రి రామాయణ పటాలు పూర్తి అయినది. అక్టోబరు 9, 1757

6. బుస్సీ బొబ్బిలి యుద్ధం తరువాత రాజమహేంద్రి కి వచ్చి ఆ

ప్రాంతాన్ని విడిచివెళ్లినది: ఆగస్టు3, 1758

7. పెదవిజయంరామరాజు తాండ్రపాపారాయుని చేతిలో మరణమొందిన తరువాతవిజయ నగరం పాలకుడైన ఆనందరాజు విశాఖ పట్నంలో ఫ్రెంచి వారిని ఓడించి తరిమివేసినది ఆప్రాంత అధికారాన్ని ఆంగ్లేయులకు కట్టబెట్టినది: సెప్టెంబరు 2, 1758

8. తెలుగులోని అంత్య గద్య ప్రకారం రాజమహేంద్రి క్షేత్ర పటాలు, రాజమహేంద్రి రామాయణ పటాలు నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం మరియు కొలపల్లి బుచ్చన్న పూర్తిచేసినది సెప్టెంబరు 14, 1758

9. విజయనగరం ట్రీటీగా ప్రసిద్ధినెక్కిన ఒడంబడికను ఆనందరాజు ఆంగ్లేయులతో కుదుర్చుకున్నది. : సెప్టెంబరు 1, 1758

10. రాజమహేంద్రి చేరువలో జరిగిన కొండూరు/ చందుర్తి యుద్ధంలో ఆంగ్లేయుల చేతలో ఫ్రెంచి వారు ఓడిపోయినది : డిసెవబరు 7, 1758

11. ఆనందరాజు తన కొలువలో సేవకుడిగా ఉన్న ఆంగ్లేయుడు బ్రిస్టల్ ని రాజమహేంద్రికి పాలకుడిగా నియమించినది. ఏప్రియల్ 11, 1759

12. పరిస్థితులు చక్కబడ్డాయనుకొనిన ఆనందరాజు విజనగరం నుండి విజయవాడ దాకా వెళ్లి తమ కుల దేవత అయిన కనక దుర్గకు మొక్కులు చెల్లించి తిరుగు ప్రయాణంలో అమ్మవారు సోకి రాజమహేంద్రిలో మరణించింది. : ఫిబ్రవరి 25, 1760

ఇలా పద్దెనిమిదవ శతాబ్దపు మధ్యకాలంలోని తెలుగునాట జరిగిన వ్యవహారాలు, సంఘటనలు నిశితంగా పరిశీలిస్తే అది, వైపరీత్యాలకు దారి తీసిన గడ్డుకాలమే నని తేట తెల్లమవుతుంది.

ఇటువంటి చారిత్రిక, రాజకీయ, సామాజిక నేపథ్యంలో అన్ని రంగాలలోనూ గడ్డుకాలంగా ఉన్న తరుణంలో నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం కొలపెల్లి బుచ్చన్న మరియు మరొకి పేరు తెలియని తెలుగు పారశీక అనువాదకుడు 86 చిత్రపటాలను రూపొందించారు. ఈ చారిత్రిక నేపథ్యం

ఈ చిత్రకారులు  నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం పైన ఏమైనా ఉందా లేదా అన్నదే ప్రశ్న.

"అటునుండి సరుక్కురమ్మన్నాడు." అన్నట్లు పైన పట్టీలో చివరిలో ప్రస్తావించిన అంశాన్నే మొదటిగా తీసుకుందాం. అది, బొబ్బిలి యుద్ధానంతరం, పెద విజయరామరాజు తాండ్ర పాపారాయుడు చేతిలో హతమైన తరువాత విజన నగర సంస్థాన పాలకుడైన ఆనందరాజు ఆంగ్లేయులతో ఒడంబడిక చేసుకున్నాక తమ కుల దైవమైన బెజవాడ కనకదుర్గమ్మకు మొక్కులు సమర్పించి తిరుగు ప్రయాణంలో రాజమండ్రిలో అమ్మవారు సోకి మరణించారు.

"అమ్మవారు" అనే వ్యాధి పుట్టుకకు లక్ష్మీగణపతి అనే విగ్రహ రూప కల్పనకు సంబంధం ఉంది. 1757-58 నడుమ రాజమండ్రిలో అమ్మవారు విలయ తాండవం చేసినట్లు ఉంది. నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం వేసిన తొలిచిత్రం "లక్ష్మీ గణపతి" విగ్రహం కావటం ఈ విషయాన్ని సూచిస్తున్నది.

ఏ పుణ్య క్షేత్రాలకు వెళ్లకుండానే నందిగం నాగేశం, కామరౌతు వెంకటేశంలు పూరీ జగన్నాథుడు, తిరుపతి వేంకటేశ్వరుడు, శ్రీరంగం చళ్లపిళ్ల రాయుడు శ్రీశైల మల్లికార్జునుడు కుంభ కోణం చక్రాపాటీలకు సంబంధించిన క్షేత్ర పట చిత్రాలను వ్రాశారు. వీటిలో ఒక్కొక్క దానికి ఎన్నో విశేషాంశాలు ఉన్నాయి. అన్నీ విపులంగా నేనే ప్రచురించిన పుస్తకాలలో చర్చించాను. కనుక కొన్ని ముఖ్యమైన అంశాలు మాత్రము వివరిస్తాను.

శ్రీకాకుళం  జిల్లానుండి కనీసం తూర్పు గోదావరి జిల్లావరకు ఒరిస్సా సంస్కృతి ప్రభావం ఎక్కువ. గురజాడ వారి కన్యాశుల్కంలో చివరి ఘట్టం జగన్నాథ దేవాలయం ప్రాంతంలో జరుగుతుంది. ఇదే పూరీ వాడైన శ్రీశ్రీ "జగన్నాథ రథ చక్రాలు" అంటూ ఓ విప్లవ కవితరాశాడు. నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం కూడా తమ ప్రతిలో తొలి క్షేత్ర పటంగా "పూరీ జగన్నాథ విగ్రహం రూపొందించాడు.

తెలుగు నాట హిందువులందరికీ తిరుపతి వేంకటేశ్వరుడు ఇష్టం దైవం. రెండవక్షేత్ర పటంగా వీరు "తిరుపతి వేంకటేశ్వర విగ్రహం"వేశారు. తిరుమల గిరి క్షేత్రం. వీరు కూడా తిరుపతి గుడి ఎత్తైన కొండలపైన ఉన్నట్లు

చూపించారు.

శ్రీరంగం చెల్లపెళ్ల రాయుడికి ఒక చిత్రమైన కథ ఉంది. ఈ రంగనాథుడు ఢిల్లీ పాలిస్తున్న ఓ సుల్తానుకు కుమార్తెఅయిన బీబీ ని వివాహం చేసుకున్నాడని ప్రతీతి. ఈ కథను గుర్తుచేసుకోవడానికి మన చిత్రకారులకు ఒక కారణం ఉంది. వీరితో కలసి ఓ ముస్లిము పనిచేశాడు. పారశీకంలోని తెలుగు వచనంని అనువదించాడు. ఈ చెల్ల పెళ్ల రాయచిత్రస్మరణం ఈ మైత్రిని సూచిస్తుంది.

శ్రీశైలం కూడా తిరుమల లాగా గిరి క్షేత్రమే. కాని మన చిత్రకారులు కొన్ని సోపానాలు మాత్రం వేశారు. కొండపైన గుడి ఉన్నట్లుగా చూపలేదు. శ్రీశైలానికి సోపానాలు, (మెట్లు ) రెడ్డి రాజులు వేయించారని చరిత్ర ప్రసిద్ధికెక్కిన అంశం. ఈ విషయం మన చిత్రకారులకు తెలుసు. వీరికి ఇంకో విషయం కూడా తెలుసు. శ్రీశైలంలో శిఖరాన్ని చూస్తే పునర్జన్మ ఉండదని ప్రసిద్ధి. అందువల్లనే శ్రీశైల మల్లికార్జున శిఖరాన్ని ఎంతో ఎత్తుగా, ఎన్నో శిల్పాలతో అలంకరించినట్లు వేశారు.

విజయనగర కుడ్య చిత్రాలలోనూ, కాకతీయ శిల్పాలలోనూ త్రిపురాసుర సంహార దృశీకరణలో రాక్షసుల కోటలను పై నుంచి చూస్తే ఎలా గుండ్రని చక్రంలా ఉంటాయో అలా మూడు గుండ్రని చక్రాలను చూపడమే పరిపాటి. ఇందుకు భిన్నంగా నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం వేసిన త్రిపురాసుర సంహార పటంలో పక్కనుండి కోట గోడను ఎలా ఎత్తుగా కోట గోడలు ఉంటయో అలాంటి కోటలు మూడు చూపి అవి కదిలేవి అని సూచించేందుకు చక్రాలు కూడా చూపారు. ఇంతకన్నా విశేషంగా ఈమూడు కోటలపై నాలుగేసి చొప్పున ఫిరంగులను అమర్చారు. ఏమి విశేషం ఇది నాడు బొబ్బిలియుద్ధం చేసిన వారిపై వేసిన చంప దెబ్బ. గొద్దలివేట ఎలాగంటారు?

1757లో బుస్సీ తన సైన్యంతో పాటు ఫిరంగులను కూడా తెచ్చాడు. రాజమండ్రి నల్లచెరువు వద్ద మకాం వేశాడు. హైదరాబాదు నవాబు సైన్యం విజయనగరం సైన్యం ఫిరంగులతో బుస్సీ సైన్యం బొబ్బిలిని ముట్టడించి ఒక్కరోజులో బొబ్బిలి కోటను ధ్వంసం చేశారు. ఇలా ఒక్కరోజులో ధ్వసం చేయగలగటానికి ఫ్రెంచి వారు తెచ్చిన ఫిరంగులే కారణం. సరిగ్గా ఇదే కాలంలో

నందిగం నాగేశం కామరౌతు వెంకటేశంలు త్రిపురాసురుల ఫిరంగులతో ముందుకు వెళుతున్నట్లుగా చూపటం ద్వారా బొబ్బిలిపై దండెత్తిన మూడు సైన్యపు జట్లు రాక్షసులు ఉన్నారు. ఇది మన చిత్రకారులకు ఉన్న గొప్ప సామాజిక స్పృహ. వేస్తున్నది శివపురాణ సంబంధమైన చిత్రమే అయినా సమకాలీనత ఏర్పరిచి చిన్న చిన్న మార్పుల ద్వారా తమకు గల సామాజిక స్పృహను చిత్రాల వ్యక్తపరచటం ఎంతో గొప్పగా చెప్పవలసిన విషయం. ఈ విషయం గుర్తెరిగిన రోజున నేను ఎంత ఆశ్చర్యపోయానో చెప్పలేను. ఇంతకు మిన్నగా నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం గల సామాజిక స్పృహతోపాటు సాంఘిక స్పృహ భౌగోళిక స్పృహ వీరు వేసిన రామాయణ చిత్రాలను నిశితంగా పరిశీలిస్తే ద్విగుణీకృతమై గోచరిస్తుంది. ఆ విషయాలన్నీ సవిస్తరంగా నేను తెలుగులోనూ ఆంగ్లంలోనూ ప్రస్తావించాను గనుక ప్రస్తుతానికి ఇక్కడ కొన్ని ముఖ్య విషయాలను మాత్రం ప్రస్తావిస్తాను. వీరు వ్రాసిన 53 రామాయణ పటాల్లో అధికంగా యుద్ధకాండకు సంబంధించినపటాలే ఉన్నాయి. ఇవి మొత్తం 19. ఆరోజుల్లో నే జరిగిన యుద్ధం బొబ్బిలిలోనైనా రాజ మహేంద్ర వరం ఆనాడు రణరంగ సన్నాహక వేదికగా ఉంది. ఈ సమకాలీన సాంఘిక దుష్టపరిణామాలు గమనిపంచారు. గనుకనే నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం యుద్ధకాండను ఎక్కువ చిత్రాలలో చూపించారని నేను భావిస్తున్నాను.

ఆరోజుల్లో బాల్యవివాహాలు దేశమంతటానూ, తెలుగు నాట అంతటా రాజమహేంద్ర వరంలోనూ ఆచరంగా ఉండేవి. నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం వ్రాసిన సీతారామకల్యాణ చిత్రంలో ఈ ఆచారం గోచరిస్తుంది. వీరు చిత్రించిన రాముడు పాతికేళ్ల పైబడిన వయస్సువాడు. సీతమాత్రం ఐదు ఆరేళ్ల పసికందు. రాజమహేంద్ర వరంలో ఆరోజుల్లో అతి బాల్యవివాహం దురాచారమని ఎవరో అనుకోని ఉండరు. మన చిత్రకారులు కూడా అనుకోలేదు. రమారమి నూటపాతికేళ్ల తరువాత కందుకూరి వీరేశలింగం గద్దెఎక్కి అనేదాక బాల్య వివాహం దురాచారం అనే స్పృహ ఎవరికీ కలుగలేదు.

రాజమండ్రి వద్ద గోదావరి నదికి ఓ ప్రత్యేక భౌగోళిక లక్షణం ఉంది.నది ఎంతో విశాలంగా ఈవలి గట్టునుండి సీతారాములు అయోధ్య విడిచి రథం మీద తమ నగరం వెలుపలికి రాగానే ఈవలి గట్టుపై ప్రయాణిస్తారు. ఈ నది గోదావరిలా ఎంతో విశాలంగా ఉండి ఆవలి గట్టును ఎంతో దూరాన

ఉంటుంది. ఈ విధంగా సీతారామలక్ష్మణులు మా ఊరి గోదారి గట్టు మీద రథంపై వెళ్లారని చూపించటం ద్వారా వీరు మా రాజమహేంద్ర వరమే అయోధ్య అని చెప్పకుండానే చిత్రం ద్వారా సూచించారు. ఎంతో గొప్ప విశేషం . ఇదే గోదావరి ఆరు పటాల్లోనూ గోచరిస్తుంది. ఒకరి మాటేమోగాని ఈ విషయం గుర్తెరిగినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. అంతకన్నా ఎక్కువ ఆనందించాను.

నందిగం నాగేశం కామరౌతు వెంకటేశం ఈ రామాయణ చిత్ర ప్రతితోపాటు మరికొన్ని రామాయణ చిత్ర ప్రతులను కూడా రూపొందించారు. దీని నుండి కొన్ని చిత్ర పటాలు (చిత్రం : 12. 1) విదేశాలలో వెలుగు చూచాయి. ఒకటి రెండు అచ్చు అయ్యాయి.

నందిగ్గం నాగేశం కామరౌతు వెంకటేశం గూర్చి చెప్పాల్సిందంతా వేరే చోట నా ప్రచురణలో చెప్పినందున ప్రస్తుతానికి చివరగా ఒకమాట.

తెలుగు సాహిత్యంలోనూ, తెలుగు చిత్ర కళలోనూ ప్రారంభంలోనూ చివరనో కవులు తమ ప్రస్తావన తీసుకురావడం ఉంది. శ్రీరంగం లోకప్పు కుడ్య చిత్రాలలో చిత్రకారులు తమను తాము ఒక అరలో చూపారు. కాని ఇవి నేడు కంటికి కనిపించినంతగా శిథిలమైపోయాయి. మన చిత్రకారులు చివరగా వేసిన తిరుపతి గోవింద రాజుల చిత్రంలో వేరు వేరు ముఖ కవళికలున్న, వేర్వేరు రంగు వస్త్రాలను, వేరు వేరు వ్యక్తులు స్వామి పాదాల చెంత ఉన్నట్లుగా చూపించారు. వీరు భుజకీర్తులు కిరీటాలు ధరించిన దేవతలు కారు. సామాన్యమైన పూసల దండలు, కడియాలు, కుండలాలు ధరించినవారు. తలపై కొద్దిగా మొలిచిన జుట్టు , పిలక మెలితిరిగిన మీసం, పంచెకట్టు ఉత్తరీయం, నడుము చుట్టూ కట్టి నమస్కారం చేస్తున్న ఈ సామాన్య భక్తులు నాదృష్టిలో నందిగం, నాగేశం కామరౌతు వెంకటేశం ఇంటి పేర్లు వేరైనందున అన్నదమ్ములు కాకపోయినా అన్నదమ్ముల్లా మెలిగారని చెప్పవచ్చు. వేంకటేశ్వర స్వామి అన్నయైన గోవిందరాజుల చిత్రం లో నాదృష్టిలో తమను తాము చూపించుకోవటం పరోక్షంగా ఇందుకు సాక్షి. ఆహా! ఎంత గొప్ప! గొప్పగా చెప్పుకోదగిన విశేషాంశం ఇది. మనకు తెలిసిన తొలి తెలుగు చిత్రకారులు పేర్లు తెలియటంతోపాటు వారు ఎలా ఉంటారో కూడా చూడటం నిజంగానే నయనాభిరామం. ఇటువంటి ఎన్నో విశేషాలను మరెన్నో పరిశోధించి

ప్రచురించిన "రాజమహేంద్రి క్షేత్ర పటాలు, రాజమహేంద్రి రామాయణ పటాలు" తో విపులంగా వివరించాను. కానీ, ఆ పుస్తకాలను ఎక్కువ మంది కొనలేదు. చదవనూ లేదు. అప్పుడు ఈ చిత్రకారులకు చేదోడుగా ఉన్న కొలపెల్లి బుచ్చన్న రామాయణానికి వాచకం రాస్తూ అన్న తొలిమాటే నేను అనుకొన్నాను. ఆ రోజుల్లో యుద్ధావాతావరణం మధ్య నందిగం, నాగేశం కామరౌతు వెంకటేశం తో పాటుగా కొలపెల్లి బుచ్చన్న అన్నమాటే. వీరి చిత్రాలు ఆదరణకు నోచుకున్నపుడు నేను అన్నమాట అదే "శ్రీరామా ... నీవే గతి....".

# కలంకారీ, వస్త్ర పట చిత్రాలు

చిత్రాన్ని చిత్రీకరించటానికి వస్త్రం వాడుతారు కాని, ఇందులో రెండు రకాలన్నాయి. ఇందులో ఒకటి అద్దకం రంగుల (dye colours) ఆధారం చేసకున్నది. ఇలాంటి చిత్రాలకు 'కలంకారి' చిత్రాలు అనే పేరు వచ్చింది. నేటికీ, కృష్ణాజిల్లాలోని మచిలీ పట్నం చేరువలో ఉన్న పెడనలో లోనూ, చిత్తూరుజిల్లాని శ్రీకాళహస్తిలోనూ ఈ ప్రాచీన కలంకారీ చిత్ర సంప్రదాయం కొనసాగతూనే ఉన్నది. పంతొమ్మిదివ శతాబ్దం వరకు గుంటూరు జిల్లాలోని చీరాల పశ్చిమ గోదావరి జిల్లాలోని పాలకొల్లు కూడా కలంకారీ కి పెద్ద కేంద్రాలుగా ఉండేవి.

వెదురు పుల్లకు దారం ఉండగా చుట్టి దానిని పిడికిలిలో పట్టి అద్దకం రంగులో ముంచి దారం వుండను వత్తుతూంటే పుల్ల వెంట రంగు కిందకి కారుతుంది. అలా కారుతున్న రంగుతో చిత్రం గీస్తారు. కనుక దీనికి కలంకారీ అనే పేరు వచ్చిది.

కొరవి గోపరాజు రచించిన "సింహాసన ద్వాత్రింశిక" లో పటు పట చిత్రాల ప్రస్తావన ఉంది. పటం అంటేనే సంస్కృతం లో రెప రెప లాడే వస్త్రం అని అర్థం. గోపరాజు "కామ మరం, సురవరం పట చిర్తఆలకుగొప్ప కేంద్రాలు అని చెప్పాడు. ఈ ఊళ్లు ఎక్కడున్నాయో ఇక్కడ రూపొందించినపట చిత్రాలు ఏ కళావస్తు సంగ్రహాలయంలో నైనా ఉన్నయేమో పరిశోధించవలసి ఉంది. గోపరాజు ఇంకా, పట చిత్రాలలో చుక్కలు, హంసలు, నెమళ్లు గుర్రాలు, ఏనుగులు, సింహాలు అంచులుగా ఉన్నాయని చెప్పాడు. ఇంకా ద్రౌపదీ స్వయంవరం లక్ష్మీవిలాసం మదన విలాసం వసంత విలాసం శ్రీకృష్ణవిలాసం,

వంటి పురాణేతిహాస కథలను చూపే పట చిత్రాలు ఉన్నాయని గోపరాజుచెప్పాడు. ఎందువల్లనో గోపరాజు ప్రస్తావించకపోయినా కలంకారీ చిత్రాలలు రామాయణం సంపూర్ణరామాయణంలో. సీతాకల్యాణం, వాలి వధ కూడా ప్రధాన కథాంశాలుగా కలంకారీ కళాకారులు స్వీకరించారు. కలంకారీ చిత్రాలను వేయించి దేవాలయాలకు దానం ఇవ్వటం ఒక మొక్కబడి గా ఉండేది. (చిత్రం : 13.1) ఆ కలంకారీ చిత్రాలు రెండు రకాలుగా దేవాలయం లో అలంకరిస్తారు. ఉత్సవాల సందర్భంగా లోకప్పుకు అలంకరించటం ఒక పద్ధతి. ఇటువంటి కలంకారీ చిత్రాలలో మధ్యలో ముఖ్యఘట్టం ఉంటుంది. తూర్పు పడమర. ఉత్తరం, దక్షిణం వేపుకథ అటునుండి చూచి చదవాలి కథావివరం విపులంగా వ్యావహారిక తెలుగులో వ్రాయటం ఒక సంప్రదాయం ఇక రెండవ రకం కలంకారీ ప్రక్కగోడలకు తగిలించేది. ఇటువంటి వాటిలో కథ ఎడమవైపు పై గడిలో ప్రారంభమై క్రిందకు సాగుతుంది.

నేటికీ కాళహస్తి కలంకారీ కళాకారులు పటంపై ఎడమ వైపు ఉన్న మొదటి అరలో వినాయకుని చిత్రం వ్రాసి అటుఇటు ఇద్దరేసి పురుషులను చిత్రీకరించి ఇందులో ఒకదు గుండు పిలక ఉన్న బ్రాహ్మణుడు. ఆ పైన చిత్రకారుడు ఒకశుభ మూహూర్తాన వినాయకుని పూజించి కథను వ్రాయుచుండుట అని కలంకారి చిత్రాలలో చరిత్రనామం చిత్రంలోని పాత్రల పేర్లు ఒకదు పూజారి కాగా మరో ముగ్గురిలో ఒకడో ముగ్గురూ కూడానో చిత్రకారులు.

1881 - 82 లో చీరాలలో పంచకళ్ల పెద్దసుబ్బారాయుడు అనే కలంకారి చిత్రాకారుడు వేసిన కలంకారి వస్త్ర చిత్రాలు కొని ఇంగ్లండు రాజధాని అయిన లండన్ లోని ది విక్టోరియా ఆల్ బెర్ట్ మ్యూజియం లో ఉన్నాయి. అందులో ఒకటి లోకప్పుకు తగిలించి కలంకారీ రామాయణం. (చిత్రం : 13.2) రెండవది కాటమరాజు కథకు సంబంధించినది. ఈ కలంకారీ చిత్రంలో ఎరుపు, నీలం ఆకుపచ్చ నలుపు రంగులతో చిత్రీకరింపబడింది. కొన్ని చోట్ల కథను పొడిగించటం, కొన్ని చోట్లకథనుకుదించటం ఉంది. కిష్కింధకాండ కథ పూర్తిగా వదిలివేయబడింది. ఈ చిత్రం గూర్చి విపులంగా వ్యాసం వ్రాసిన కళా చిత్రకారిణి అన్నదాలపికోల ప్రకారం ఈ చిత్రకారునికి తన దైన ప్రత్యేక శైలిఉంది. నాకు తెలిసినంతవరకు కలంకారి చిత్రకారులలో పేరు తెలిసిన కళాకారులలో చీరాలలో ఉన్న పంచకళ్ల పెద్దసుబ్బారాయుడు ప్రథముడు. హైదరాబాద్‌లోని సాలార్జంగు

మ్యూజియం పాలకొల్లులో రూపొందిన కలంకారీ రామాయణం మరొకటి ఉంది. ఇటువంటి వాటిని కళా చరిత్ర పరంగా పరిశోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒక కలంకారీ చిత్రాన్ని సమగ్రంగా పరిశీలించి అందులోని వాచకాన్ని, చిత్రాన్ని ఒక పుస్తకంగా తేవాలనేది నా చిరకాల కోరిక. కాని, పంచ కళ్ల పెద్దసుబ్బారాయుడు వంటి కలంకారీ కళాకారులు వేసిన కలంకారీ చిత్రఫోటోగ్రాఫ్స్ నాబోటివారికి లభించేదేలా? అది వేరే కథ.

ఇక రెండవ రకం పటచిత్రం. బమ్మెరపోతనా మాత్యుడు (15వశతాబ్దం) రచించిన శ్రీమద్‌మహాభాగవతం లోని దశమస్కంధం లో ప్రస్తావనకు వచ్చింది. చిత్రరేఖ అనే ఉషాదేవి చెలికత్తె సార్థక నామధేయురాలు. కలలో కనిపించి మనసు దోచిన మన్మథాకారుడు ఎవరో తెలియక ఉష మథన పడుతుంటే చిత్రరేఖ ఒక పట చిత్రాన్ని వ్రాసేందుకు ఇలా ఉపక్రమిస్తుంది.

"మిలమిల మంచుతోడంబురుణించు దళద మని మెఱుంగులు తుఱంగలిగొను పటంబు నావ టంబు చేసి వజ్రంబు మొదియించి పంచవన్నియలు వేఱువేఱు కనకరజత పాత్రంబులనించి కేలం దూలిక ధరించి యొక్క విజనస్థలంబు కుంజని ముల్లోకంబులం చేరుగలిగిన వయోరూప సంపన్నులైన పురుషు ముఖ్యుల నన్వయ గోత్రనామధేయంబుల తోడ వ్రాసి యాయితంబయిన యప్పట్టంబునఁ దన ముందఱికి దెచ్చిపెట్టి యిప్పటంబున దగులని వారు లేరు. వారింజెపెద సావధానంబున నాకర్ణింపుము..."

ఈ విధంగా చిత్రరేఖ దట్టంగా కురిసిన మంచును పోలినటువంటి తళతళమని మెరిసే వస్త్రాన్ని సిద్ధం చేసి వజ్రాన్ని (ఒక విధమైన జిగురు కావచ్చు) నూని ఐదురంగులను వేరు వేరు బంగరు, వెండి, పాత్రలలో ఉంచి ఒక నిర్మానుష్య ర్పదేశానికి వెళ్లి తూలిక (కుంచ) నుపట్టి చిత్రపటం వ్రాస్తుంది. కేవలం చిత్రమే కాక ముల్లోకాల్లో అందమైన యువకుల గోత్రనామాలను కూడా వ్రాస్తుంది.

దామెర్ల అంకభూపాలుడు రచించిన 'ఉషాపరిణయం' (సి. 1640) లో చిత్ర రచనా పద్ధతి ఇంత విపులంగా లేదు. గాని, ఇందులోని చిత్రరేఖకూడా కులగోత్రనామాలతో పాటు చిత్రాన్ని రూపొందిస్తుంది.

ఇలా తెల్లగా కొంత పూత పూసి దళసరిగా ఉన్న వస్త్రం పై చిత్రం వేసే సంప్రదాయం పోతన ఉన్న వరంగల్లు జిల్లాలోనూ, ఆ ప్రక్కనే ఉన్న కరీమ్‌నగర్

జిల్లాలలోనూ ఎంతో ప్రచారంలోనూ ఉండేది. అలాగే విజయనగరం జిల్లాలో కూడా ఉండేది. ఇటువంటి చిత్రాలు రూపొందించే కుటుంబాలు ఒకటి రెండు నేటికీ వరంగల్ జిల్లాలోని చేర్యాలలో ఉన్నారు (చిత్రం : 13.3).

స్త్రీలు ధరించే చీర కన్నా ఎక్కువ నిడివిగల వస్త్రం పై చిత్రాలను వ్రాసి గుండ్రని కర్రను చుట్టిపెడతారు. కనుక వీటిని ఆంగ్లంలో స్క్రోల్ పెయింటింగ్స్ అని అంటారు.

భారతదేశంలో పలురాష్ట్రాలలో ఇటువంటి పట చిత్రాలను రూపొందించే సంప్రదాయం ఉంది. అవసరం వచ్చినప్పుడు చిత్రం చుట్ట విప్పి రెండుచెట్ల పట్టి చేస్తూ పటంలోని సంబంధిత దృశ్యాన్ని కర్రతో మధ్యనో పాతిన దుంగల మధ్యనో చిత్రపటాన్ని తెరలా కట్టి కథకుడు చేతికర్రతో చూపుతాడు. దేరా నాటకాలు, సినిమాలు, టెలివిజన్ లు వచ్చాక దాదాపు ఈ సంప్రదాయం కనుమరుగై పోయింది.

భారతదేశంలో ఇతర ప్రాంతాలో రూపొందించేటప్పుడు చిత్రాలకన్నా తెలుగు నాట రూపొందించే పట చిత్రాలకు ఒక వైవిధ్యమైన లక్షణం ఉంది. ఇతర ప్రదేశాలలో అంటే బెంగాల్, బీహార్, ఒరిస్సా రాజస్థాన్ గుజరాత్ పట చిత్రాలు విశిష్ట వాఙ్మయంలో వెలువడిన రామాయణం భారతం భాగవతం మొదలైన కథలకు సంబంధించినవి. తెలుగు నాట ఉన్న వివిధ కులాల వారి కులగోత్ర చరిత్రలు చెప్పేందుకుగానూ రూపొందించిన పట చిత్రాలే అధికంగా ఉన్నాయి. ఇలా కుల చరిత్ర పురాణంకి సంబంధించినపట చిత్రాలు ఉండటం తెలుగునాటలో ఉన్న ప్రత్యేకత. ఒక ప్రత్యేక కులంవారు మరొక ప్రత్యేకకులం వారి పురాణం పట చిత్రం ఆధారంగా చెబుతారు.

భావనా ఋషి పురాణ పటం ఆధారంగా కునపులికులవారు పద్మశాలికులం వారి పురాణం చెప్పేవారు. దీనికే పద్మపురాణం పద్మసంహిత, భావనర్షి మాహాత్మ్యం అనే పేర్లు కూడా ఉన్నాయి. ఈ పురాణం మార్కండేయ పురాణంలోని ధనిక కథకులు విధిగా నొక్కి వక్కాణిస్తున్నారు. పురాణాలల్లో బ్రహ్మ ప్రళయం అయినప్పుడు విష్ణుమూర్తి బాలరూపంలో (వటపత్రం)లో మర్రి యాకుపై పవళించి ఉండగా అందరూ అంతరించి పోగా మిగిలిన మార్కండేయ మహర్షిబాల విష్ణువును చూసి ఆశ్చర్యపోతాడు. ఆయననోటి ద్వారా ఉదరంలోకి

ప్రవేశించి అక్కడ ముళ్లోకాల్లో దాగిఉండటం చూసి, ఈ స్వామి కాళ్లకు దణ్ణం పెట్టాలి అని అనుకుంటాడు. అప్పుడు బాలవిష్ణువు తన కుడికాలి బొటనవ్రేలును నోటపెట్టుకోగా మార్కండేయుడు నమస్కరిస్తాడు. భావనార్షి పట చిత్రంలో పటం కుడివైపున ఉండే తొలి అరలో ఈ కథకు అనుగుణంగా వట పత్ర శాయిని చూపిస్తారు. సర్వసాధారణం గా వటపత్ర సాయిని బాలరూపంలోని చూపించటమే పరిపాటి. అయినా కొన్ని పటాలలో మర్రాకు పై పవళించిన విష్ణుమూర్తి ప్రౌఢరూపంలో ఉంటాడు.

దేవాంగ పురాణంలో దేవాంగ ఋషి చౌడీశ్వరీ దేవి ప్రధానంగా ఉంటారు. ఈ ఋషి ఎత్తిన ఏడు అవతారాల కథలు ఉంటాయి. దేవాంగకులం వారికి ఈ చిత్ర పట కథను సింగం వారు కూనపులి వారు చెబుతారు. ఈ పునాణం బ్రహ్మాండ పురాణంలో నిదని కొందరు. స్వతంత్రపురాణంగా వ్యాసుదు రచించాదని మరికొందరు చెబుతారు.

ఇలాగే కల్లుగీత కార్మిక కులమైన గౌడలకు గౌండ్ల పురాణం, గొల్లవారికి మల్లన్న పురాణం, చాకలికులం వారికి మడేలు పురాణం ఉన్నాయి. పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలో మడివేళయ్య అనే భక్తుని కథ చెప్పాడు. మడేలు పురాణంకి ఈ కథ ఆధారం. మాదిగకులం వారి జాంబపురాణం మాల మాదిగల పుట్టు పూర్వోత్తరాలకు సంబంధించిన కథలు ఉంటాయి.

రాజస్థానీ వంటి రాష్ట్రాలలో దేశ విదేశీ పర్యాటకుల వినోదం పేరిట నైనా పట చిత్రం ద్వారా కథాగానం చేయించటం ద్వారా ఈ పట చిత్ర కథాగాన సంప్రదాయం నిలుపుకుంటున్నారు. మన తెలుగు నాటకూడా పర్యాటక శాఖ తెలుగు పట చిత్ర కథాగాన సంప్రదాయాన్ని పునరుద్ధరించే ప్రయత్నం ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కుంఫిణీ చిత్రాలు

"మంచి గతమున కొంచమేనోయ్" అని గురజాడ అప్పారావు ఊరకే అనలేదు. వారి ఊరైన విజయనగరానికి ఆ ప్రక్కనే ఉన్న బొబ్బిలికి కొన్ని గంటల్లో నడిచె వెళ్లగలిగే దూరం మాత్రమే అయినా 18వ శతాబ్దంలో ఈ రెండూ, రెండు రాజ్యాలకు రాజధానులుగా ఉన్నాయి. రెండు రాజ్యాల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే వైరం ఉండేది. ఈ వైరాన్ని మన దేశానికి అప్పుడే వచ్చిన బ్రిటిష్ వారు, ఫ్రెంచి వారు తమ ప్రయోజనాలకు వాడుకున్నారు. 23, 24 జనవరి 1757లో బొబ్బిలి యుద్ధం జరిగింది. దీనితో ఫ్రెంచి వారి ప్రాబల్యం పెరిగింది. పెదవిజయరామరాజు మరణం తరువాత పాలనలోకి వచ్చిన ఆనందరాజుకి ఫ్రెంచివారు పక్కలో బల్లెం అయ్యారు. 2 సెప్టెంబరు 1758లో ఆనందరాజు ఫ్రెంచి వారిని ఓడించి విశాఖ పట్నాన్ని ఆంగ్లేయులకు అప్పగించాడు. అటు తరువాత 7 డిసెంబర్ 1758లో జరిగిన కొండూరు/చందుర్తి యుద్ధంలో ఫ్రెంచి వారు పూర్తిగా ఓడి, ఒక్క యానాం మినహా కోస్తా ప్రాంతాన్నంతా ఆంగ్లేయులకు ధారదత్తం చేశారు.

ఆరోజుల్లో అటు ఫ్రెంచివారు ఇటు బ్రిటీషువారు కూడా తాము పాల్గొన్న యుద్ధాల ఎలా విజయవంతం అయినాయో తమతమ దేశపు రాజులకు రాణులకు చూపేందుకు చిత్రాలను రూపొందించేవారు. బొబ్బిలి యుద్ధాన్ని చూపేపాశ్చాత్యచిత్రం ఒకటి ఒకపుస్తకం లో అచ్చయిందని విని గాలించానుగాని, నేటి వరకు అది నా కంటపడలేదు. అలాగే 'కొండూరు/చందుర్తి' యుద్ధాన్ని చూపే చిత్రాన్ని నందకిశోర్‌సోని అనే ఉత్తర భారతదేశానికి చెందిన చిత్రకారుడువేశాడు. సోని అన్న పేరు రాజస్థాన్ చిత్రకారులలో ఉన్నారు. కనుక,

ఇతను అక్కడివాడై ఉంటాడు.

బ్రిటిషువారి సైన్యంలో అభిరుచి చిత్రకారులు(hobby painters) చాలామందే ఉండేవారు. వారు తాము చూచిన భవనాలను, ప్రదేశాలను, వ్యక్తులనుచిత్రీకరించారు. శ్రీరంగ పట్నంలో టిప్పుసుల్తాను అతని తండ్రి హైదరాలి వీరి అనుయాయులందరిని చిత్రీకరించారు. శ్రీరంగపట్నం యుద్ధం జరిగేనాటికి చిత్రికళను వృత్తిగా చేసుకొన్న చిత్రకారుల బ్రిటన్ నుండి వచ్చి ఎన్నో తైల వర్ణ చిత్రాలను రూపొందించారు.

1857 లో ప్రథమ సిపాయి తిరుగుబాటు తరువాత భారతదేశాన్నిబ్రిటిష ప్రభుత్వం వారు పాలించటం ప్రారంభించారు. అప్పుడు వారికి భారత దేశం గూర్చి ఎన్నో విషయాలను క్షుణంగా తెలుసుకోవలసి వచ్చింది. 1839లో ఫోటో గ్రఫీ కనుగొన్నా, అది అప్పటికి నలుపుతెలుపులకే పరిమితమైనందున రమారమి మరో యాభై సంవత్సరాల పాటు చిత్రకారుల పైననే ఆధారపడ్డారు. భారతదేశంలో ఉన్న వివిధ వృక్షాలు, పూలు, లతలు, పక్షులు, జంతువులు, వివిధ జాతుల మనుషులు, వృత్తులు, ఇలా అన్నీ చిత్రీకరించి ఇంగ్లండుకు పంపటం ప్రారంభించారు. ఇది కుంఫిణీ (company) యుగంలో ప్రారంభ మయిన ఈ చిత్రాలను కుంఫిణీ చిత్రాలు( Company Painting) అన్నారు.

నిజం చెప్పాలంటే, పెద్దగా నైపుణ్యం లేని ఇంగ్లీషు చిత్రకారులంతా మనదేశంమీద పడ్డారు. కొన్ని వేల చిత్రాలను గీచారు. వీటిలో కొన్ని వందల చిత్రాలలో తైలవర్ణచిత్రాలు, వీటిలో కొన్నిటిని అచ్చువేసేందుకు వీలుగా లితోగ్రాఫ్, ఎచ్చింగు చిత్రాలుగా రూపొందించారు. వీరిలో చాలామంది కేవలం అభిరుచి చిత్రకారులైనందు వల్ల మంచి తర్ఫీదు ఉన్నా కంటికి ఎన్నో లోపాలు వీరి చిత్రాలలో గోచరిస్తాయి. 1861లో విశాఖపట్నంలోని ఒక భవంతిలోని ఓ బ్రిటీషు అధికారికి ఓ తెలుగువాడు చూపుతున్న చాంతాడు ఇంద్రజాలం (చిత్రం : 14.1) చూడండి. అతని వెనుక కన్యాశుల్కంలోని మధురవాణి వంటి దేవదాసీలు నిలుచుని ఉన్నారు. చిత్రం బాగానే ఉందని అనిపించినా భవనానికి, మనుషులకు మధ్య సమతౌల్యం(propotion and Balance) లోపించింది.

ఇలా బ్రిటిషు చిత్రకారులు మనదేశంలో చిత్రాలు వేస్తుండగా చూసి మనవాళ్లు కొత్తగా తైలవర్ణ చిత్రం వైపుకు ఆకర్షింపబడ్డారు. ఆంగ్ల ప్రభావానికి మనతెలుగు

చిత్రకళ లోనుగాజొచ్చింది. రాయవేలూరు అన్న ఇంటిపేరున్న ఓ తెలుగు చిత్రకారుడు తంజావూరు శైలిలో రూపొందించిన బాలకృష్ణ చిత్రం (చిత్రం : 14.2) చూడండి.

ఈ చిత్రం ఆంగ్ల ప్రభావం ఎక్కడుందో నే చెప్పకుండామీకు మీరే గుర్తించగలిగితే చదువరులు చిత్ర కళను చదవటంలోనూ ఆరితేరిన వారవుతారు. అందుకు అవకాశం తక్కువగనుక నేనే చెబుతాను. మన బాలకృష్ణుడు నీలమేఘశ్యాముడు బమ్మెర పోతనగారు అన్నట్లుగా "నల్లనివాడు" కానీ ఈ చిత్రంలో రాయవెల్లూరు చిత్రకారుడు తెల్లగా చూపించాడు. అంతకంటే మిన్నగా కృష్ణుని జుట్టును బంగారుజుట్టు (blond hair) గా చూపించారు. బ్రిటిషువారు మనదేశానికి భార్యాపుత్ర సమేతంగా వచ్చాక ఆ పిల్లలను చూచేసరికి మన చిత్రకారుడికి "అబ్బా మనకృష్ణుదు కూడా ఇలా తెల్లగానూ, బంగారు వర్ణం జుట్టుఉంటే బాగుండు! "అని అనుకున్నట్లు ఉన్నాడు. అనుకున్నదే తడవుగా ఈ చిత్రాన్ని రూపొందించాడు. ఇతని ఇంటిపేరు తెలుసుకున్నా పూర్తి పేరు తెలుసుకుంటే బాగుంటుందనిపిస్తున్నది.

# ఇ.యం. మెర్రిక్ చిత్రాలు

19వశతాబ్దపు ఉత్తరార్థంలో భారతదేశంలో ఉన్న వందలాది సంస్థానాధిపతులు తమతమ రూప చిత్రాలను తైలవర్ణచిత్ర మాధ్యమంలో బ్రిటిష చిత్రకారులచేత వేయించుకునేందుకు తహతహలాడారు. మన చిత్రకారులు కూడా రూపచిత్రాలను వేసేవారు. కాని బ్రిటిషువారు తైలవర్ణమాధ్యమంలో వేసే (portrait painting) రంగురంగుల ఫోటోగ్రఫీలా ఒక వ్యక్తిరూపలావణ్యానికి దర్పణ ప్రతిబింబంలా ఉంటుంది. ఇటువంటి చిత్రాలు మనవాళ్లెవరూ అంతవరకు చూచి ఎరుగరు. ఫోటో (Photo) లాగా వుండే తైలవర్ణచిత్రాలకు ధనికులంతా ఆకర్షితులైనారు.

ఎందరో రూపచిత్రకారులు ఇంగ్లండు నుండిభాతరదేవానికి రాసాగారు. 10డిసెంబరు 1768లో లండన్‌లో తరాయల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ (Royal Academyof Arts)నెలకొల్పారు. ప్రముఖ స్థానిక చిత్రకారుడుజాసువా రేనాల్డ్స్ (Jashua Reynods) (1723- 1792) దీనికి ప్రథమ అధ్యక్షుడు. 1769 నుండి ఇక్కడ చిత్రకళను పురజనులకు నేర్పటం ప్రారంభించారు. ఇందువల్ల లండన్ లో చిత్రకళ నేర్చుకున్నవారి సంఖ్యగణనీయంగా పెరిగింది. ఒకమాదిరి చిత్రకారుల కన్ను భారతదేశం పైపడ్డది.

ఇలా వచ్చిన వారంతా చాలా మటుకు చిత్రకారులే. మనదేశంలో రాజ నివాసాలలో పర్దా వెనుకనే స్త్రీలు, రాణులు ఉంటారని పర్దా లోపలికి ఒక్క రాజుకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్న విషయం తెలుసుకున్న ఒక ఇంగ్లండు చిత్రకారిణి కన్ను కూడా మనదేశంపై పడింది. పడటమే తడవుగా ఓడ ఎక్కి మనదేశం పయనమై వచ్చింది. ఆమె పేరు ఇ.ఎం. మెర్రిక్ ఈమె 1842 లో

లండన్ లో జన్మించింది. పైన ప్రస్తావించిన (Royal Academy of Arts) లో చిత్రకళను అభ్యసించింది. రెండు సంవత్సరాల విద్యాభ్యాసం తరువాత ఈమె వేసిన ఒక పోర్ట్రయిట్ (Portrait) చిత్రానికి వెండి పతకం లభించింది. 1884లో తన స్వంత చిత్రశాల(Studio) నెలకొల్పి (Royal College of Surgeons) కి ప్రెసిడెంటు అయినా జాన్ మార్షల్ రూపచిత్రాన్ని తన తొలిచిత్రాన్ని వేసింది. ఈమెకు వెండిపతకం తెచ్చిన చిత్రమది. ప్రైమ్‌రోజ్ డే (Prime rose day) అనే మరోచిత్రము ఆ సంవత్సరం Royal Academy లో ప్రదర్శింపబడినాయి.

తరువాత స్నేహితులతో కలసి మెర్రిక్ ఈజిప్టు వెళ్లి కైరో ప్రప్రథమంగా పర్దా వెనక ఉండే స్త్రీలను చూసింది. లండన్ తిరిగి వెళ్లిన తరువాత నవంబర్ 1891లో ముంబాయి చేరుకుంది. రైలులో పూనెకు వెళ్లింది. అక్కడినుండి అప్పట్లో దేశ రాజధానిగాఉన్న కలకత్తా చేరుకుంది. అక్కడ జరిగిన చిత్రకళా ప్రదర్శనలో రెండుచిత్రాలను ప్రదర్శించింది. ఒకదానికి వెండిపతకంరాగా రెండోదానికి ప్రశంశాపత్రం వచ్చింది. దీనితో స్థానికులు మెర్రిక్ ను గుర్తించసాగారు.

కలకత్తాకు ఆరోజుల్లో ఒక రాత్రి ప్రయాణపు దూరంలో ఉన్న డుమ్‌రాన్ Dumraon అనే సంస్థానం నుండి ఆహ్వానం వచ్చింది. అక్కడి రాజు మెర్రిక్ తనచిత్రాన్ని గీసేందుకు వచ్చినప్పుడుఉ ఆరాజు తాను దివాన్ పై నేల మీద కూర్చుంటానని తన మంది మార్బలం చుట్టూ వుంటారని అన్నాడట. నిజానికి అంతవరకు మనదేశంలో రూపొందించిన రాజుల చిత్రాలు అన్నీ ఈ తీరునే ఉంటాయి. రాజు పక్క సేవకులు ఉంటే అందులో ఉన్నది రాజుని చూసినవారికి ఇట్టే తెలుస్తుంది. ముఖం నుండి భుజాలదాకా నేటి పాస్‌పోర్టు ఫోటోలా ఉండటం పాశ్చాత్యుల లక్షణం మెర్రిన్ ఆ రాజుతో ఈ మాటే చెప్పింది. ఆ చిత్రం పూర్తి అయిన తరువాత ఆరాజు చూసి "అచ్చం నన్ను నేను అద్దంలో చూసుకున్నట్టుంది."అన్నాడట. చెక్కురూపేణా డబ్బు చెల్లిస్తారులే అనుకుందట మెర్రిక్ నోట్ల కట్టలున్న మూట పంపాడల రాజు ఇతరుల సాయంలేకుండా దాని పైకెత్తడం అసాధ్యమని మెర్రిక్ చెప్పింది. ఆరోజులల్లో తైలవర్ణచిత్రం వేసినవారికి అంత పారితోషికం ఇచ్చేవారు.

మెర్రిక్ డుమారాన్ నుండి బెనారస్, లక్నో, ఢిల్లీలను సందర్శించింది. అక్కడి నుండి రావల్ పిండి చేరుకుంది. అక్కడ తనకు ఆశ్రయం ఇచ్చిన ఇంగ్లీషు స్త్రీని

ఆమె పెంపుడు కుక్కను ఓ చిత్రంలో చిత్రీకరించింది. ఇలా కుక్కతో పాటు తమ బొమ్మ వేయించుకోవటం ఇంగ్లీషు వారి అభిరుచి. తరువాత ఇలాంటి చిత్రాలు రాజ రవివర్మ లాంటి మన చిత్రకారులు కూడా వేశారు. రావల్పిండి నుండి మెర్రిక్ మధుర చేరుకుంది. ఆగ్రా చూసింది. తాజ్ మహల్ ఎర్రకోట ఫతేపూర్ సిక్రి చూసింది. ఎండ తీవ్రత పెరగటం తో మెర్రిక్ సిమ్లాచేరుకుంది. అప్పట్లో వైస్ రాయ్‌గా ఉన్న లార్డ్ లాన్స్ డౌనే Lord Lansdowne భార్య చిత్రాన్ని వేసింది. అక్కడ డోల్‌పూర్ రాజైన మహారాజు రాణి యొక్క చిత్రాలు వేసింది. ఆయనకు తన పెద్దపెద్ద ముత్యాల నగలు కిరీటం అంటే ఎంతో మక్కువ. రాణి వాటిని ధరించగా మెర్రిక్ చిత్రాలు వేసింది. అక్కడినుండి పూనె మీదుగా ఉదకమండలం చేరింది మెర్రిక్.

మెర్రిక్ ఉదకమండలంలో మద్రాసుకు చెందిన లార్డ్ బిషప్ (Lord Bishop ) సహోదరి అయిన మిస్ గిల్ (Miss Gell) ఇంట్లో ఉన్నది. జెల్ కూడా చక్కని చిత్రకారిణి. తన ఇంటినంతా జల వర్ణంతో తాను వేసిన ఉదక మండలం చిత్రాలతో అలంకరించింది. మెర్రిక్ మేజర్ గ్రాంట్ Major Grant అనే అతని రూపచిత్రాన్ని వేసింది. ఊటినుండి బెంగుళూరు చేరి మైసూరు మహారాజైన చామరాజ ఒడయార్ (r. 1868-1894) ని కలిసింది. మైసూర్ వెళ్లి చాకేజి వడయార్ చిత్రాన్ని ఆయన ఐదుగురు పిల్లలను చిత్రీకరించింది. మైసూర్ మహారాని మాత్రం చిత్రకారిని కలిసేందుకు ఇష్టపడలేదట. ఇంతకు పూర్వం ఓ దొరసారి కలిసినప్పుడు ఆ రాణి ఆయా లాగా ఉన్నదన్నందున మైసూరు మహారాణికి కోపం వచ్చిందట. మైసూరు నుండి బెంగళూరు మీదుగా మెర్రిక్ హైదరాబాద్ చేరింది.

హైదరాబాద్‌లో నైజాం నవాబును ను మెర్రిక్ కలసి చిత్రకారిణిగా పరిచయం చేసుకుంది. తన చిత్రాన్ని ఆమె వేస్తానంటే అంగీకరించిన నవాబు, తాను ఆమె ఎదురుగా కూచోనని అలాగే తన చిత్రం వేయాలని అన్నారట. మొగల్ దక్కను దర్బారుల లో ఇదే పద్ధతి ఆనాటి వరకు ఆచరణలో ఉండేది. మన ప్రాచీన చిత్రకారులు ఒక వ్యక్తి రూపురేఖాచిత్రం వేయాలంటే ఆ మనిషి ఎదురుగా కూర్చోవలసిన పనిలేదు. ఎదురుగా కూర్చునప్పుడు మాత్రమే చూసి చిత్రీకరించటం పాశ్చాత్యపద్ధతి.

మెర్రిక్ హైదరాబాదులో ప్రధానమంత్రికి ఒక వ్యక్తి చిత్రం మాత్రమే వేశానని చెప్పింది. ఓ పారసీ స్త్రీ మెర్రిక్‌ని కలసి ఓ వ్యక్తి Photo ఫోటో చూపి ఈ చనిపోయిన బంధువు చిత్రం వేయమని అడిగిందట. 'ఇంగ్లీషు కళాకారులు ముఖాలు బాగానే వేస్తారు. నగలు వగైరా మాత్రం శ్రద్ధగా వేయరు. అని అన్నదట. మనకు మన ఆడవారికి ఆదిమ కాలం నుండి నేటిదాకా నగలంటే ఎంతో మోజు. ఇంతకూ తాను వేసే చిత్రానికి ఎంత రుసుము తీసుకునేది మెర్రిక్ తెలిపాక ఆ పారసీ స్త్రీ 'ఫోటోగ్రాఫర్ కన్న నువ్వెందుకు అంతఖరీదు వసూలు చేస్తావ్" అని వెళ్లిపోయిందట. నిజానికి యూరోప్‌లో ఫోటోగ్రఫీ వచ్చాక ఈ మాధ్యమం Photography పై గట్టి దెబ్బకొట్టింది. అక్కడ వృత్తి దొరకని వారు వేరే తరహా చిత్రాలు వేయటం చేతగాని వారు మనదేశంపై పడి కొంతకాలం కాసులు చేసుకున్నారు. ఇక్కడ కూడా వ్యాపించిన ఫోటోగ్రఫీ అదే పనిచేసింది. ఆ రోజుల్లో రాజా దీన్‌దయాళ్ అనే ఫోటోగ్రాఫర్ Photographher హైదరాబాదులో ఎంతో పేరు తెచ్చుకున్న వ్యక్తి. ఇతను ఒక ఫోటోకి ఎంత రుసుము తీసుకునేవాడో తెలియదు కాని, అది తైలవర్ణచిత్రం కన్నా చవకగా గానే ఉండి ఉంటుంది. మెర్రిక్ హైదరాబాద్ కు సంబంధించిన మరో కథనం కూడా చెప్పింది.

ఒకసారి నల్లగా, స్థానికుల కన్నా నల్లగా ఉన్న ఓ వ్యక్తి కలసి మెర్రిక్ తో తన చిత్రం వేయమని మాట్లాడట. మాటల్లో మెర్రిక్ అతనిని స్థానికులతో పోల్చగా "మేడం ఐయామ్ ఆన్ ఇంగ్లీషు మాన్ " అని చెప్పి కోపంతో వెళ్లిపోయాడట.

హైదరాబాద్‌నుండి కొంత నిరాశతో మెర్రిక్ తిరగి ఊటీ వెళ్లింది. అక్కడ Laddy Wenlock ఆతిథ్యంలో ఆమె చిన్న కుమార్తె IreneLawely లను ఒక తైలవర్ణ చిత్రం చిత్రీకరించింది. ఊటిలో తొలిసారిగా మెర్రిక్ విజయనగరం మహారాజైన ఆనందగజపతిని కలసింది. ఆయన ఎంతో ఉత్సాహం చూపి తమ నగరాని కి వచ్చి తన తల్లి అక్క భార్య చిత్రాలను వేయవలసిందిగా కోరాడు. మైసూరులో తాను కొన్ని చిత్రాలు వేయవలసి ఉన్నదని ఆ పని పూర్తిచేసి వస్తానని మెర్రిక్ చెప్పింది.

ఊటీ నుండి మరలా మైసూరు చేరిన మెర్రిక్ చామ రాజవడయార్ చిత్రాన్ని ఆయన ఐదుగురి పిల్లల చిత్రాన్ని వేసింది. వారు ఎంతో వినయ విధేయతలు కలవారని మెర్రిక్ తెలిపింది.అంతేగాదు ఆంగ్లం తెలిసినా మట్లాడేందుకు

సిగ్గుపడేవారని తన పిల్లలను ఆభరణాలతో అలంకరించి గాత్రంగా కపడే విధంగా చిత్రించమని రాజు కోరాడని ఆమె చెప్పింది. మైసూరులో ఘనంగా జరిగే దసరా వేడుకలను చూసి మద్రాసు చేరి సముద్రమార్గంలో మెర్రిక్ మరలా కలకత్తా చేరింది.

ఒక్కరోజు కలకత్తాలో ఉన్నదో లేదో, ఆనంద గజపతి తాను ఇంకో ఎనిమిది రోజుల్లో తన నగరం వెళతానని తన చిత్రాన్ని ఈలోగా వేయాలని కోరాడు. ఆమె చిన్న canvas ను వెంట తీసుకువెళితే ముందుగానే ఓ పెద్ద canvas ను ఆనంద గజపతి సిద్ధంచేసి ఉంచాడట. అంతపెద్దచిత్రం అతి తక్కువగా కాలంలో వేసేందుకు అనువైన గది వెదకగా ఆ గదికి గల కిటికీలకి stand `glass` windows ఉన్నాయట. ఆ రంగురంగుల అద్దాలకిటికీ తలుపులు తీసేయించి మెర్రిక్ చిత్రాన్ని పూర్తిచేసింది.

ఈ సందర్భంగా ఆనందగజపతికి చాలా అందగాడని గొప్ప కళాపోషకుడని మెర్రిక్ చెప్పింది. అతని ఆస్థాన చిత్రకారుడు చిత్రనిర్మాణంలో ఎంతో సాయం చేశాడని చెప్పింది. ఈ అస్థాన చిత్రకారుని పేరేమిటో తెలియకపోవటం శోచనీయమైన విషయమే.

ఆనందగజపతి స్వయంగా మంచిచిత్రకారుడని, మంచి Sketches వేయగలడని తాను వేసి ఉత్తరం చదువుతున్న తెలుగు స్త్రీ చిత్రం చూపాడని అది చాలా బాగున్నది మెర్రిక్ కితాబిచ్చింది.

ఇలా ఉత్తరం చదువుతున్న స్థానిక వనిత చిత్రం చూచిన మెర్రిక్ "మీరు స్త్రీలకు కూడా ఉత్తరాలు వ్రాస్తారా?" అని అంటే అందుకు సమాధానంగా "ఓ వ్రాస్తాము. నిజమే. కాని ఎక్కువసార్లు భార్యకు కాదు" అని చెప్పాడట. హాస్యానికి, చమత్కారానికి ఆరోజులలో విజయనగరం పెట్టింది పేరు. గురజాడ వారి కన్యాశుల్కం ఇందుకు కొండంత గుర్తుకాగా ఆనందగజపతి చేసిన ఈ చిన్ని చమత్కారం ఓ మైలురాయి.

చిత్రాన్ని మెర్రిక్ వేస్తున్నంత సేపూ, ఆనందగజపతి హుందాగా కదలకుండా కూర్చునేవాడట. తాను విశ్రాంతి తీసుకుందుకు ఎటువంటి సమయమూ ఇవ్వకపోయినా ఏమీ అనకుండా ఉండేవాడట. ఒకసారి మధ్యలో మీ చిత్ర కళాకారులందరికి ఉండవలసినది నేను ఇస్తాను కాదననక గ్రహించండి అని

వజ్రాలుపొదిగిన గాజుకు అమర్చిన గడియారంని బహూకరించాడట. చిత్ర కళాకారులకు సమయస్ఫూర్తి ఉండాలని చిత్రం వేయించుకునేందుకు కూర్చున్న వారికి కొంత విశ్రాంతి సమయం ఇవ్వాలని ఎంత హుందగా సూచించాడా అని మెర్రిక్ ఆశ్చర్యపోయిందట.

ఆనందగజపతి తన పరివారంలో విజయనగరం వెళ్లాక కొన్నాళ్లు ఆ చిత్రానికి కొసమెరుగులు దిద్ది 1892లో కలకత్తా లో జరిగిన చిత్రకళా ప్రదర్శనలో ఈచిత్రాన్ని మెర్రిక్ ప్రదర్శించింది.

ఆనందగజపతి చిత్రకళలో తాను సాధించదలచిన విషయం గూర్చి మెర్రిక్ తో చెబుతూ ఇలా అన్నాడట.

"... to paint a large picture of Britannia with one hand taking off the chains of slavery and with the other putting out the funeral pyre."

మెర్రిక్ వేసిన ఆనందగజపతి చిత్రం కలకత్తా చిత్ర ప్రదర్శనలో చూసిన తరువాత మహారాజాజ్యోతీంద్ర మోహన్‌ఠాగూర్ తనచిత్రం వేయమని మెర్రిక్ కోరాడట. ఈ జ్యోతీంద్రనాథ్ ఠాగూర్ (1849-1925) రవీంద్ర నాథ్ ఠాకూర్ అన్న అయిన దేవేంద్రనాథ్ ఠాగూర్ యొక్క ఐదవ కుమారుడు. తన ముఖం పూర్తిగా వెలుగులో ఉన్నట్లు వేయమని ఒక చెంప వైపు ఎక్కువ వెలుతురు ఉన్నట్లు మరొక చెంప వైపు తక్కువ వెలుతురు ఉన్నట్లు వేయవద్దని అలావేసే భార్యలు తన ముఖం వైపు నల్లగాను మరో వైపు తెల్లగాను ఉంటుందని అపార్థం చేసుకుంటారని దేవేంద్రనాథ్ అన్నాడట. ఈయన భార్యలు కేవలం పరదా వెనుక ఉండటమే కాక తలలపై ముసుగేసుకుని భర్తముఖం కూడా సూటిగా చూడరు కానీ మెర్రిక్ కు వేసిన చిత్రంలోనే భర్తముఖం చూచినట్టున్నారు.

జ్యోతీంద్రనాథ్ మరొక సోదరుని కొడుకు అబనీంద్రనాథ్ ఠాగూర్ అప్పట్లో కలకత్తా కాలేజీఆఫ్ ఆర్ట్సులో (E.B.Harell) వద్ద చిత్రకళను అభ్యసించేవాడు. మెర్రిక్ వేసే చిత్రాన్ని నిశితంగా పరిశీలించాడట. తైల వర్ణ చిత్రం మెలుకువలను అడిగాడట. చర్మంరంగు Skin colourఎలా కలపాలి అని అడిగాడట.

భింగ (Bhinga) అనే ప్రాంతపు రాజు ఈ చిత్రాన్ని చూసి తన చిత్రం కూడా వేయమని మెర్రిక్ ని కోరాడు. తన నగలు అన్నీ తేలేదని ఊహించి కొన్ని నగలు ఉంగరాలు చిత్రంలో అదనంగా వేయమని కోరాడట. తాను

హుక్కా కాలుస్తున్నట్లు గా కూడా చూపాలని చెప్పాడట. తన వెంట తెచ్చుకున్న హుక్కా చిన్నదైనందున స్థానిక రాజును పెద్ద హుక్కా ఇమ్మని అడిగాడట. ఆయన చిన్న హుక్కా సమకూరిస్తే మెర్రిక్‌ను దాన్నే ఊహించి పెద్ద హుక్కా వేయమన్నాడట. ముఖం మూడు వంతులు పక్కకు తిరిగినట్లుగా చిత్రీకరిస్తే తన రెండవ చెవికి తగిలించిన ముత్యాలపోగు కనిపించకుండా పోయిందని వాపోయాడట. భారతీయ చిత్రకళలో ముఖం ప్రక్కకు తిరిగినట్లు (Profile face) వేసినా రెండు కళ్లు , రెండు చెవులు చూపటం పరిపాటి.

ఈ చిత్రం తరువాత వైస్రాయ్ చిత్రాన్ని కెనడా ప్రభుత్వం కొరకు మెర్రిక్ రూపొందించింది. అప్పటికి మద్రసు కలకత్తా మధ్య రైలు సౌకర్యం ఏర్పడగా మెర్రిక్ రైలులో నాగపూర్ మీదుగా మద్రాసు చేరింది. ఈమె వేసిన చిత్రాలు మద్రాసు చిత్రకళా ప్రదర్శనలో ఉండటమే కాక The Madras Times అనే పత్రికలో సమీక్షకూడా వెలువడిందట.

మెర్రిక్ మరలా ఓడ ప్రయాణం చేసి మద్రాసు నుండి భీముని పట్నం (భీమిలి) చేరి విజయనగరం వచ్చింది. ఆ సాయంత్రం ఆనందగజపతి మెర్రిక్ ను తన తల్లి అయిన అలకారాజేశ్వరి, రేవా మహారాణిగా పేరు తెచ్చుకున్న తన అక్క అయిన అప్పల కొండాయమ్మ తన భార్య అయిన వనకుమారీదేవిల చిత్రాలను వేయవలసిందింగా కోరాడట. వీరు ముగ్గురూ తమకు తెల్లగా ఉన్నట్టుగా చూపమని కోరారట. రేవా మహారాణి విక్టోరియా మహారాణి వేసుకునే దుస్తుల వంటి దుస్తులలో ఉన్నట్లుగా చిత్రీకరించిందట. మెర్రిక్ తోపాటు మద్రాసు నుండి వచ్చిన దాసి ఈ చిత్రాన్ని చూసి "అచ్చం విక్టోరియా మహారాణిలాగా ఉంది." అని అంటే రెవా మహారాణి సంతోషించి ఐదు రూపాయల బహుమానంతో పాటు, మామిడి ఆవకాయజాడీ బహుమానంగా ఇచ్చిందట.

మెర్రిక్ కి వీడుకోలుగా ముగ్గురు రాణులు ఎన్నో విలువైన నగలు బహూకరించారు. ఆనందగజపతి చెప్పలేనంత ధనం ఇచ్చాడు. నెలరోజులు విజయనగరంలో ఉన్న మెర్రిక్ తన ఆయాతో పాటు ఓడ ప్రయాణం చేసి మద్రాసు చేరుకుంది. వసతి గృహం చేరాక ఆయా భోరున ఏడ్వసాగిందట. ఎవరైనా బంధువు పోయాడేమోనని మెర్రిక్ అనుకున్నదట. పోయింది రేవా

మహారాణి ఇచ్చిన మామిడి ఆవకాయ జాడీ. ఓడలో ఎవరో కొట్టేశారు అన్నాడట.

ఇ.ఎం. మెర్రిక్ ఈ విశేషాలన్నీ తాను రచించిన (With A Palette in Eastern Palaces 1899)అనే పుస్తకంలో వివరించింది. మెర్రిక్ విజయనగరం మైసూరులో వేసిన చిత్రాలు ఎక్కడైనా ఉన్నాయేమో నని గాలించాను. నేటివరకు సఫలీకృతం కాలేకపోయాను. తెలుగునాట కళా చరిత్ర శాఖ వారెందరో ఒక చేతి వేళ్ల మీద లెక్కపెట్టవచ్చునన్నంత మందేవున్నారు. కాని, ఇంగ్లండు లో కోకొల్లలుగా ఉన్నారు. అయినా అక్కడా మెర్రిక్ గూర్చి ఎటువంటి పరిశోధనా జరిగినట్లు లేదు. ఆమె చిత్రాలు వెలుగులోకి వచ్చినట్టూ లేదు.

# రవివర్మ యుగం

తెలుగువాడైన కందుకూరి వీరేశలింగం పంతులు (1848-1919) కేరళ వాసి అయిన రాజా రవివర్మ(1848 -1906) ఒకే సంవత్సరాన జన్మించటం యాదృచ్ఛికంగా వచ్చును గాని, చెప్పుకోతగిన విశేషం. రవివర్మ తెలుగువాడు కాకపోయినా, చిత్రకళను తెలుగువారి నుండీ నేర్చుకున్నాడు. తిరువనంతపురం రాజ ఆస్థానంలో అళగిరినాయుడు అనే చిత్రకారుడు వుండేవాడు. అతని వద్ద రవివర్మ బంధువైన రాజారాజవర్మ తంజావూరు శైలిలోని చిత్రకళను అభ్యసించాడు. తన పద్నాల్గవ ఏట తిరువనంతపురం చేరిన రవివర్మ ఈతని వద్ద చిత్రకళలు శిక్షణ పొందాడు. రామస్వామి నాయకర్ అనే మరొక చిత్రకారుడు తైలం వర్ణం చిత్రాలను వేయటం ప్రారంభించాడు. అదే కాలంలో డచ్ దేశస్థుడైన థియోడర్ జాన్సన్ అనే చిత్రకారుడు తిరువనంతపురం రాజును ఆశ్రయించి కొన్ని చిత్రాలను వేశాడు. ఇతని వద్ద నుండి రవివర్మ తైలవర్ణ చిత్రణలో మెలుకువలు నేర్చుకొన్నాడు. 19 వశతాబ్దపు ఏడవ దశకంలో రాజకుటుంబీకుల రూపురేఖలను తైల వర్ణచిత్రాలు గా చిత్రీకరించాడు. 1873లో మద్రాసులో జరిగిన చిత్రకళా ప్రదర్శనలో పాల్గొనాడు. 1875లో ' లేఖ వ్రాస్తున్న శంకుతల' చిత్రానికి మద్రాసు చిత్రకళా ప్రదర్శనలో ప్రథమ బహుమతి లభించింది. అరోజుల్లో ఎక్కువగా ఇంగ్లీషు వారు పాల్గొంటున్న చిత్ర ప్రదర్శన పోటీలల్లో ఒకభారతీయ చిత్రకారుడికి ప్రథమ బహుమతి లభించటం ఎంతో విశేషం.

ఈ శంకుతల చిత్రం రవివర్మ మనసును హిందుపురాణాలు, ఇతిహాసాలవైపుకు మరల్చింది. మోనీర్ విలియమ్స్ సంస్కృతంలో మహాకవి కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాంకుతలమును ఆంగ్లంలోకి అనువదించి

అచ్చువేసిన పుస్తకానికి ముఖపత్రంగా రవివర్మ వేసిన శకుంతల చిత్రాన్ని ముద్రించాడు. ఇలా ఈ పుస్తకం దేశంలోనూ, ప్రపంచమంతటా చేరటంతో చిత్రకారుడిగా రవివర్మ పేరు నలుదిక్కులా మారుమ్రోగింది. అతనికి జాతీయ అంతర్జాయ ఖ్యాతి తెచ్చిపెట్టింది.

1875లో తిరువనంతపురం రాజు వద్ద దివానుగా ఉన్న సర్.టి. మాధవరావు బరోడా చేరి మహారాజా సయాజీరావు గైక్వాడు వద్ద దివానుగా చేరాడు. ఇతను రవివర్మ చిత్రకళా కౌశలం గూర్చి బరోడా మహారాజుకు తెలియచేశాడు. 1881లో బరోడా మహారాజు ఆహ్వానంపై రవివర్మ బరోడా చేరి 1887నాటికి 14 పురాణేతి హాసచిత్రాలను వేశాడు. వీటిలో రవివర్మ చిత్రీకరించిన 'సరస్వతి', 'లక్ష్మి' చిత్రాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.

విద్యాదేవత అయిన సరస్వతి ధనదేవత యైన లక్ష్మీదేవి పక్కపక్కనే తమ ఇంట కూడా ఉంటే బాగుండునని దేశంలోని రాజుల నుండి సామాన్య పౌరుడి దాకా అందరూ ఆశించారు. రవివర్మ తన తమ్ముడైన రాజారాజ వర్మ సహాయంతో ఇద్దరూ కలసి ఎన్నో పురాణేతిహాస తైలవర్ణచిత్రాలను రూపొందించారు. రెండు చేతులతో పనిచేసినా కొద్దిమందినే కాని అందరిని సంతృప్తి పరచటం వారికి అసాధ్యమయింది.

సర్.టి.మాధవరావు రవివర్మకు ఓ ఉత్తరం రాసి అందులో రవివర్మ తైలవర్ణచిత్రాలను ఆలియోగ్రఫ్ (Oleograph) పటాలుగా యూరోప్ లో ముద్రించి దేశం నలుమూలలా అమ్మవలసిందిగా సూచించాడు.

1885 మైసూరు మహారాజు కృష్ణరాయవడయార్ ఆహ్వానంపై మైసూరు చేరి మైసూరు ప్యాలెస్ దర్బారు మందిరంలో అలంకరించేందుకు ఎన్నో తైలవర్ణచిత్రాలను రవివర్మ రూపొందించాడు. వీటిలో సీతాపహరణం, సీతాస్వయంవరం, కృష్ణ రాయబారం, ఇంద్రజిత్తు విజయం వంటి చిత్రాలకు ఎంతో గుర్తింపు వచ్చింది. ఎందరో ఉన్నా కొందరికే ప్రవేశం ఉండే రాజ దర్బారులోని చిత్రాలు బహు కొద్దిమంది మాత్రమే చూసే అవకాశం ఉంది. అదే దసరా ఉత్సవాలు జరిగే దర్బారు మందిరం అని ఎందరో ప్రజలు చూచే అవకాశం ఉంది. అటువంటి దర్బారు మందిరంలో ఉన్న రవివర్మ చిత్రాలను ఎందరో చూసి మనసు పడ్డారు. ఇటువంటి చిత్రాలు మా వద్ద గాని ఉంటే

బాగుందు కదా అని అందరూ ఆశపడ్డారు.

1887లో వియన్నాలో జరిగిన చిత్రప్రదర్శనలో రవివర్మ చిత్రానికి బహుమానం వచ్చింది. ఈ కాలంలో బొంబాయిలో ఉన్న రవివర్మ పారసీ వారివి ఎన్నో చిత్రాలు రూపొందించాడు. అక్కడ ప్రదర్శించిన "హరిశ్చంద్ర మరియు శాకుంతలం" నాటకాలను చూసి ఎంతో ప్రభావితం అయ్యాడు. 1892లో వివేకానందుడు ఉపన్యసించటానికి ఒక సంవత్సరం ముందు చికాగోలో రవివర్మ వేసిన పదితైల వర్ణచిత్రాలు ప్రదర్శించబడినాయి. ఈ ప్రదర్శనలు హైదరాబాదుకి చెందిన రాజా దీనదయాళ్ కూడా పాల్గొనాడు. ఇద్దరూ బహుమతులను చేజిక్కిచ్చుకున్నారు.

1891- 92లో రవివర్మ తమిళనాడులో నీలగిరి.ooty లో కొంతకాలం ఉన్నారు. అప్పుడే అతనికి వివిధ సంస్థానాల రాజులతో దివాన్లతో పరిచయం, స్నేహం ఏర్పడింది. విజయనగరాన్ని పాలిస్తున్న ఆనందగజపతి వీరిలో ఒకరు. విదేశీచిత్రకారిణిని ఆదరించకుండా ఉంటాడా! విజయనగరంలోని మహారాజా ఆదరించిన ఆనందజగపతి మనదేశీయుడి కాలేజీకి మొదటి ప్రిన్సిపాల్‌గా ఉన్న సి. చంద్రశేఖర శాస్త్రి ఆంగ్లంలో గొప్ప పండితుడు. గురజాడ అప్పారావు ఈయన దగ్గరే చదువున్నాడు. వీరి ఇంటనే వారాలు వుండి పైకి ఎదిగాడు. 1887లో జగపతి ఈతని తైలవర్ణచిత్రాన్ని రవివర్మ చేత వేయించి కాలేజీ లో గుర్తుగా వుంచాడు.

విజయనగరం వారికి రవివర్మ ఎన్ని చిత్రాలు రూపిందించిందీ ఇంకా పరిశోధించవలసిన అంశం. విశాఖపట్నంలో ఎ.వి.ఎన్. కళాశాలను స్థాపించిన స్థానిక జమిందారు అంకితం వెంకట జగ్గారావు కూడా రవివర్మ చిత్రాన్ని ఒకదానిని కొన్నాడు. ఎ.వి.ఎన్. కళాశాల విద్యార్థిగా ఉన్న మాలపల్లి రామచంద్రశాస్త్రి రవివర్మ చిత్రాలను ప్రశంసిస్తూ కొన్ని పద్యాలను కవితలను రచించాడు. ఈ కళాశాలను చెందిన సెట్టిలక్ష్మీ నరసింహం కూడా కృష్ణాపత్రిక తదితర పత్రికలలో రవివర్మ చిత్రాలపై కవితలను ప్రచురించాడు. ఇవి అన్నీ ఒక సంకలనంగా "చిత్రమాలికలు" పేరిట 1932 లో వెలువడింది.

రవివర్మ 'రాధ' అనే తైలవర్ణ చిత్రాన్ని (చిత్రం : 16.1, 16.2) ఎవరికోసం వేశాడో అది ఇప్పుడు Dairy ఎక్కుడుందో నాకు తెలియదు. గురజాడ అప్పారావు

ఈ చిత్రంపై తన దినచర్యలో వ్రాసిన మాటలు చదివితే ఎంతో ఆశ్చర్యం వేస్తుంది. అందరూ ఎంతో గొప్పగా పొగిడేస్తున్న రవివర్మ చిత్రాలను ఇంత నిశితంగా విమర్శించటం ఆనాటికే కాదు, ఈనాటికే మరెవ్వరూ చేయనేలేదు. ఈ విమర్శలో గురజాడ ఏమన్నాడో చూడండి.

Radha has a rather stupid look. The left eyeblow stops much short of the corner of the eye. There are air of unreality about the face. The eyes are too large and I donot quite like the make of the mouth. The corners of the upper lip are too much expressed (a little too much my goodness! what eyelash!) But, the expressions throughly mild and innocent. Not at all that of Radha who should look volup tuous and forward at least the former

అసలు గురజాడ కు ఒక చిత్రాన్ని ఇంతని నిశతంగా విమర్శించే సత్తా ఎలా వచ్చిందా అని ఆశ్చర్యం వేస్తుంది. గురజాడ చదివిన పరిపరి గ్రంథాలలో కళా చరిత్ర (art history) గ్రంథాలు కూడా ఉన్నాయి. వాటిలో ఒకదాని పేరు Agincourt's History of Art

రవివర్మ తెలుగు వారి కొరకు ఎన్ని చిత్రాలు రూపొందించింది అనే విషయం ఇంకా పరిశీలించవలసి ఉన్నది. విజయనగరం జిల్లాలోని కురుప్పాం సంస్థానాన్ని పాలించిన వీరభద్ర సింగ్ దేవ్ చాలాగొప్ప వ్యక్తి. తనరాణి అంటే ఎంతో ప్రేమ గలవాడు. విశాఖపట్నం లో కురుప్పాం మార్కెటునుఇతనే కట్టించాడు. ఈ రాజు రాణిలను ఒక తైలవర్ణ చిత్రంలో (చిత్రం: 16.3) రవివర్మ పొందుపరిచాడు. రవివర్మ రూపొందించిన అన్ని చిత్రాలలోనూ ఇదే ఎంతో మెరుగైనదని నేను భావిస్తాను. ఆరాణి సౌందర్యం ఈ చిత్రం ఎంతో చక్కగాచూపుతున్నది. ఆమెపై ఆరాజుకు గల మమకారం కూడా అంతే హుందాగా ఈ చిత్రంలో రవివర్మ పొందుపరిచాడు. తనరాణి మరణించిన తరువాత ఈ రాజ ఆమెకు గుర్తుగా విశాఖపట్నంలో ఒక దేవాలయం వట్టి స్మారక మందిరాన్నినిర్మించాడు. దీనిని నేడు విశాఖ తాజ్ మహల్ అంటున్నారు. ఈ కట్టడం రోజురోజుకు శిథిలమై పోతోంది. కురుప్పాం రాజు రాణిలను చూపుతూ రవివర్మ రూపొందించిన చిత్రం మాత్రం వారి వారసుల వద్ద పదిలంగా ఉంది. నేటికీ చెక్కుచెదరకుండా మాసి శిథిలం కాకుండా ఉంది.ఈ చిత్రాన్ని ఇంత అందంగా వేసి రవివర్మ ఎంత అభినందనీయుడో దానిని అంతే పదిలంగా ఉంచిన నేటి కురుప్పాం

వారసులు కూడా అంతే అభినందనీయులు. గురజాడ ఈ చిత్రాన్ని చూచి వుంటే ఎటువంటి ప్రశంసా వాక్యాలు వ్రాసే ఊహిస్తూ ప్రస్తుతానికి ఉంటాను.

# చివరిగా

రవివర్మ యుగంతో ముగిద్దామనుకున్నా, చివరిగా చెప్పవలసింది కొంతవుంది. కేరళలో కొచ్చిన్ ప్రక్కనే మాటాంచెరి అనే దీవిలో మటాంచరి ప్యాలెస్ అనే రాజభవనంలో పదిలంగా రాజు గారి పడక గదిలో కొన్ని కుడ్యచిత్రాలున్నాయి. ఇందులో శేషశయనుడైన విష్ణుమూర్తి తననాలుగుచేతులతో చాలదన్నట్లు, రెండుకాళ్లు తో కూడా ఆరుగురు స్త్రీల పాలిండ్లను గిల్లటంటి చిలిపిశృంగార చేష్టలు చేస్తుంటాడు. జింకల రతిక్రీడ కూడా ఇక్కడి కుడ్యచిత్రాలలో గోచరిస్తుంది. ఇవన్నీ, మనదేశం లోనూ విదేశాలలోనూ చిత్రకళ అభిమానులకు చాలామందిని తెలుసు. పుస్తకాలలో చూడటం ద్వారా, స్వయంగా వెళ్ళి చూడడం ద్వారా ఈ చిత్రాల పరిచయం చాలా మందికే ఉంది. ఇంతకన్నా విశేషంగా చెప్పకునే కుడ్య చిత్రం ఇక్కడ మరొకటి ఉంది. కౌసల్య సుమిత్ర, కైకేయి వరుసగా నేలపై పడుకుని, తమతమ కాళ్లను బాగా ఎడంగా ఉంచి రామలక్ష్మణ భరత శతృఘ్నులకు జన్మ నిస్తున్న పురిటిదృశ్యం ఇది. ఇన్ని వింతల మరెన్నో విశేషాలు ఉన్నాయి గనక దృశ్యకళా కోవిదులు ఈ చిత్రాలను విశేషంగా చెప్పకొంటారు.

ఎక్కువమంది తెలుగు వారుచూచి, గమనించి సంతోషించి ఉండరు కాని, తెలుగునాటపై దానికన్నా గర్వంగా చెప్పకోతగిన కుడ్యచిత్రరాజం ఉంది. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకూర్మంలో గల శ్రీకూర్మనాథ దేవాలయంలో 18వ శతాబ్దంలో రూపొందించిన కుడ్యచిత్రం ఇది. దశావతారాలు, స్త్రీ పురుష సంభోగం తో ప్రారంభమయ్యే ఈ కుడ్య చిత్రంలో ఒక పెద్దచక్రంలో గోపికావస్త్రాపహరణం (చిత్రం : 17.1) చిత్రం ఉంది. చెట్టుపైన శ్రీకృష్ణుడు,

చెట్టుక్రింద వివస్త్రలైన వివిధ భంగిమలలో ఉన్న గోపికలు ఉన్నారు. ఇంతవరకు ఇదే కథాంశంగా ఉన్న చిత్రాలను భారతదేశం నలుమూలలనుండి ఏర్చికూర్చి ఒక చోట ఉంచితే కొన్ని వందలు తేలుతాయి. వీటిలో లేని సొగసులు ఎన్నో ఈ శ్రీకూర్మ గోపికా వస్త్రాపహరణంలో చిత్రంలో ఉన్నాయి. శ్రీకృష్ణుడు ఎక్కి ఉన్న విశాలమైన వృక్షం మీద అక్కడక్కడ చీరలు వేళ్లాడుతూ ఉంటాయి. ఈ అంశం కూడా అన్ని ఇతర చిత్రాలలోనూ ఉంటాయి మరెక్కడా చూడని విశేషం ఏమంటే ఈ చెట్టు చుట్టూ కందిరీగలు తూనీగలు పిట్టలు గాలిలో చెల్లాచెదరుగా ఎగురుతూ చెట్టుకు దూరంగా పోతూ ఉంటాయి. ఆహా! ఎంత చక్కని సొగసైన విషయం చిత్రీకరించారు. శ్రీకృష్ణుడు చెట్టు ఎక్కటమే కాక తాను అపహరించిన చీరలను ఒక్కొక్క కొమ్మపై అప్పుడే విసిరేశాడు. దానితో ఆకుల మాటున దాగి కొమ్మలపైన ఉన్న కందిరీగలు, తూనీగలు, పిట్టలు బెదిరి బయటకు వచ్చి చెట్టుకు దూరంలో పోతున్నాయన్న మాట. చెట్టు కింద ఉన్న గోపికలు ఎలా బెదిరిఉన్నారో అలాగే ఈ ప్రాణులు శ్రీకృష్ణుని చేష్టలకు బెదిరియున్నాయన్న మాట. ఇంతసొగసైన ఈ చిత్రణ నాకు తెలిసినంత వరకు మరెక్కడా లేదు. చెప్పుకోదగిన విశేషమే కదా.

ఈ గోపికా వస్త్రాహరణానికి కొంత ఆవల గోవర్ధన గిరిధారి కుడ్యచిత్రం (చిత్రం : 17.2) ఉంది. ఎంతో విశాలమైన పర్వతం దాన్నిండా ఎలుగుబంట్లు, రాతిగుట్టలు, వృక్షాలు, తాటిచెట్లు చూస్తే తూర్పు కనమలు గుర్తుకొస్తాయి. ఆ పర్వతం పైన మేఘాలు, బారులు తీరి ఎగిరిపోతున్న కొంగలు పర్వతం క్రింద మధ్యలో చిటికిన వేలిలో పర్వతాన్ని పైకెత్తిన కృష్ణుడు. ఇరుప్రక్కలా గోప బాలురు, గోవులు ఈ గోపబాలురు కొందరు చేతి కర్రలు పట్టి ఉంటారు. వీరిలో కొందరు తమ చేతి కర్రనుపైకెత్తి పర్వతం కింద ఆన్చి ఉంటాడు. ఇదొక సొగసు, కృష్ణుడు మధ్యలో చిటికిన వ్రేలుతో కదా పర్వతాన్ని పైకెత్తింది. ఎక్కడ పడిపోతుందోనని, ప్రక్కకు వొరుగుతుందమో నన్న భయంతో వీరు కర్రలు ఆన్చారు. తెలుగు సాహిత్యం లో శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తటం గోప బాలుర ప్రతిస్పందన పర్వతంలో విశేషాలు ఇంతసొగసుగా వర్ణించారో లేదో నాకు తెలియదు. కానీ, ఈ కుడ్యచిత్రంలో ఎంకా ఎన్నో సొగసులు నాకు అనుభూతి పరంగా తెలుస్తున్నాయి. ప్రతీసారి వెళ్లి చూచినప్పుడల్లా ఏదో ఒక కొత్త సొగసు గోచరిస్తోంది. ఇలాగే ఈ మధ్యనే గుర్తించిన మరోవిశేషం ఉంది.

శ్రీకూర్మ కుడ్య చిత్రంలో ఒకచోట ఒక మంటపంలాగా ఉన్న ఒక గదిలో ఓ స్త్రీ గొంతుకు కూర్చుని ఉంటుంది (చిత్రం : 17.3). ఒక స్త్రీ ని పక్కనుండి చూస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. ఈమె ముందు ఒక పురుషుదు వంగి ఆమె పాదాలదాకా చేతులు వంచి మందిరం వెలుపల నుంచొని ఉంటాడు. నేను ఈ చిత్రాన్ని చాలాసార్లు చూచినప్పుడల్లా ఎంటి చెప్మా? ఈ దృశ్యం అనుకునేవాణ్ణి ఇది దేవకీదేవి శ్రీకృష్ణుడిని ప్రస్తవిస్తున్న దృశ్యం. ఇంకా బిడ్డపుట్టలేదు. కాని వసుదేవుడు పుట్టిపుట్టిక మునుపే తన కుమారుణ్ణి ఆత్రంగా చేతిలోకి తీసుకొని వేళ్లేందుకు మందిరం ముందర వంగి చేతులు చాచి వంచి వున్నాడు. ఇలా ప్రసవ దృశ్యం అందునా దేవకీ శ్రీకృష్ణుని ప్రసవించే దృశ్యం చూపటం, ఎటువంటి అసభ్యత లేకండా ఉండటం ఎక్కడ బిడ్డపుట్టంగానే ఏడుస్తాడో ఎక్కడ కంసుదు విని సంహరిస్తాడోనని ఆత్రుతతో చేతులు వంచిన వసుదేవుణ్ణి ఆత్రుత చూపటం ఇక్కడే ఉంది నాకు తెలిసినంత మరెక్కడా లేదు. శ్రీకాకుళం జిల్లాలోనే మిళియాపుట్టి అనే సుదూర కుగ్రామంలో గల శ్రీకృష్ణ ఆలయంలో ఎన్నో శృంగార శిల్పాలు ఉన్నాయి. అందులో ఒకటి, ఒక స్త్రీ గొంతుకు కూర్చుని తన ముందు అలాగే కూర్చున్న మరొక స్త్రీ కాల్లు గట్టిగా పట్టుకుని ఉంటుంది. ఈమె కాలినడుమ నుండి చిన్న బిడ్డ తల బయటికి వస్తున్న శిల్పం ఇది చూచాక కాని నాకు శ్రీకూర్మంలో ఉన్నది కూడా ప్రసవానికి సంబంధించేదనని నాకు అర్థం కాలేదు. ఈ ప్రాంతంతో మెండైన పరిచయం గల ఓ మిత్రుడు కొన్ని కొండజాతులలో గుడిసెలో ప్రసవించే స్త్రీ చూరునుండి వేళ్లాడగట్టిన తాటిని పట్టుకుని గొంతుకు కూర్చొని ప్రసవించే విధానం ఉన్నదని చెప్పేదాకా సమగ్రంగా అవగాహనకాలేదు.

నేను అనుకుంటాను. తెలుగు సాహిత్యం పలుగు వంటిదని, తెలుగు చిత్రకళ అందంగా చుక్కల తోను, సొగసైన గీతలలో వేసిన విస్తరి వంటిదని. నేదు ఉన్న పరిస్థితులు చూస్తే గాలి దుమారంలో పలుగులే ఎగిరిపోతుంటే విస్తళ్లు మాగతేం అన్నాయట." అన్న సామెత గుర్తుకొస్తుంది.

Blank Page

Blank Page

## ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

- తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారు చేయడం.
- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషాసంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
- తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించడానికి చర్యల లు చేపట్టడం.
- తెలుగు పాలన, బోధన, ప్రసార మాధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
- తెలుగువారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం.
- తెలుగు జాతి చరిత్రపై, భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారుచేయడం.
- తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు నేలపై గల చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

**తెలుగు భాష వికాసం** **తెలుగు సంస్కృతి ప్రకాశం**

**దేశ భాషలందు తెలుగు లెస్స**